www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 204 | గురువారం 17-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



ప్రైవేటీకరణ కుట్రను సాగనివ్వం

23 నుంచి రక్షణ సిబ్బంది సమ్మె

సీపీఐ మద్దతు

న్యూఢిల్లీ: దేశ రక్షణ పరిశ్రమలను ధ్వంసం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న అత్యంత ప్రమాదకరమైన చర్యలకు నిరసనగా ఈ నెల 23 నుంచి 25 వరకు రక్షణశాఖ సిబ్బంది మూడురోజులపాటు సమ్మెకు నిర్ణయించారు. ఈ సమ్మెకు సీపీఐ పూర్తి తోడ్పాటునందిస్తున్నదని పార్టీ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి బుధవారం విడుదలచేసిన ప్రకటనలో వెల్లడించారు. రక్షణశాఖ మూడు పౌర విభాగాల సిబ్బంది సమాఖ్యల సంయుక్త పిలుపుమేరకు సమ్మె జరగనున్నది. ఆయుధ ఫ్యాక్టరీలు, పరిశోధన యూనిట్లు, నౌకా డాక్‌యార్డ్‌లు, వర్క్‌షాపులు, సైనిక డిపోలు, నావికాదళాలు, వైమానిక దళాలు, సైనిక ఇంజినీరింగ్ సర్వీసుల్లో పనిచేసే 4లక్షల సిబ్బంది ఈ సమ్మెలో

- మిగతా 11 లో

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. పల్లెల్లో అజ్ఞాన తిమిరాన్ని పారదోలాలని జాతీయోద్యమ కాలంలో.... గ్రంథాలయాల స్థాపన ఓ విప్లవాన్ని రగిలించింది. ప్రతి ఊరిలో గ్రంథాలయాన్ని నెలకొల్పి నవీన దేవాలయాలతో పోల్చిన చరిత్ర మనది. కానీ ఈ వ్యవస్థను పాలకులు పూర్తిగా విస్మరిస్తున్నారు. భవిష్యత్తు తరాలకు పుస్తకాలను దూరం చేస్తున్నారు. స్థానిక సంస్థల నుంచి రావాల్సిన బకాయికి ఎసరు పెడుతున్నారు. మరోవైపు సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. అనేక లైబ్రరీల్లో పుస్తకాలు కొనటం కాదుకదా.... కనీసం వార్తా పత్రికలు రప్పించే స్థోమతా లేకుండా పోయింది. మండలానికో గ్రంథాలయాధికారిని నియమించాల్సి ఉండగా... ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. వివిధ కేటగిరీల్లో రాష్ట్రవ్యాప్తంగా 900 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయటానికి కోర్టు కేసుల సాకుతో ఆర్థిక శాఖ కొర్రీ వేస్తోంది.

గ్రంథాలయాలకు అలసత్వ చెద..!

భారీగా సిబ్బంది కొరత

- ఏపీలో 900 ఖాళీలు
- భర్తీలో సర్కారు నిర్లక్ష్యం
- కోర్టు కేసుల సాకుతో జాప్యం
- వేలాదిమంది నిరుద్యోగులకు నిరాశ
- అదనపు భారంతో సిబ్బంది వెతలు



విజయవాడలోని ప్రభుత్వ గ్రంథాలయాల భవనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విజ్ఞానానికి నిలయాలుగా నిలుస్తున్న గ్రంథాలయాల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గ్రంథాలయాధికారులు, సిబ్బంది పోస్టుల భర్తీపై ప్రభుత్వం చొరవ చూపట్లేదు. మరోవైపు గ్రంథాలయాలకు పుస్తకాల కొనుగోలు, నిర్వహణలో ఆర్థిక సమస్యలు ఎదురవుతు న్నాయి. ఖాళీ పోస్టులు భర్తీ చేయనందున సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. గ్రంథాలయ కోర్సులు చదివి ఉద్యోగాల కోసం వేచిచూస్తున్న వేలాది మంది నిరుద్యోగుల భవిత ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ నుంచి 500 పోస్టుల భర్తీకి అనుమతిస్తూ ప్రభుత్వానికి లేఖ రాయగా.. దానికి వివిధ కోర్టు సాకుల పేరిట ఆర్థికశాఖ కొర్రీ వేసింది. ఈ ఉద్యోగాల కోసం అవసరమైన ఎంఎల్ఐసీ, బీఎల్ఐసీ, సీఎల్ఐసీ కోర్సులు చదివి.. ప్రకటన కోసం వేలాది మంది ఎదురు చూస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది కొరతతో రెండు, మూడు శాఖలకు ఒకే గ్రంథాలయాధికారి విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. వారంతా అదనపు

- మిగతా 2 లో

ఒక్కటవుదాం..

- కేంద్రంపై పోరాడదాం
- జగన్‌తో కేటీఆర్ బృందం చర్చలు
- ఫెడరల్ ఫ్రంట్‌ను స్వాగతించిన జగన్
- కేసీఆర్‌తో మరో విడత భేటీ



విలేకరులతో మాట్లాడుతున్న కేటీఆర్, జగన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : కేంద్రంలో జాతీయ పార్టీలు సమాఖ్య స్ఫూర్తిని మరచిపోయి, నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు తెలిపారు. ఈ పరిస్థితిలో మార్పు కోసం, రాష్ట్రాల హక్కులు కాపాడేందుకు టీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఏడాదిన్నరగా కృషి చేస్తున్నారన్నారు. దేశరాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలని, సమాఖ్య స్ఫూర్తితో జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయాలని భావించారన్నారు. ఈ ప్రక్రియలో భాగంగానే వివిధ రాష్ట్రాలకు చెందిన నేతలను కలిసి మద్దతు కోరినట్లు చెప్పారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, డీఎంకే చీఫ్ స్టాలిన్, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి తదితర నేతలతో సంప్రదింపులు జరిపారని గుర్తు చేశారు. తన ప్రయత్నానికి మద్దతు కూడగట్టడంలో భాగంగా కేసీఆర్ సూచన మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నాయకులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డితో భేటీ అయినట్లు చెప్పారు. బుధవారం మధ్యాహ్నం లోటస్ పాండ్‌లోని జగన్ నివాసానికి చేరుకున్న కేటీఆర్ బృందం గంటన్నరపాటు సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ప్రధానంగా ఫెడరల్ ఫ్రంట్‌లో వైసీపీ చేరే

- మిగతా 11 లో

మోడీ డైరెక్షన్‌లోనే...

- 'కేసీఆర్-జగన్' బీజేపీ జపం
- తెలుగు రాష్ట్రాలకు పెనుప్రమాదం
- షర్మిల కేసుపై సీఎం స్పందన సరికాదు..
- సర్కారు కనుసన్నల్లోనే రూ.కోట్లలో కోడి పందాలు..
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన పీజే చంద్రశేఖర్, ఓబులేసు, జల్లివిల్సన్, జేవీఎస్ఎన్ మూర్తి, రావుల వెంకయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రధాని మోడీ డైరెక్షన్లోనే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌ను తెర మీదకు తీసుకు వస్తున్నారని, దీంతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు పెనుప్రమాదం పొంచి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు, లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ మోడీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని స్పష్టంచేశారు. మోడీ పేరు చెబితే తెలుగు రాష్ట్రాల ప్రజలు ఓట్లు వేసే

- మిగతా 2 లో

శబరిమలలో మళ్లీ ఉద్రిక్తత..!

- ఇద్దరు మహిళా భక్తుల అడ్డగింత
- రెచ్చిపోయిన ఆందోళనకారులు
- పోలీసులపై రాళ్లు, కొబ్బరి చిప్పలతో దాడి

9లో

'కోటా'.... కోట కాదు

- పట్టుకోసమే రిజర్వేషన్ ఎత్తుగడ
- బలపడుతున్న విపక్షాల ఐక్యత

9లో

కోటిపల్లి-నరసాపూర్...!

కోటిపల్లి..నరసా'పూర్' రైలు ప్రాజెక్టు దశాబ్దాలుగా నత్తతో పోటీపడి... మూడేళ్ల కిందట ఊపందుకున్నట్టు కనిపించినా... అంతర్లీనంగా కేంద్రం ఆంధ్రులను మరోసారి దగా చేసిన వైనం తేటతెల్లమవుతోంది.



గౌతమి నదిలో వంతెన నిర్మాణంలో జరుగుతున్న పిల్లర్ పనులు

ప్ర'గతి' తప్పిన వైనం

- కేటాయింపు రూ.840 కోట్లు
- ఖర్చు రూ. 323 కోట్లు
- రూ. 516.79 కోట్లు వృథా
- అవసరం 908 ఎకరాలు
- చేతికి వచ్చింది 276...
- మిగిలింది 632 ఎకరాలు
- కేంద్రం మరో దగా
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు కోసం కేటాయించిన నిధులు, చేసిన ఖర్చులు ఇలా ఉన్నాయి.

సంవత్సరం	కేటాయించిన మొత్తం	ఖర్చు చేసిన మొత్తం
2014-15	రూ. 5 కోట్లు	రూ.1.33 కోట్లు
2015-16	రూ. 5 కోట్లు	రూ.3.39 కోట్లు
2016-17	రూ. 200 కోట్లు	రూ.184.64 కోట్లు
2017-18	రూ. 430 కోట్లు	రూ.60.51 కోట్లు
2018-19	రూ. 200 కోట్లు	రూ.73.34 కోట్లు
మొత్తం	రూ. 840 కోట్లు	రూ. 323.21 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : కోనసీమలో రైలు కూత ఇప్పట్లో వినిపించే పరిస్థితి కన్పించడం లేదు. కోనసీమ చిరకాల స్వప్నం కోటిపల్లి- నరసాపూర్ రైలుమార్గ నిర్మాణంపై దశాబ్దాలుగా నిర్లక్ష్యం నీడ వెంటాడుతోంది. తొలినాళ్లలో అరకొర నిధులు విదిలించిన రైల్వేశాఖ మూడేళ్లుగా పెద్ద మొత్తంలోనే నిధులు కేటాయిస్తోంది. అయితే పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడంతో ఆ నిధులు కాస్తా మురిగిపోతున్నాయి. దేశంలోని పలు ప్రాజెక్టులను త్వరితగిన పూర్తి చేసే ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోడీ తరచూ నిర్వహించే 'ప్రగతి' సమావేశాల్లో ఈ ప్రాజెక్టుకు చోటు లభించినప్పటికీ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. రైల్వేమంత్రి పీయూష్ గోయల్ ఈ ప్రాజెక్టు పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం. గడచిన ఐదేళ్లలో జరిపిన కేటాయింపులు, వ్యయాలను పరిశీలిస్తే ఎన్డీయే ప్రభుత్వం ఏపీ ప్రజలకు చేస్తున్న మోసం అర్థమవుతోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో రాష్ట్రంలో పలు రైల్వే ప్రాజెక్టులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



రిజర్వేషన్లు ఆహా పదిశాతం
రిజర్వేషన్లు ఓ హెూ హెూ
పదిశాతం రిజర్వేషన్లు

అరగంటే..!

గ్రూప్-2 అభ్యర్థులకు..కంప్యూటర్ 'టెస్ట్'

- భారీ సిలబస్-గ్రామీణుల గాబరా
- మెయిన్స్‌లో నెగ్గితే ఈ పరీక్ష తప్పనిసరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీపీఎస్సీ గ్రూప్-2కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కంప్యూటర్ ప్రాక్టీస్ టెస్ట్ కలవరం పెడుతోంది. గ్రూప్-2 మెయిన్స్ పూర్తయ్యాక చివరి దశలో ప్రతిభ ఆధారంగా కంప్యూటర్ ప్రాక్టీస్ టెస్ట్‌ను ఏపీపీఎస్సీ ప్రవేశపెట్టింది. ఇది అర్హత పరీక్షే అయినప్పటికీ..గ్రూప్-2 ఉద్యోగాల ఎంపికలో కీలకంగా నిలుస్తుంది. గతేడాది డిసెంబరు-31వ తేదీన గ్రూప్-2 ద్వారా 446 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ కమిషన్ ప్రకటన వెల్లడించింది. ఇందులో నాన్-ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్ పోస్టులున్నాయి. అతి తక్కువ సమయంలో కంప్యూటర్ టెస్ట్‌కు సన్నద్ధమవ్వడం కష్టతరమని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఈ సిలబస్ పీజీడీసీఏ,

- మిగతా 2 లో



రేపటి నుంచి ఎస్జీటీ పరీక్షలు

- భారీ సిలబస్‌తో అభ్యర్థుల అవస్థలు
- 17 సెషన్లలో ఆన్‌లైన్లో ఏర్పాటు
- అత్యధికంగా పేపర్ సెట్ల రూపకల్పన

3లో

బీజేపీ ఎన్నికల వల...!

- బ్యాంకు ఖాతాల్లో అజ్ఞాత లావాదేవీలు
- 10 వేల నుంచి 25వేలు జమ
- మూడు బ్యాంకుల్లో డిపాజిట్లు
- బారులు దీరిన జనం



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పాలక బీజేపీ ఎత్తులు, జిత్తులతో ముందుకు సాగుతోంది. అధికారమే ధ్యేయంగా కుట్రలు సాగిస్తోంది. రిజర్వేషన్ల వ్యవస్థకే వ్యతిరేకమని చెప్పుకునే బీజేపీ.. ఇటీవల 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ అగ్రవర్ణాలను ముగ్గులోకి దించే ప్రయత్నం చేసింది. ఇప్పుడు కిందిస్థాయి ఓటర్లను మెప్పించే పనిలో పడినట్టు కనిపిస్తోంది. మూడు బ్యాంకుల ద్వారా పలువురి ఖాతాల్లోకి రూ.10వేల నుంచి రూ.25వేల వరకు జమ అయ్యాయి. అయితే ఈ డబ్బు ఎక్కడిది? ఎవరు వేశారు? అన్న దానిపై స్పష్టత లేదు. సంబంధిత బ్యాంకులు సైతం వివరాలను వెల్లడించడం లేదు. 2014 ఎన్నికల సందర్భంగా మోడీ ఇచ్చిన హామీల విషయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ ఇప్పటికీ బీజేపీని

- మిగతా 11 లో

ప్రపంచం

గోడపై కొనసాగుతున్న ప్రతిష్టంభన

వాషింగ్టన్ : మెక్సికో సరిహద్దులలో గోడను నిర్మించేందుకు 5.7 బిలియన్ డాలర్లు మంజూరు చేయాలన్న అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదనను కాంగ్రెస్ (పార్లమెంటు) ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ఏర్పడిన ప్రతిష్టంభన ఇంకా కొనసాగుతోంది.

25 రోజులుగా ప్రభుత్వం పాక్షికంగా మూతపడటంతో 8 లక్షల మందికిపైగా సిబ్బందికి వేతనాలు చెల్లించలేదు. దిగువసభ స్పీకర్ నాన్సీపెలోసీతో జరిపిన చర్చలు ఫలించకపోవడంతో కాంగ్రెస్‌లోని ఇతర డెమోక్రటిక్ పార్టీ నాయకులతో చర్చలు జరపాలన్న ప్రతిపాదన ముందుకువచ్చింది. కొన్ని శాఖలు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రభుత్వాన్ని తిరిగి పనిచేయించినట్లయితే సరిహద్దులలో భద్రత అంశంపై చర్చించగలమని ప్రతినిధులు సభ, సెనేట్ తెలియజేసినట్టు వార్తలు వచ్చాయి. వచ్చేవారం సెలవు దినాలు అయినప్పటికీ వాటిని రద్దుచేసి సభకు హాజరవుతామని ఎగువసభ, దిగువసభ సభ్యులు తెలిపారు. గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసేదిలేదని పెలోసి స్పష్టం చేశారు. గోడ నిర్మించకపోయినా ఇనుపకంచెను నిర్మించడం ద్వారా భద్రత కల్పిస్తానని ఒక దశలో ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు, నిధులు ఇవ్వకపోతే ఎమర్జన్సీని ప్రకటిస్తానని హెచ్చరించిన ట్రంప్ ఆ తరువాత ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు. ప్రభుత్వం సుదీర్ఘకాలం సమ్మెలో ఉండటం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి అని భావిస్తున్నారు. తన డిమాండునుండి ఎట్టి పరిస్థితులలోను వెనక్కు తగ్గేదిలేదని ట్రంప్ తాజాగా ప్రకటించారు. ప్రభుత్వం పూర్తిగా పనిచేయకపోవడంవల్ల విమానాశ్రయ భద్రత కూడా ప్రమాదంలో పడుతుందని ట్రంప్ హెచ్చరించారు.

ఇటు ట్రంప్‌ను, అటు ప్రతినిధుల సభను ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వచ్చే మంగళవారం నాటికైనా సమస్యను పరిష్కరించాలని ట్రంప్ గడువు విధించినట్టుగా తెలుస్తోంది. ఇంతవరకు వేతనాలు పొందని 8 లక్షల సిబ్బంది వచ్చేనెలలో వేతనాల తేదీకైనా సమ్మె పరిష్కారమవుతుందా? లేదా అని ఎదురు చూస్తున్నారు. డెమోక్రాట్లంతా వైట్‌హౌస్‌లో లంచ్‌కి రావలసిందిగా ప్రభుత్వం ఆహ్వానించినప్పటికీ వారెవ్వరూ రాలేదని అనధికార వర్గాలు తెలిపాయి.

77 దేశాల గ్రూపు చైర్మన్‌గా పాలస్తీనా

వ్యతిరేకించిన అమెరికా, ఇజ్రాయిల్, ఆస్ట్రేలియా



ఐరాస : 77 అభివృద్ధి చెందుతున్న దేశాల గ్రూపు అధ్యక్ష పదవికి పాలస్తీనాను ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో పాలస్తీనాకు అనుకూలంగా 146 దేశాలు ఓటు చేయగా కేవలం అమెరికా, ఇజ్రాయిల్, ఆస్ట్రేలియా మాత్రమే వ్యతిరేకించాయి. 15 దేశాలు గైర్హాజరయ్యాయి. 29 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. అధ్యక్ష పదవిని పాలస్తీనా నిర్వహించినట్లయితే దానికి పూర్తిస్థాయి ఐరాస సభ్యత్వం లభించినట్లు అవుతుందని అమెరికా ఆరోపిస్తున్నది. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించకపోవడానికి అమెరికాయే ప్రధాన కారణం. వెస్ట్‌బ్యాంక్, గాజాస్ట్రిప్, తూర్పు జెరూసలెంతో కలిపి పాలస్తీనా స్వతంత్ర దేశాన్ని ఏర్పాటు చేయాలని సుదీర్ఘకాలంగా పోరాటం సాగుతోంది. అయినప్పటికీ అమెరికా, ఇజ్రా యిల్‌కు అండదండలనిస్తూ పాలస్తీనా ప్రజలను ఎంతమాత్రమూ గౌరవించడంలేదు. జనరల్ అసెంబ్లీ సమావేశంలో చేసిన తీర్మానాలను కూడా అమెరికా లెక్కచేయడంలేదు. వెస్ట్‌బ్యాంకు, గాజాస్ట్రిప్, జెరూసలెం ప్రాంతాలను 1967లో పశ్చిమాసియాలో జరిగిన యుద్ధం సందర్భంగా ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. తూర్పు జెరూసలెంను అది తన రాజధానిగా ఇటీవల పట్టించుకోగా అమెరికా, ఆస్ట్రేలియా మాత్రమే గుర్తించాయి. స్వతంత్ర పాలస్తీనాను గుర్తిస్తున్నట్టుగా 2012లో జనరల్ అసెంబ్లీ అత్యధిక మెజార్టీతో తీర్మానాన్ని ఆమోదించినప్పటికీ అమెరికా దాని అనుచర దేశాలు ఇజ్రాయిల్, ఆస్ట్రేలియాలు తిరస్కరించాయి. ఐరాస సభ్యత్వం లేకుండా పాలస్తీనా ప్రతినిధులు సమావేశాలలో మాట్లాడేందుకు అవకాశం లేకుండా పోయింది. 77 గ్రూపు దేశాలు, చైనా కలిసి తాజాగా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించాయి. ఈజిప్టు ముసాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించింది.

బ్రెగ్జిట్ ఓటమితో మరింత రిస్కు : ఫ్రాన్స్



బ్రస్సెల్స్ : బ్రిటన్ పార్లమెంటులో బ్రెగ్జిట్ ముసాయిదా ఒప్పందం ఓటమిపాలు కావడంతో యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుండి వైదొలగేందుకు రిస్క్ మరింత పెరిగిందని, ఒక పద్ధతి లేకుండా వైదొలగడం ఎలా సాధ్యమని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ వ్యాఖ్యానించారు. బ్రెగ్జిట్ ముసాయిదాపై జరిగిన ఓటింగ్‌లో తీర్మానానికి వ్యతిరేకంగా 432 మంది ఓటు చేయగా అనుకూలంగా 202 మంది మాత్రమే ఓటు చేశారు. దీంతో ప్రభుత్వం ఓటమిపాలయ్యింది. బ్రెగ్జిట్ ముసాయిదాను పార్లమెంటు తిరస్కరించినందున ప్రధానమంత్రి థెరిసామెపైన అవిశ్వాస తీర్మానం పెట్టాలన్న అంశం ముందుకువచ్చింది. బ్రిటన్ తన ఉద్దేశాలేమిటో తక్షణం వెల్లడించాలని, ఇప్పటికే సమయం మించిపోయిందని యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జీన్‌క్లాడ్‌జంకర్ వ్యాఖ్యానించారు. ఈయూ నుండి వైదొలగేందుకు కుదుర్చుకున్న ఒప్పందం న్యాయంగా ఉన్నదని వీలైనంత ఉత్తమ ఒప్పందం ఇదని జంకర్ అన్నారు. ఈ ఒప్పందం ఈయూ దేశాలలోని పౌరులు, వాణిజ్యసంస్థలకు జరగగల నష్టాన్ని తగ్గించిందని ఆయన చెప్పారు. బ్రిటన్ ఈయూ నుండి పద్ధతిగా వైదొలగవలసిందేనని ఆయన చెప్పారు. ఒకవేళ ఒప్పందం అసాధ్యమైతే, ఒప్పందం అవసరంలేదని అనేవారు ఎవరూలేరని, సానుకూలమైన పరిష్కారం చెప్పే సాహసం చివరకు ఎవరు చేయాలని ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు డొనాల్డ్‌టస్క్ ప్రశ్నించారు.

ఈ విషయంలో ఈయూలోని ఇతర 27 దేశాలు ఐక్యంగా ఉంటాయని ఆయన అన్నారు. తదుపరి పరిస్థితి ఏమిటీ అన్న అంశం బ్రిటన్ ప్రభుత్వమే తేల్చాలి అని బ్రెగ్జిట్ చర్చలలో ప్రధానపాత్ర వహించిన మైఖేల్‌బర్నియర్ అన్నారు. ఏదోఒక ఒప్పందం కావాలని ఈయూ కూడా కోరుకుంటున్నదని చెప్పారు. ఐరోపాకి ఇది తీవ్ర దుర్దినమని ఆయన వ్యాఖ్యానించారు.

వివిధ పార్టీలతో చర్చలు :

వివిధ పార్టీల ఎంపీలతో చర్చలు జరపడం ద్వారా పరిష్కారాన్ని కనుగొనాలని ప్రధాని థెరిసామె యోచిస్తున్నారు. అయితే ఈ చర్చలకు లేబర్ పార్టీనేత జెరిమికార్బిన్‌ను ఆహ్వానించకూడదని ప్రధాని భావిస్తున్నారు. ఈ చర్చలకు కార్బిన్‌ను ఆహ్వానించలేదన్న అంశాన్ని లేబర్ పార్టీ నాయకుడు లెడ్సం తెలిపారు.

జర్మనీలో విమానయాన సిబ్బంది సమ్మె

వందలాది విమానాలు రద్దు

ఫ్రాంక్‌ఫర్ట్ : జర్మనీలో 8 భారీ విమానాశ్రయాలలో పనిచేస్తున్న భద్రతా సిబ్బంది మంగళవారం సమ్మె చేయడంతో వందలాది విమానాల రాకపోకలు రద్దయి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వేతనాల పెంపుదలను డిమాండ్ చేస్తున్న భద్రతా సిబ్బంది సమ్మెకు దిగారు. అత్యంత రద్దీగావుండే ఫ్రాంక్‌పర్ట్ విమానాశ్రయంలో విమానాలు రద్దుకావడంతో వేలాదిమంది ప్రయాణీకులు ఇబ్బందులకు గురయ్యారు. అన్ని విమానాశ్రయాలలో కలిపి 2,20,000 మంది ప్రయాణీకులు ప్రయాణం చేసే అవకాశంలేక విమానాశ్రయాలలోనే ఉండిపోవలసివచ్చింది. మ్యూనిచ్, హనోవర్, బ్రెమెన్, హంబర్గ్, లెయిప్‌జిగ్, డ్రస్‌డన్, ఎర్‌ఫర్ట్ విమానాశ్రయాలలో భద్రతా సిబ్బంది వాకౌట్ చేశారు. ఫ్రాంక్‌ఫర్ట్‌లో 1200 విమానాలు బయలుదేరవలసి వుండగా 617 విమానాలను రద్దు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఐరోపాలోనే అత్యంత నాల్గవ భారీ విమానాశ్రయం ఇది. భద్రత ఉచితంగా రాదు అని నినాదాలు రాసిన బ్యానర్లను సిబ్బంది విమానాశ్రయంలో కట్టారు. సిబ్బంది ఎల్లోజాకెట్లను ధరించి సమ్మెలో పాల్గొన్నారు. అనేకమంది ప్రయాణీకులు ఇతర ప్రాంతాలలోని విమానాశ్రయాలకు బస్సుల ద్వారా చేరుకుని తమ గమ్యాలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. మ్యూనిచ్‌లో 100 విమానాలు రద్దయ్యాయి. వీటిలో అత్యధికం దేశంలోనే రాకపోకలు సాగించే విమానాలు వున్నాయి.

టునీషియాలో కార్మిక సమ్మె నేడు



టునీషియాలో ప్రభుత్వ సిబ్బంది, వివిధరంగాలలో పనిచేస్తున్న కార్మికులు గురువారం నుండి సమ్మె చేస్తారని, శక్తివంతమైన టునీషియా జనరల్ లేబర్ యూనియన్ అధికార ప్రతినిధి హాఫెడ్‌ఫాయిద్ తెలిపారు. సిబ్బందికి, కార్మికులకు వేతనాల పెంపునకు సంబంధించిన చర్చలు జరిగినప్పటికీ అంగీకారం కుదరలేదు. దీంతో దేశవ్యాప్తంగా 6లక్షల 70వేల మంది గురువారం నుండి సమ్మె చేస్తారని యూనియన్ అధికార ప్రతినిధి వెల్లడించారు. టునీషియా బడ్జెట్‌లోటును తగ్గించేందుకు ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న సిబ్బందికి, ఇతర కార్మికులకు వేతనాలను నిలుపుచేయాలని ఐఎంఎఫ్ ఒత్తిడి చేస్తోంది. తాజాగా జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మె తప్ప మరోమార్గం తమకులేదని యూనియన్ పేర్కొన్నది. ప్రభుత్వం కొత్తగా చేసిన ప్రతిపాదనను యూనియన్ తిరస్కరించిందని రాయిటర్స్ వార్తాసంస్థ వెల్లడించింది. అయితే ఇందుకు సంబంధించిన వివరాలను అది తెలియజేయలేదు. మంగళవారం జరిగిన చర్చలు విఫలమైనప్పటికీ మరోసారి చర్చలు జరుగుతాయా? లేదా అన్న అంశం కూడా స్పష్టం కాలేదు. వేతనాల పెంపుదలపై గత నవంబర్‌లో ప్రభుత్వం స్పందించకపోవడంతో దేశవ్యాప్తంగా 6.7 లక్షల మంది ప్రభుత్వరంగ సిబ్బంది, కార్మికులు ప్రదర్శనలు జరిపి సమ్మె చేశారు. 2020 నాటికి ప్రస్తుతమున్న జీడీపీ 15.5 శాతంలో ప్రభుత్వరంగ సంస్థలకు చేసే ఖర్చును తగ్గించడం ద్వారా 12.5 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం తలపెట్టింది. టునీషియా జీడీపీ లోటు చాలా ఎక్కువగావుందని ఐఎంఎఫ్ వ్యాఖ్యానించింది. ప్రభుత్వరంగ సిబ్బంది వేతనాల బిల్లు 2010లో 7.6 బిలియన్ దీనార్లువుండగా అది 2018 నాటికి 16 బిలియన్ దీనార్లకు (5.5 బిలియన్ డాలర్లు) పెరిగింది. బడ్జెట్‌లోటు తదితర కారణాలమూలంగా దేశంలో ఆర్థిక పరిస్థితులు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి.

అలసత్వ చెద..!

(మొదటిపేజీ తరువాయి)

విధులతో నిత్యం ఒత్తిడికి గురవుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో మండలానికి ఒక పోస్టు చొప్పున 564 గ్రంథాలయాధికారుల పోస్టుల భర్తీకి..అప్పటి సీఎం ఎన్టీ రామారావు అనుమతులిచ్చారు. అనంతరం 2003లో గ్రేడ్-3, అటెండర్లు/వాచ్‌మన్ పోస్టులు మంజూరు చేశారు. 13 కోస్తాజిల్లాల్లో మొత్తంగా 450 గ్రేడ్-3 పోస్టులు భర్తీ అయ్యాయి. 2008 నుంచి గ్రంథాలయ పోస్టుల భర్తీకిగాను జిల్లా స్థాయి కమిటీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ కమిటీలకు చైర్మన్‌గా ఆయా జిల్లాల కలెక్టర్లు ఉంటారు. ఈ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 280 మంది సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఎంపిక చేశారు. 2014లో 13 జిల్లాలవారీగా గ్రేడ్-3 పోస్టులు, అటెండర్లు/వాచ్‌మన్ల పోస్టుల డైరెక్ట్ విధానంలో ఎంపికకు ప్రభుత్వం ప్రకటన జారీచేసింది. సర్వీసులోని పలువురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఈ స్టే వచ్చేలోగా గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 38 పోస్టులను భర్తీ చేయగా, మిగిలిన 11 జిల్లాల్లో నిలిచిపోయింది. ప్రస్తుతం అక్కడ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే కొనసాగుతున్నారు. ప్రస్తుత నవ్యాంధ్ర రాష్ట్రంలో 1400కుపైగా గ్రంథాలయాలున్నాయి. దాదాపు 800 మంది పూర్తిస్థాయి/ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 900 పోస్టులు (గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 లైబ్రరియన్లు, వాచ్‌మన్లు/అటెండర్లు) ఖాళీగా ఉన్నాయి. వాటిల్లో 500పోస్టుల వరకైనా భర్తీ చేయాలని ఇటీవల ప్రభుత్వానికి విద్యాశాఖాధికారులు లేఖ రాశారు. ఆర్థిక శాఖ క్వొరీ పెట్టడంతో పోస్టులకు ప్రకటన వెలువడలేదు.

గ్రంథాలయ ఉద్యోగాలకు అర్హతలివీ..

జిల్లా గ్రంథాలయాల్లో గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 హోదాల్లో గ్రంథాలయాధికారుల పోస్టులున్నాయి. డిగ్రీతోపాటు బీఎల్‌ఐసీ చదివిన వారంతా ఈ మూడు విభాగాల పోస్టులకు దరఖాస్తు చేసేందుకు అర్హులు. గ్రేడ్-1, గ్రేడ్-2 పోస్టుల ఎంపికను డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ఆధ్వర్యాన నిర్వహిస్తారు. గ్రేడ్-3 పోస్టులకు కేవలం ఇంటర్ సహా సీఎల్‌ఐసీ చేసిన అభ్యర్థులే అర్హులు. అటెండర్/వాచ్‌మన్ పోస్టులకు ఎనిమిదో తరగతి అర్హతగా నిర్ణయించారు. ప్రభుత్వం ఇంతవరకూ వాటి భర్తీకి చర్యలు చేపట్టలేదు. ఇటీవల ఏపీపీఎస్సీ ద్వారా 23 పోస్టులకు ఖాళీలు ప్రకటించారు. దానిపై డైరెక్టర్ ఆఫ్ లైబ్రరీస్ అధికారులు విధివిధానాలను సూచించారు. ఈ పోస్టులకు ఎంఎల్‌ఐసీ అర్హతగా నిర్ణయించినట్లు తెలిసింది. జిల్లాల వారీగా ఉన్న గ్రంథాలయాధికారుల పోస్టుల భర్తీపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శిస్తుకు స్థానిక సంస్థల ఎసరు..!

రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల నుంచి గ్రంథాలయాలకు రూ.272 కోట్ల శిస్తు పన్ను(సెస్) నిధులు చేరలేదు. గ్రంథాలయాలకు ప్రజలు చెల్లించాల్సిన సెస్‌ను ఆయా ప్రాంతాల్లోని స్థానిక సంస్థలు వసూలు చేస్తాయి. వాటిని ఎప్పటికప్పుడూ గ్రంథాలయాల ఖాతాలకు అవి జమ చేయాలి. స్థానిక సంస్థల ఖాతాల్లోనే పన్నులు నిలిచిపోయాయి.

సెస్ నిధులు గ్రంథాలయాల ఖాతాలకు చేరనందున పుస్తకాల కొనుగోలు, నిర్వహణలో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం నుంచి గ్రంథాలయాలకు ఎలాంటి చేయూత లేదు. కొన్ని ప్రాంతాల్లో గ్రంథాలయాల సొంత సొమ్ము, దాతల సహకారంతో పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే గ్రంథాలయాలు ఉనికిని కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

– కోనా దేవదాస్, అధ్యక్షుడు,
ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రంథాలయాధికారులు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. స్థానిక సంస్థల వసూలు చేసిన సెస్ బకాయిలను సంబంధిత గ్రంథాలయాల ఖజానాకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు/పెన్షన్లు మంజూరు చేయాలి. గ్రంథాలయాల నిర్వహణకు తగినన్ని నిధులిచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి. ఉద్యోగులపై పనిభారం పడకుండా అదనపు పోస్టులు మంజూరు చేయాలి. ఆర్థికశాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఖాళీ పోస్టుల దస్త్రానికి అనుమతులిచ్చేలా చొరవ చూపాలి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలి. గ్రంథాలయాధికారులు, సిబ్బంది పోస్టుల భర్తీలో అడ్డంకిగా నిలిచిన న్యాయపరమైన అంశాలను ప్రభుత్వం తొలగించాలి.

కోటిపల్లి-నరసాపూర్...!

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని పేర్కొంటూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించిన గణాంకాలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్టుకు 2014 నుంచి ఇప్పటి వరకు రూ. 323.21 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రాధాన్యత జాబితాలోని ఈ ప్రాజెక్టు కోసం 2014-15లో రూ. 5 కోట్లు, 2015-16లో రూ. 5 కోట్లు మాత్రమే కేంద్రం మంజూరు చేసింది. 2016-17 రైల్వేబడ్జెట్‌లో రూ. 200 కోట్లను కేటాయించగా రూ. 184.64 కోట్లు ఖర్చు చేశారు. తర్వాత 2017-18లో రూ.430 కోట్లు కేటాయించి రూ. 60.51 కోట్లే ఖర్చు చేసింది. తాజాగా 2018-19 లోనూ రూ. 200 కోట్లు కేటాయించి గత డిసెంబరు వరకు రూ. 73.34 కోట్లు మాత్రమే రైల్వేశాఖ వెచ్చించింది. దీంతో గడచిన ఐదేళ్లలో కేంద్రం రూ. 840 కోట్లు కేటాయించగా.. కేవలం రూ. 323.21 కోట్లు మాత్రమే వినియోగించుకునే పరిస్థితి ఏర్పడింది. మిగిలిన రూ.516.79 కోట్లు మురిగిపోయాయి.

రాష్ట్రం చెల్లించింది రూ. 2.69 కోట్లే!

కోటిపల్లి- నరసాపూర్ మధ్య 57.21 కిలోమీటర్ల మేరా కొత్త మార్గం 2000-01 సంవత్సరంలోనే మంజూరైంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.695 కోట్ల వ్యయం అవుతుందని అప్పట్లో అంచనా వేశారు. ఇందులో 25 శాతం అంటే రూ. 173.75 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరించాలి.

ప్రతి సంవత్సరం నామమాత్రంగానే నిధులు కేటాయించడంతో తర్వాత కాలంలో రూ. 1045 కోట్లకు, ఏటా పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో అంచనా వ్యయం రూ2,120 కోట్లకు చేరుకుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ చెల్లించాల్సిన వాటా రూ. 530 కోట్లకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 2.69 కోట్లు మాత్రమే జమ చేసింది. ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చేసిన టీడీపీ ఇప్పటికే విభజన హామీలేవీ అమలు చేయడంలేదని బీజేపీని విమర్శిస్తోంది. రాష్ట్రం ఆర్థికంగా అనేక కష్టాలు పడుతున్నా కేంద్రం పట్టించుకోవడంలేదని సీఎం చంద్రబాబు సహా మంత్రులు, ప్రజాప్రతినిధులు సమయం వచ్చినప్పుడల్లా బీజేపీ తీరును ఎండగడుతూనే ఉన్నారు. విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయాలు వేడెక్కిన తరుణంలో ప్రాజెక్టు వాటాను రాష్ట్రం చెల్లిస్తుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంకా పూర్తి కాని భూసేకరణ

ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 908 ఎకరాల భూమి అవసరం అవుతుందని అధికారులు గుర్తించారు. ఇందులో తూర్పుగోదావరిజిల్లాలో 791 ఎకరాలు, పశ్చిమ గోదావరిజిల్లాలో 118 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క తూర్పుగోదావరిజిల్లాలోనే 276 ఎకరాలు సేకరించి రైల్వేశాఖకు అప్పగించారు. మిగిలిన 632 ఎకరాలను ఇంకా సేకరించాలి. సారవంతమైన భూములిచ్చేందుకు రైతులెవరూ ముందుకు రావడంలేదు. మరోవైపు గోదావరి మూడు పాయలుగా సముద్రంలో కలిసే ప్రాంతంలో ఈ మార్గాన్ని నిర్మిస్తున్నారు. ప్రధానమైన గౌతమి నదిపై 3.5 కిలోమీటర్ల పొడవుతో రూ. 344 కోట్ల వ్యయంతో భారీ వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. మిగిలిన వైనతేయ, వశిష్ట నదులపై వంతెనలను నిర్మించేందుకు టెండర్లను ఖరారు చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. గౌతమి నదిపై నిర్మించే వంతెన పూర్తి కావాలంటే ఎంతలేదన్నా ఐదారు సంవత్సరాలు పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కోనసీమ ప్రాంతంలో అమలాపురం, పేరూరు, పాశర్లపూడి, జగ్గన్నపేట, రాజోలు పట్టణాలను అనుసంధానం చేసే ఈ మార్గం నిర్మాణం ఇప్పట్లో సాధ్యం కాకపోవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అరగంటే..!

(మొదటిపేజీ తరువాయి)

డీసీఏ స్థాయిలో ఉంది. దాన్ని అవగాహన చేసుకుని, ప్రాక్టీస్‌కు సిద్ధమవ్వాలంటే..దాదాపు ఆర్నెళ్ల నుంచి ఏడాది వరకూ సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. కంప్యూటర్‌పై ఎలాంటి ప్రాథమిక అవగాహనలేని గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చెందిన అభ్యర్థులంతా ఈ పరీక్షల్లో అర్హత సాధించడం కష్టతరమనే వాదనలున్నాయి. వారంతా మెయిన్స్‌లో నెగ్గి, కంప్యూటర్ టెస్ట్‌లో అర్హత సాధించకుంటే..ఉద్యోగాన్ని కోల్పోవాల్సిందే. గ్రూప్-2 నోటిఫికేషన్ కోసం రెండేళ్ల నుంచి అభ్యర్థులు వివిధ ప్రైవేటు కోచింగ్ సంస్థల్లో శిక్షణ పొందుతున్నారు. ఏపీపీఎస్సీ కొత్తగా రూపొందించిన సిలబస్ అభ్యర్థులను గందరగోళానికి గురిచేస్తోంది. విస్తృతంగా ఉన్న సిలబస్‌ను అతి తక్కువ సమయంలో అధ్యయనం చేయడం వారికి గగనంగా మారుతోంది. దానికితోడు చివరి దశలో కంప్యూటర్ ప్రాక్టీస్ టెస్ట్ పెట్టడంపై ఆందోళన చెందుతున్నారు.

కంప్యూటర్ సిలబస్ ఇదీ..

ఏపీపీఎస్సీ గ్రూప్-2 అభ్యర్థులకు నిర్వహించిన కంప్యూటర్ ప్రాక్టీస్ మొత్తం 50 మార్కులకుగాను 30నిమిషాలు కేటాయించారు. ఇందులో ఏ,బీ,సీ సెక్షన్లు ఉంటాయి. పార్ట్ ఏ-సెక్షన్ నుంచి టైపింగ్ లెటర్ ఇన్ ఎంఎస్ వర్డ్ విభాగం-15 మార్కులు, బీ-విభాగంలో10 మార్కులకుగాను ప్రిపరేషన్ ఆఫ్ ఎ టేబుల్/గ్రాఫ్ ఎన్ ఎంఎస్-ఎక్సెల్, సీ-విభాగంలో ప్రిపరేషన్ ఆఫ్ పవవర్ పాయింట్ ప్రజెంటేషన్/ఎంఎస్-పవర్ పాయింట్-10 మార్కులకు నిర్వహిస్తారు. ఓసీలు-20, బీసీలు-17.5, ఎస్సీ,ఎస్టీ/పీహెచ్‌సీలు-15శాతం చొప్పున అర్హతా మార్కులను నిర్ణయించారు. గ్రూప్-2 మెయిన్స్‌లో అభ్యర్థులు సాధించిన మార్కుల్ని కలపబోరు. కేవలం దాన్ని అర్హతగానే పరిగణిస్తారు.

వెబ్‌సైట్‌లో ఐదు విభాగాల పోస్టుల సిలబస్

ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయబోయే ఐదు విభాగాల పోస్టుల పరీక్షల సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. తెలుగు, ఇంగ్లీషు రిపోర్టర్లతోపాటు ఎండోమెంట్ గ్రేడ్-3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులకు సిలబస్‌ను వెల్లడించారు. అభ్యర్థుల సౌకర్యార్థం గతంలో కమిషన్ నిర్వహించిన వివిధ పోటీ పరీక్షల పాత ప్రశ్నాపత్రాల్ని పొందుపరిచారు. వాటితోపాటు ప్రస్తుతం కమిషన్ విడుదల చేసిన అన్ని నోటిఫికేషన్ల వివరాలను సిలబస్ ఉంది.

అందరికీ కామన్ ఫీజు

ఏపీపీఎస్సీ నిర్వహించబోయే వివిధ విభాగాల ఉద్యోగ పరీక్షలకుగాను అన్ని కేటగిరీల అభ్యర్థులకూ ఒకే తరహాగా ఫీజు నిర్వహించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ పరీక్షల సాకుతో..ప్రభుత్వంపై పడుతున్న భారాన్నంతా అభ్యర్థులపై వేస్తున్నారనే వాదనలున్నాయి. ఏపీ డీఎస్సీ-2018 ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియలోనూ ఇదే విధానాన్ని పాటించారు. అభ్యర్థులకు పరీక్ష ఫీజును కామన్‌గా రూ.500 చొప్పున వసూలు చేశారు. టెట్ ఆన్‌లైన్ పరీక్షల్లోనూ ఇదే విధానాన్ని నిర్వహించారు. వాటివల్ల ప్రభుత్వానికి రూ.80కోట్ల వరకూ ఆదాయం వచ్చింది. ఏపీపీఎస్సీకి ఒక్కో అభ్యర్థి వారి అర్హతల ఆధారంగా నాలుగైదు పోస్టులకు దరఖాస్తు చేస్తున్నారు. ఒక్కో అభ్యర్థి రూ.256 వరకూ ఫీజు చెల్లిస్తున్నారు. ఈ పరీక్షల ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయిల ఆదాయం లభించనుంది. కేటగిరీల ఆధారంగా పరీక్షా ఫీజు వసూలు చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

మోడీ డైరెక్షన్‌లోనే...

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితుల్లేవన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ బీజేపీ పూర్తిగా విఫలమవ్వడంతో.. ఇప్పుడు ప్రమాదకరమైన రాజకీయాలకు తెరదీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ కనుసన్నల్లో తెలంగాణ సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరిట దేశ వ్యాప్తంగా పర్యటిస్తున్నారని, అటు కేసీఆర్ కనుస న్నల్లోనే వైసీపీ అధినేత జగన్ నడుస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, జగన్‌లు లోపాయికారిగా మోడీకి జపం చేస్తున్నారని, ఆంధ్రా, తెలంగాణ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోడీకి ఊడిగం చేసేందుకే..హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్, కేసీఆర్ కీలక సమావేశం కొనసాగిందని విమర్శిం చారు. తెలంగాణలో బీజేపీ అనుకూలంగా టీఆర్ ఎస్, ఆంధ్రాలో బీజేపీకి వైసీపీ అనుకూలంగా వ్యవహరించాలనే రహస్య అజెండాతో ఆ రెండు పార్టీలు పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు. కేసీఆర్, జగన్ లకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే..బీజేపీతో బహిర్గ తంగా పొత్తుపెట్టుకుని ఎన్నికల్లోకి వెళ్లాలని సవాల్ విసిరారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలను అమలు చేయడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రానికి అన్ని విషయాల్లోనూ మోడీ పూర్తిగా అన్యాయం చేశారని, పార్లమెంటులో ఇచ్చిన హామీలను సైతం అమలు చేయలేదని, రాష్ట్రంపై పూర్తిగా ఆయన కక్ష కట్టారని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం తాము ముందు నుంచి కేంద్రంపై పోరాడుతున్నామని గుర్తుచేశారు. కేసీఆర్‌కు దూతగా.. టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆంధ్రాకు వచ్చి..జగన్‌కు అనుకూలంగా వ్యాఖ్యానిస్తున్నారని రామకృష్ణ మండిపడ్డారు. 'తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు గొప్ప సేవలందిస్తున్నట్లుగా ఆయన వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని' ఖండించారు. అక్కడ కేసీఆర్ లాంటి దొరలకు కొందరు సేవలు చేస్తున్నారని తూర్పారబట్టారు. కేసీఆర్ తెలివిగా ఓటర్లకు గొర్రెలు, బర్రెలు ఇచ్చి ఆకట్టుకున్నారని విమర్శించారు. ఇంకా బీసీలు ఇదే తరహాగా ఎదగాలని కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు.

ఏపీలో లా అండ్ ఆర్డర్ ఘోర విఫలం

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉందంటూ..నారావారి పల్లెలో సీఎం చంద్రబాబు గొప్పగా చెబుతున్నారని, ఇది పచ్చి అబద్ధమని రామకృష్ణ ఖండించారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల తనకు అవమానం జరిగిందంటూ... హైదరాబాద్‌లో పోలీసులను ఆశ్రయించారని, దానిపై ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు స్పందించిన వైఖరి సరిగ్గా లేదని అన్నారు. ఒక మహిళ తనకు అన్యాయం జరిగిందంటూ రోడ్డెక్కితే సీఎం స్పందించే విధానం అదేనా? అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు 40ఏళ్ల రాజకీయ అనుభవానికీ, స్థాయికి తగిన విధంగా వ్యాఖ్యానించలేదని దుయ్యబట్టారు. బాహాటంగా టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీనేతలు కోడి పందాలు, జూదాలు నిర్వహించారన్నారు. ఈ విడత కోడి పందాల్ని అరికడతామంటూ మైకులు పట్టుకుని ప్రచారం చేసిన పోలీసులు ఏమయ్యారని ప్రశ్నించారు. చట్టానికి విరుద్ధంగా కోడి పందాలు నిర్వహిస్తుంటే..ఆయన ఎందుకు స్పందించలేదని మండిపడ్డారు.

సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీలు పీజే చంద్రశేఖరరావు, జల్లి విల్సన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు రావుల వెంకయ్య, జి.ఓబులేసు పాల్గొన్నారు.

షర్మిలను విమర్శించలేదు..: జేసీ



విశాలాంధ్ర-అమరావతి : కులాంతర వివాహానికి అనుమతిచ్చిన వైఎస్ కుటుంబం, నేడు కులాలను రెచ్చగొట్టడాన్ని విమర్శించానే గాని షర్మిలను ఏమి అనలేదని ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో తన సోదరుడితో కలసి ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. అనంతరం దివాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ షర్మిల తనకు కూతురితో సమానమని, ఆమెను విమర్శించి ఉంటే తనకు పాపం తగులుతుందని అన్నారు. జగన్, కేసీఆర్ కొత్తగా మాట్లాడుకునేదేముంటుందని, వారి మధ్య మైత్రి ఎవరికి తెలియనది కాదని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌తో పాటు మరో పది మంది వచ్చినా ఏపీలో టీడీపీని ఏం చేయలేరన్నారు. బీసీలు తెలుగుదేశం పార్టీ వైపే ఉన్నారన్న ఆయన యనమల రామకృష్ణుడు బీసీ నాయకుడు కాదా అని ప్రశ్నించారు. రాయలసీమకు వస్తే బీసీలు ఎవరివైపు ఉన్నారో చూపిస్తామన్నారు. ఫెడరల్ ఫ్రంట్ లేదూ.. పాడు లేదంటూ తనదైన శైలిలో స్పందించారు. ఒక్కో సమయంలో ఒక్కో పెద్దమనిషికి కోపం వస్తుందని.. ప్రస్తుతం కేసీఆర్‌కు కోపమొచ్చిందని వ్యాఖ్యానించారు. తన కుమారుడితో పాటు, తన తమ్ముడు కొడుకు ఎన్నికల్లో పోటీ చేయాలన్నది తన కోరిక అన్న దివాకర్‌రెడ్డి దీని గురించి సీఎంతో చర్చించాల్సి ఉందని తెలిపారు.



టార్గెట్ చంద్రబాబు ?

కేసీఆర్, జగన్ కోరిక అదేనా?

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఏపీ రాజకీయాల్లో జోక్యం చేసుకుంటామని స్పష్టంగా చెప్పిన గులాబీ దళపతి కె.చంద్రశేఖరరావు తన మిషన్ 'ఏపీ' మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. రా బోయే ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలని ఆయన గట్టిగా భావిస్తున్నారు. అందుకే ఎన్నికల్లో గెలిచిన తర్వాత విలేకరుల సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబును లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. రిటర్న్ గిఫ్ట్ ఇస్తానంటూ కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇపుడు మరో అడుగు ముందుకేసి ఏపీ ప్రతిపక్ష నేతతో టీఆర్ఎస్ సమావేశం కావడం ఆసక్తికరంగా మారింది. టీఆర్ఎస్, వైసీపీ భేటీలో ఏయే అంశాలు చర్చకు వచ్చాయి. అజెండా ఎలా ఉంది అన్న ప్రశ్నలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. పైకి ఫెడరల్ ఫ్రంట్ చర్చలు అని చెబుతున్నా, ఏపీ రాజకీయాలు ప్రస్తావన తప్పక ఉందన్న ప్రచారం సాగుతోంది. వైసీపీకి బాసటగా ఉంటామని గులాబీ దళపతి ఇప్పటికే ప్రకటించారు. ఎంఐఎం సైతం జగన్‌కు సంఘీభావాన్ని ప్రకటించింది. త్వరలో ఏపీ లో జరగనున్న ఎన్నికల్లో ఫెడరల్ ఫ్రంట్ తరపున జగన్‌కు మద్దతునిస్తూ కేసీఆర్ ప్రచారం చేస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు జగన్‌మధ్య జరిగిన చర్చలు ఫెడరల్ ఫ్రంట్‌కు మరింత ఊపునిచ్చాయి. రాజకీయంగా కేటీఆర్ తొలిసారి ఏపీ ప్రతిపక్ష నేత జగన్‌తో చర్చలు జరపడంతో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు జగన్ జై కొట్టారు. సంఖ్యా బలంతోనే రాష్ట్రాల ఆకాంక్షలను నెరవేర్చుకునే వీలు ఉంటుందన్న జగన్...ఏపీకి ప్రత్యేక హోదా కోసం రెండు రాష్ట్రాల ఎంపీల స్వరం అవసర మని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రాంతీయ పార్టీల బలం పెరగా లంటే ఫెడరల్ ఫ్రంట్ అవ సరం చాలా ఉందని భేటీ అనంతరం జగన్ పేర్కొ న్నారు. త్వరలో కేసీఆర్ ఏపీలో జగన్‌ను కలుస్తారు. జగన్, కేసీఆర్ సమావేశం రాజకీయ వర్గాల్లో మరింత ఆసక్తిని రేపనున్నది. ఏపీలో జగన్‌తో కలిసి చంద్రబాబును దెబ్బకొట్టడం ఒక ఎత్తైతే కేంద్రంలో ఫెడరల్ ఫ్రంట్‌ను బలోపేతం చేసుకోవడం మరోత్తుగా కేసీఆర్ భావిస్తున్నారు. ఇదే కేసీఆర్ చెబుతున్న రిటర్న్ గిఫ్ట్‌లో భాగమనే ప్రచారం సాగుతుంది. మరోవైపు ఎంఐఎం అధ్యక్షులు అక్బరుద్దీన్ ఒవైసీ కూడా 'ఐ యామ్ కమింగ్ టు ఏపీ' అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఏపీకి వస్తున్నాను.. కాచుకో అన్న రేంజ్‌లో చంద్ర బాబుకు సవాల్ విసిరారు. అయితే ఒవైసీ ద్వారా జగన్‌కు కేసీఆర్ మేలు చేయనున్నట్లు తెలుస్తోంది.

ఫెడరల్ ఫ్రంట్ ఓ మిథ్య

- తొలగిన కేసీఆర్, జగన్ ముసుగు
- మంత్రి నక్కా ఆనంద్ బాబు విమర్శ


విశాలాంధ్ర-అమరావతి: ఫెడరల్ ఫ్రంట్ అనేది ఒక మిథ్య అని, తమ నాయకుడు గతంలో చెప్పినట్లుగా కేసీఆర్, జగన్‌ల ముసుగు తొలగిందని మంత్రి నక్కా ఆనంద్ బాబు విమర్శించారు. బుధవారం ఉండవల్లిలోని ప్రజావేదికలో మంత్రి మాట్లాడుతూ బీజేపీకి అనుకూలంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పడిందని ఆరోపించారు. జన్మభూమి, పెన్షన్ల రెట్టింపుపై ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని, ప్రజల్లో ఉన్న చర్చను పక్క దారి పట్టించేందుకు వైసీపీ రోజుకో అంశాన్ని తెరమీదకు తెస్తోందని విమర్శించారు. షర్మిల అంశంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నించిందన్నారు. ఏపీకి జగన్ చుట్టంచూపుగా వస్తున్నాడని, రాష్ట్ర అభివృద్ధి గురించి ఆయనకు ఏం తెలుసునని ఎద్దేవా చేశారు. హోదాపై పార్లమెంటులో అవిశ్వాసం పెడితే టీఆర్ఎస్ బయటకు వెళ్లిపోయిందని గుర్తు చేశారు. మైనారిటీల సంక్షేమం కోసం టీడీపీ కృషి చేస్తుందని, మైనార్టీల రిజర్వేషన్లపై టీఆర్ఎస్ మాట్లాడలేదన్నారు. విభజన చట్టంలోని ఉమ్మడి ఆస్తుల విభజనపై కేసీఆర్ ఎప్పుడూ సహకరించలేదని, పోలవరం, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులను ఆపేందుకు కోర్టుల్లో కేసులు వేశారన్నారు. ఆంధ్రోళ్లు .. అని చులకనగా మాట్లాడే కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌కు ఏ విధంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు సగం కూడా అమలు చేయలేని వ్యక్తి ఆయనన్నారు. అభివృద్ధిలో ఏపీ ముందున్నదని చెప్పారు. అవినీతిపరుడైన జగన్‌ను ఎందుకు ముద్దాడుతున్నావని కేసీఆర్‌ని ప్రశ్నించారు. తండ్రి చావును రాజకీయం చేశారని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ అవసరం ఏపీకి లేదని, చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి చాలని సూచించారు. జగన్ కేసీఆర్‌కు అంట కాగుతూ కాళ్లు మొక్కుతున్నాడని, కేసుల విచారణ పూర్తయితే ఎన్నిఏళ్లు శిక్ష పడేది తెలుస్తుందంటూ ఎద్దేవా చేశారు. హైకోర్టు విభజనతో కేసులు ఆలస్యం అయ్యేందుకు కేంద్రం జగన్‌కు సహకరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంతో సంతృప్తితో ఉన్నారని నక్కా ఆనంద్ బాబు అన్నారు.

బాధితులకు భరోసా

- పాక్‌లో 22మంది నిర్బంధం
- కుటుంబాలకు నెలకు రూ.4,500 ప్రతీ నెలా చెల్లింపు



రోధిస్తున్న మత్స్యకార కుటుంబీకులు



పాక్ బందీలుగా ఉన్న మత్స్యకారులు (ఫైల్ పాటో)


విశాలాంధ్ర-ఎచ్చెర్ల : అరేబియా సముద్రంలో చేపలవేటకు వెళ్లిన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ప్రాంత మత్స్యకారులు పాక్ కోస్ట్‌గార్డ్‌లకు బందీలుగా చిక్కి 50 రోజులు కావస్తుంది. అయినా వారి జాడ ఇప్పటికీ తెలియదు. గతేడాది నవంబరు 28న శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన మత్స్యకారులు 22 మంది పాక్‌బందీలుగా చిక్కిన విషయం విదితమే. బందీలను విడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు చర్యలు చేపడుతూనే, మరోవైపు బాధిత కుటుంబాలను ఆదుకునే ప్రయత్నం చేసింది. ఆయా కుటుంబాలకు కొంత మేర ఊరటనిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో మత్స్యకార సంక్షేమ సమితి నేతల్లో హర్షం వ్యక్తమవుతోంది. పాక్ బాధితులు క్షేమంగా విడుదలయ్యేవరకు ప్రతినెలా బాధిత కుటుంబాలకు రూ.4,500 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీవో విడుదల చేసింది. రెండు రోజుల క్రితం రాజాం మండలం పొగిరి జన్మభూమి మా ఊరు గ్రామసభలో పాక్‌బాధిత కుటుంబాలకు 2 లక్షల రూపాయల వంతున పరిహారం చెక్కులు అందజేశారు. అంతకుముందు రూ.10 వేలు వంతున పంపిణీ చేశారు. 10 మెకనైజ్డ్ బోట్లు, వలలు, ఐస్ బాక్స్, 10 హెచ్‌పీ మోటార్లను 75శాతం సబ్సిడీపై మంజూరు చేశారు. చేపలను మార్కెట్‌కు తరలించడానికి మూడు కుటుంబాలకు నాలుగు చక్రాల వాహనాలను 75 శాతం సబ్సీడీపై మూడింటిని పంపిణీ చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు నెలకు రూ.4,500 అందించేందుకు వీలుగా తహశీల్దార్ కార్యాలయం నుంచి ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్‌ను మత్స్యశాఖ అధికారులు తీసుకుంటున్నారు. జనవరి నుంచి ఈ మొత్తాన్ని అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎఫ్‌డీవో గోపీకృష్ణ తెలిపారు.

పాక్ బందీల వివరాలు

ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం పంచాయతీకి చెందిన గనగళ్ల రామారావు, కేశం ఎర్రయ్య, కేశం రాజు, మైలపల్లి సన్యాసిరావు, రాంబాబు, సూరాడ అప్పారావు, సూరాడ కల్యాణ్, కిరణ్, చీకటి గురుమూర్తి, షేకియా సుమంత్, బడేవానిపేటకు చెందిన వాసపల్లి శామ్యూల్, బడే అప్పన్న, కోనాడ వెంకటేష్ పాక్‌బందీలుగా ఉన్నారు. 11 కుటుంబాలకు 2 లక్షల రూపాయల వంతున నష్టపరిహారాన్ని మంజూరు కాగా, ఈ మొత్తం ఒకటి, రెండు రోజుల్లో నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమవుతుంది. ఇటీవల గుర్తించిన ఎచ్చెర్ల మండలం ముద్దాడ పంచాయతీ సెగిడిపేటకు చెందిన పెంట మణి కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం అందాల్సి ఉంది. నెలకు అందజేసే రూ.4,500 మొత్తం మంజూరు చేయాల్సి ఉంది.

ఏపీపై కేసీఆర్ పెత్తనం

జలవనరులశాఖమంత్రి దేవినేని ఉమా



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తెలంగాణ సీఎం కేసీఆర్ జగన్‌ను రిమోట్ కంట్రోల్‌గా వాడుకుని ఏపీపై పెత్తనం చెలాయించాలని చూస్తున్నారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. రాష్ట్ర జలవనరులశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీఆర్ఎస్ నేత కేటీఆర్, వైసీపీ అధినేత జగన్‌ల భేటీని తప్పుబట్టారు. 'అది ఫెడరల్ ఫ్రంట్ కాదు.. మోడీ ఫ్రంట్' అని విమర్శించారు. సీఎం చంద్రబాబుపై కక్షతోనే కేసీఆర్ నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం కేసీఆర్ ఏపీ ప్రజలను తిట్టిన తిట్లను ఇంకా ఎవరూ మరచిపోలేదన్నారు. ఏపీ ప్రజలను ద్వేషించిన కేసీఆర్‌తో కలవడానికి జగన్‌కు సిగ్గుండాలని ఆయన ఎద్దేవా చేశారు. ఆంధ్రా బ్రాహ్మణులకు అసలు మంత్రాలే రావని, ఏపీలో బిర్యానీ పేడలా ఉంటుందని అప్పట్లో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి గుర్తు చేశారు. ఏపీ విభజన సందర్భంగా రాష్ట్రానికి రావలసిన ఆస్తుల పంపకాలు జరగకుండా కేసీఆర్ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ రూ. 5,200 కోట్ల విద్యుత్ బకాయిలను ఏపీకి చెల్లించాల్సి ఉందన్నారు. టీఆర్ఎస్ నాయకులు పోలవరం ప్రాజెక్టును అడ్డుకునేం దుకు విఫలయత్నాలు చేశారని ఆరోపించారు. టీఆర్ఎస్‌తో జగన్ చేతులు కలిపి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాగభూషణ శర్మ మృతికి సీఎం సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రముఖ రంగస్థల కళాకారుడు, ఎన్టీఆర్ పురస్కార గ్రహీత, సాహితీవేత్త ఆచార్య మొదలి నాగభూషణ శర్మ మృతి పట్ల సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. శర్మ నాటకమే ప్రధానాంశంగా అమెరికాలోని ఇల్లినాయిస్ యూనివర్శిటీలో పరిశోధన చేశారని, ఆయన తన జీవితం మొత్తం నాటక రంగానికే వెచ్చించారని కొనియాడారు. ది విజిట్, కింగ్ ఈడిపస్, హయవదన, తుగ్లక్, మృచ్ఛకటిక, వెయిటింగ్ ఫర్ గోడో వంటి గ్రీకు, సంస్కృత, ఆంగ్ల నాటకాలకు దర్శకత్వం వహించిన మొదలి నాగభూషణ శర్మ మృతి బాధాకరమని పేర్కొంటూ, శర్మ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

షర్మిల ఫిర్యాదుపై దర్యాప్తు ముమ్మరం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోదరి వైఎస్ షర్మిల ఇచ్చిన ఫిర్యాదుపై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో విచారణ వేగం పెంచామని అదనపు డీసీపీ రఘువీర్ తెలిపారు. కొన్ని యూట్యూబ్ చానళ్లు, ఫేస్‌బుక్ గ్రూప్‌లలో ఎక్కువగా అసభ్యకరంగా మెసేజ్‌లు పెట్టారన్నారు. సామాజిక మాధ్యమాల్లో వీడియోలు, కామెంట్లకు సంబంధించి యూఆర్ఎల్‌లపై దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే విచారణ కోసం స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేశామని, యూట్యూబ్, ఫేసుబుక్ నుంచి సమాచారం రావలసి ఉందని రఘువీర్ తెలిపారు. వీడియోలు తయారు చేసిన వాళ్లతో పాటు దీని వెనుక గల వాళ్లను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుపై ముగ్గురుని అరెస్ట్ చేశామని, తాజాగా చేస్తున్న దాంట్లో వాళ్ల ప్రమేయం ఉందా అన్న కోణంలోనూ విచారణ జరుపుతున్నామని చెప్పారు.

ఆకర్షణీయంగా శాఖమూరు పార్కు

- 300 ఎకరాల్లో అద్భుత నిర్మాణాలు
- ప్రతిష్ఠాత్మకంగా గాంధీ, అంబేద్కర్ స్మృతివనాలు

విశాలాంధ్ర-అమరావతి: రాజధాని అమరావతికి వన్నె తెచ్చే విధంగా శాఖమూరులో 300 ఎకరాల్లో రీజినల్ పార్కును చకాచకా అభివృద్ధి చేస్తున్నారు. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఆధ్వర్యంలో కొన్ని ప్రాజెక్టులు సాగుతుండగా, మరి కొన్ని ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరినీ అలరించే విధంగా స్మృతివనాలను తీర్చిదిద్దుతున్నారు. 300 ఎకరాలలో ఏర్పాటవుతున్న ఈ పార్కులో ప్రధానంగా చుట్టూ చెట్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. పార్కు మధ్యలో 50 ఎకరాల్లో జలాశయన్ని ఏర్పాటు చేస్తున్నారు. జాగింగ్ ట్రాక్‌తో పాటుగా, బోటింగ్, ఎత్తైనా ఫౌంటెయిన్, లేజర్ షో వంటివి ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రచించారు. ఆహ్లాదకరం వాతావరణాన్ని కల్పించనున్నారు. ప్రణాళికాబద్ధంగా జరుగుతున్న పార్కు అభివృద్ధిపై ఎప్పటికప్పుడు ఏడీసీ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంది. రెండేళ్లలో పార్కు పనులు పూర్తి చేసే విధంగా ముందుకుసాగుతున్నట్టు ఏడీసీ వెల్లడించింది. పార్కులో స్మృతివనం ఏర్పాటును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతుంది. మొత్తంగా 19 ఎకరాల్లో జాతిపిత మహాత్మాగాంధీ, 20 ఎకరాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ స్మృతివనాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహం, స్మారక గ్యాలరీ, బౌద్ధ ధ్యాన మందిరం, గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ అభివృద్ధి పనులను సాంఘిక సంక్షేమ శాఖ చేస్తోంది. అంబేద్కర్ పార్కు పక్కనే 7.50 ఎకరాల్లో క్రాఫ్ట్ బజార్, శిల్పారామం తరహాలో యాంఫి థియేటర్ రూపుదిద్దుకుంటున్నాయి. పార్కుకు రెండో వైపు 20 ఎకరాల్లో రోజ్ గార్డెన్ సిద్ధమవుతోంది. క్రాఫ్ట్ విలేజీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్ కౌన్సిల్‌కు స్థలం కేటాయించారు. ఇందులో పలు కళాకృతుల దుకాణాలతో పాటుగా ఆర్గానిక్ ఫుడ్ రెస్టారెంట్లు రానున్నాయి. మరో 30 ఎకరాల్లో అమ్యూజ్‌మెంట్ పార్కును ఏర్పాటు చేయనున్నారు. రివర్ బే సంస్థ ఆధ్వర్యంలో వాటర్ స్పోర్ట్స్, వాటర్ స్లైడ్స్ వంటివి సిద్ధమవుతున్నాయి. పది ఎకరాల్లో ఏకో రిసార్టును శారదా ఏకోరిసార్ట్స్ సంస్థ నిర్మిస్తోంది. శాఖమూరు రిజర్వాయర్‌లో బోటింగ్ ప్రాజెక్టును కోస్టామేరీనా సంస్థకు అప్పగించారు. ఇదే రిజర్వాయర్‌లో ఫౌంటెయిన్, లేజర్ షోకు టెండర్లు త్వరలోనే పిలవనున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. మరో పది ఎకరాల్లో అడ్వెంచర్ పార్కును స్నో వరల్డ్ సంస్థ తీర్చిదిద్దుతోంది. వెల్డర్‌నెస్ పార్కును ప్రగతి రిసార్ట్స్ సంస్థ అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే 1200 మొక్కలు నాటారు. నడక దారుల్లో ఒక్కో మార్గం వెంట ఒక్కో రకం మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. మూడు ఎకరాల్లో స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ ఏర్పాటు చేయనున్నారు. స్టార్ హోటళ్ల ఏర్పాటుకూ ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. రాజధానికే తలమానికంగా అమరావతి ఉండేలా 300 ఎకరాల్లో ఈ నిర్మాణాలు జరుగుతుండటం విశేషం. ఇది పూర్తయితే ప్రపంచ స్థాయిలోనే ఆకర్షణీయ స్మృతివనంగా ప్రఖ్యాతి పొందుతుందని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

రేపటి నుంచి ఎస్జీటీ పరీక్షలు

- భారీ సిలబస్‌తో అభ్యర్థుల అవస్థలు
- 17 సెషన్లలో ఆన్‌లైన్లో ఏర్పాటు
- అత్యధికంగా పేపర్ సెట్ల రూపకల్పన



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ డీఎస్సీ-2018 సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమవుతాయి. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులకు సైతం అర్హత కల్పించారు. ఈ విడత వాటికి పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. పాఠశాల విద్య, మోడల్ స్కూళ్ల పరిధిలో 7,729 ఉపాధ్యాయ పోస్టులకు ప్రభుత్వం ప్రకటనిచ్చింది. ఇందులో అత్యధికంగా 3,125 ఎస్జీటీ పోస్టులున్నాయి. వాటికి పెద్ద డిమాండు నెలకొంది. డీఎడ్, బీఈడీ అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఎస్జీటీ పరీక్షలను టెట్ కమ్ టీఆర్టీ సిలబస్‌తో నిర్వహిస్తారు. రెండు నెలల్లో ఈ భారీ సిలబస్‌ను చదవడం కష్టతరంగా ఉందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. పరీక్షలకు గడువు పెంచాలని, జంబో డీఎస్సీ నిర్వహించాలనే డిమాండ్లతో.. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు. యథాతథంగా పరీక్షలను నిర్వహిస్తోంది. తొలివిడతగా డీఎస్సీ-స్కూల్ అసిస్టెంట్స్ లాంగ్వేజెస్, నాన్-లాంగ్వేజెస్, మోడల్ స్కూల్-పీజీటీ, టీజీటీ, పీఈటీ, మ్యూజిక్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ పోస్టులకు ఆన్‌లైన్లో పరీక్షలు నిర్వహించారు. ఇవి వాయిదా పడతాయనే ఆలోచనతో వేలాది మంది ప్రిపరేషన్‌పై దృష్టిపెట్టలేదు. జిల్లాల వారీగా పోస్టులసంఖ్య అతి తక్కువగా ఉండటంతో అభ్యర్థులు అంతగా ఆసక్తి చూపలేదు. తాము మొక్కుబడిగానే పరీక్షలకు హాజరయ్యామని పలువురు పేర్కొంటున్నారు.

17 సెషన్లలో ఎస్జీటీ పరీక్షలు

డీఎస్సీ రెండోవిడతలో భాగంగా ఎస్జీటీ పరీక్షలను దాదాపు 17సెషన్లుగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 18, 19, 20, 24, 25, 27, 28, 29, 31 తేదీల్లో రెండు సెషన్లుగా ఎస్జీటీ పరీక్షలు కొనసాగుతాయి. 28న ఎల్పీ (స్పెషల్), 30న ఎస్ఏ(స్పెషల్ సబ్జెక్ట్స్)లను ఏర్పాటు చేస్తారు. ప్రతిరోజూ ఉదయం సెషన్ 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 2నుంచి 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. టెట్ కమ్ టీఆర్టీ సిలబస్‌తో ఉన్నందున ఈ పరీక్షలకు 3 గంటలపాటు సమయం కేటాయించారు. అత్యధిక సెషన్లతో ఎస్జీటీ పరీక్షలు నిర్వహించడం వల్ల అభ్యర్థులకు అన్యాయం నెలకొంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఒక సెషన్ అభ్యర్థులకు కష్టంగాను, మరొక సెషన్‌లో సులభంగాను ప్రశ్నాపత్రాలు ఉండే అవకాశముందని పేర్కొంటున్నారు. దీనివల్ల ప్రతిభగల అభ్యర్థులకు నష్టం వాటిల్లుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆఫ్‌లైన్లో ఒకేరోజు పరీక్షలను నిర్వహించడం వల్ల ఒకే పేపర్ సెట్ ఉంటుందని, ఎవ్వరికీ నష్టం ఉండబోదు. డీఎస్సీ పరీక్షలను ఆన్‌లైన్‌లో సెషన్ల వారీగా నిర్వహించడంపై గిరిజన, గ్రామీణ ప్రాంత అభ్యర్థులు వ్యతిరేకిస్తున్నారు.

2లక్షలకుపైగా అభ్యర్థుల పోటీ

డీఎస్సీ-ఎస్జీటీ పోస్టులకు రెండు లక్షల మందికిగాపై అభ్యర్థులు పోటీపడే అవకాశముంది. ఏపీ టెట్ పేపర్-1(ఎస్జీటీ) పరీక్షలకు మొత్తంగా 1,60,796 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,11,527 మంది అర్హత సాధించారు. ఎస్జీటీ పోస్టులు బీఈడీ వారికి అర్హత కల్పించడంతో ఈ సంఖ్య రెండు లక్షలకు చేరింది. ప్రభుత్వం ప్రకటించిన 7,729 పోస్టులకుగాను 6లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఎస్జీటీలకు ఈ విడత ఒక పోస్టులకు వేలాదిమంది పోటీ పడనున్నారు. దీంతో జిల్లాల వారీగా కటాఫ్ మార్కు 80 నుంచి 85 మార్కుల మధ్య ఉండే అవకాశముందని నిపుణులు సూచిస్తున్నారు.

డీఎస్సీ-2018 కేసు 31కి వాయిదా..

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ డీఎస్సీ-2018 ప్రకటనలోని అభ్యంతరాల్ని సవాల్ చేస్తూ రాష్ట్రానికి చెందిన పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై కేసు విచారణ ఈ నెల 31కి వాయిదా పడింది. డీఎస్సీ పరీక్షలను నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని సవాల్ చేస్తూ.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నానాజీ నాయకత్వాన పలువురు డీఎస్సీ అభ్యర్థులు హైదరాబాద్‌లోని విద్యాశాఖ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అక్కడ సంతృప్తికరంగా తీర్పు రానందున.. హైకోర్టులో సవాల్ చేశారు. దీంతో హైకోర్టు ధర్మాసనం సైతం ఎన్‌సీఈటీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ సమయంలో హైదరాబాద్‌లోని ఉమ్మడిహైకోర్టు విభజన ప్రక్రియ కారణంగా డీఎస్సీ అంశంపై ఎక్కువగా వాదనలు కొనసాగలేదు. దీంతో హైకోర్టు ఇచ్చిన సూచనలను ఆధారంగా అభ్యర్థులు సుప్రీంకోర్టులో ఇటీవల పిటిషన్ వేశారు. బుధవారం పిటిషన్‌పై వాదనలు కొనసాగాయి. ఈ నెల 18 నుంచి 31వరకూ ఎస్జీటీ పరీక్షలు కొనసాగుతున్నాయని, అవి పూర్తయ్యాక నిర్ణయం వెల్లడిస్తామని సుప్రీం ధర్మాసనం వెల్లడించినట్లు అభ్యర్థులు తెలిపారు. దీంతో 31న అభ్యర్థులు వేసిన పిటిషన్‌పై పరీక్షల నిర్వహణ, ఫలితాలపై ఒక స్పష్టమైన తీర్పును సుప్రీం నుంచి ఇచ్చే అవకాశముంది. జంబో డీఎస్సీ నిర్వహించాలని, ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధంగా డీఎస్సీ సిలబస్ ఉందని అభ్యర్థులు కొంత కాలం నుంచి ప్రత్యక్షంగాను, న్యాయపరంగాను పోరాటం చేస్తున్నారు. సుప్రీం తీర్పు ఆధారంగా డీఎస్సీ-2018 ఫలితాలు, ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

కన్హయ్యపై కుట్రకేసు దుర్మార్గం

సంగమం మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : దేశ రాజధాని ఢిల్లీలో ప్రతిష్ఠాత్మక జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల కిందట విద్యార్థి సంఘ నాయకుడు కన్హయ్య కుమార్‌తో పాటు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్య తదితరులపై రాజద్రోహం కేసు మోపి ఛార్జ్ షీటు దాఖలు చేయడాన్ని లౌకిక ప్రజాస్వామ్య సాంస్కృతిక సంస్థల కార్యకర్తల ఉమ్మడి వేదిక సంగమం కన్వీనర్ సి.ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఈ ఆరోపణలను రాజకీయ కుట్ర పూరితమైనవని ప్రగతిశీల శక్తులన్నీ భావిస్తున్నాయి. ఇటువంటి కుట్రపూరిత కేసులు మోపడం బీజేపీ సంఘపరివార్ తరహా పచ్చి మితవాద అణచివేత స్వభావం కలిగిన శక్తులకు అలవాటైందన్నారు. భిన్నాభిప్రాయాలు కలిగిన వారిని, మతోన్మాద విధానాలను ప్రశ్నించిన వారిని అణచివేసే స్వభావం కలిగిన ఈ కేసులను చట్టబద్ధ రూపాలలో ఎదుర్కొంటూనే, మరోప్రక్క ప్రభుత్వ అణచివేత స్వభావాన్ని ప్రజారంగంలో ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ కవి వరవరరావు తదితరులపై మోపిన భీమా కోరేగావ్ కేసు కూడా ఇలాంటిదేనన్నారు. లౌకిక ప్రజాస్వామ్య వాదులు, వామపక్ష ప్రజా దృక్పథం గల మేధావులు, చట్టబద్ధ స్వేచ్ఛల కొరకు పోరాడే వారందరూ ఈ తరహా రాజకీయ సాంస్కృతిక అణచివేత చర్యలను ఖండించాలని ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : పార్టీ మారిన ఎమ్మెల్సీల సస్పెన్షన్‌కు మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ నిర్ణయం తీసుకున్నారు. జనవరి 17వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతుండటంతో ముగ్గురు ఎమ్మెల్సీలపై మండలి ఛైర్మన్ అనర్హత వేటు వేశారు. ఎమ్మెల్సీలు భూపతిరెడ్డి, రాములు నాయక్, యాదవరెడ్డిలపై అనర్హత వేటు వేస్తూ బుధవారం నిర్ణయం తీసుకున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో పొందుపరిచిన పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం వారిపై వేటు వేసినట్లు మండలి ఛైర్మన్ తెలిపారు. టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్సీలపై వేటు పడకుండా సీఎల్పీని టీఆర్ఎస్‌లో విలీనం చేసిన సంగతి తెలిసిందే. నెల రోజుల క్రితం ఎమ్మెల్సీ పదవికి కొండా మురళి రాజీనామా చేశారు. ఇక మిగిలిన ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలని టీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద వేటు వేయాలని చెప్పిన గులాబీ నేతలు అందుకు సంబంధించిన ఆధారాలు సమర్పించారు. పార్టీ మార్పుపై వివరణ ఇవ్వాలంటూ సభ్యులకు మండలి ఛైర్మన్ నోటీసులు పంపించారు. అనంతరం మండలి ఛైర్మన్ ఇరువైపులా వాదనలు విన్నారు. చట్టవిరుద్ధంగా పార్టీ మారారని టీఆర్ఎస్ గట్టిగా వాదించడమే కాకుండా అందుకు సంబంధించిన ఆధారాలను పక్కాగా సమర్పించడంతో చివరకు మండలి ఛైర్మన్ వారిపై వేటు వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఫెడరల్‌పై చర్చిస్తే.. టీడీపీ శోకాలు : అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ రాజకీయాల నేపథ్యంలో ఫెడరల్ ఫ్రంట్‌పై చర్చిస్తే..టీడీపీ నేతలకు ఎందుకు గగ్గోలు, శోకాలు పెడుతున్నారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ప్రశ్నించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ చర్చలు పొత్తుల కోసం కాదని, టీఆర్ఎస్ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేశారు. పార్లమెంటు సీట్లను తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ, టీఆర్ఎస్ వేర్వేరుగా పోటీ చేస్తాయని పేర్కొన్నారు. ఫెడరల్ ఫ్రంట్ జాతీయ వేదికగా బలపడితే రాష్ట్రానికి ప్రయోజనాలు కలుగుతాయనే ఆలోచనతో చర్చించామని వివరించారు. దేశ వ్యాప్తంగా బీజేపీ-కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్ రూపుదిద్దుకోవడాన్ని చంద్రబాబు ఎందుకు హర్షించలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధనకు కేసీఆర్ సహకరిస్తామని చెప్పారని, ఇది ఆహ్వానించదగిన పరిణామమని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రత్యేక హోదానే వైసీపీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వ్యక్తిత్వహననం చేయడంలో చంద్రబాబు దిట్టని, వైఎస్ షర్మిలపై వ్యక్తిత్వహననం చేయడం బాధాకరమని తెలిపారు. తనకు పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్ కుర్చీని లాక్కోవడానికిగాను ఆయన వ్యక్తిత్వాన్ని దెబ్బతీశారని దుయ్యబట్టారు.

రూ.6.70 లక్షల దోపిడీ..!

జనగామ: జిల్లాలోని కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామంలోని తిరుమల వైన్స్ సిబ్బందిని మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నాటు తుపాకితో బెదిరించి రూ.6.70 లక్షలు దోపిడీ చేసిన సంఘటన కలకలం సృష్టించింది. బాధితుల కథనం ప్రకారం మొండ్రాయి తిరుమల వైన్స్‌లో పనిచేసే రమేశ్, భాస్కర్, శ్రీను మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుకాణం మూసి ముగ్గురు ఒకే మోటార్ సైకిల్‌పై పాలకుర్తికి బయలుదేరారు. మార్గమధ్యలో రామన్నగూడెం వద్ద వీరి బైక్‌ను అటకాయించిన గుర్తుతెలియని వ్యక్తులు తమ వద్ద ఉన్న నాటు తుపాకి చూపి బెదిరించి, గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపి మద్యం దుకాణం ద్వారా వచ్చిన ఆదాయం రూ.6.70 లక్షలను దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న జనగామ డీసీపీ శ్రీనివాసరెడ్డి, వర్ధన్నపేట ఏసీపీ మధుసూధన్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పాలకుర్తి సీఐ రమేశ్ నాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

రాజ్యాంగానికి పెనుముప్పు

కేంద్రంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) కనుసన్నల్లో పాలన సాగించే కాషాయపార్టీ అధికారంలోకి వచ్చిననాటినుండి రాజ్యాంగబద్ధమైన సంస్థలను క్రమంగా ఒక్కొక్కదానిలో మితిమీరిన జోక్యంతో వాటిపై పట్టుబిగించి వాటి స్వతంత్రను దెబ్బతీసింది. దేశంలో పరిపాలనకు దిశానిర్దేశం చేసిన భారత రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతూ దాని విలువలను నాశనం చేయడం మాత్రమేగాక ఏకంగా దానిపై దాడికి బరితెగించి, పెనుముప్పు తెచ్చేందుకు పూనుకొంది. సమాజంలోని సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లపై ఆరెస్సెస్ సిద్ధాంతాన్ని మోడీ సర్కారు రుద్దిన తీరు భారత రాజ్యాంగ మౌలిక భావనపై నగ్నదాడి తప్ప వేరొకటి కాదు. ఈ ఉదంతంలో అత్యంత కలవరపరిచే అంశమేమంటే, రాజ్యాంగం మౌలిక విలువకు కట్టుబడి వుంటామని చెప్పుకునే అన్ని రాజకీయ పార్టీలు మోడీ సర్కారు చర్యకు వంతపాడటం. కులవ్యవస్థలో శాశ్వతంగా వుండేట్లు చేసిన సామాజిక అన్యాయాన్ని నిరర్థకం చేసే సాధనంగా సమాజంలోని సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల భావనను రాజ్యాంగంలో చేర్చారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన సమయంలో కూడా కులవ్యవస్థ విభిన్న ముసుగుల్లో ఆర్థికంగా వెనుకబాటుతనం భావనను రాజ్యాంగంలో చేర్చాలని ప్రయత్నించిన ప్రతిసారి సామాజిక వివక్షత, విద్యాపరంగా వెనుకబాటుతనం లేకుండా చేయడం రిజర్వేషన్ల మౌలిక లక్ష్యం అన్న వుద్దేశంతో తిరస్కరించబడింది. సామాజిక న్యాయం పెంపొందించడం ద్వారా కులరహిత సమాజాన్ని సృష్టించడం రాజ్యాంగం లక్ష్యంగా పెట్టుకొంది. కులవ్యవస్థను విశ్వసించే, కొనసాగాలని కోరుకునే ఆరెస్సెస్ సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబాటుతనం ప్రాతిపదికగా రిజర్వేషన్లను ఎల్లప్పుడూ వ్యతిరేకించింది. తన నిజలక్ష్యాన్ని దాచిపెట్టేందుకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ డిమాండు చేసింది. అగ్రవర్ణాలలోని "పేదలకు" 10 శాతం రిజర్వేషన్లు మంజూరు చేయడానికి రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదించి ఇప్పుడు మోడీ సర్కారు ఆరెస్సెస్ భానను సమాజంపై రుద్దింది.

50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించడానికి న్యాయవ్యవస్థ నిషేధాన్ని అధిగమించడానికే రాజ్యాంగ సవరణ అని మోడీ సర్కారు చెప్పడం కేవలం పచ్చి అబద్ధం. ఇప్పటికే తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు వున్నాయి. అయితే, అవి సామాజికంగా, విద్యావిషయంగా వెనుకబాటుతనం ప్రాతిపదికగా మాత్రమే కల్పించబడుతున్నాయి. ఆర్థికంగా వెనుకబాటుతనంపై రిజర్వేషన్ల భావనను ప్రవేశపెట్టడం ద్వారా మోడీ సర్కారు మోసం చేస్తున్నది. అంటే దానర్థం, సామాజిక అన్యాయాన్ని అంతం చేసి, అంతిమంగా కులరహిత సమాజానికి దారితీసేందుకు ఉద్దేశించబడిన రిజర్వేషన్ "పేదరిక నిర్మూలన" చర్యగా మార్చివేయబడిందన్నమాట. పేదరిక నిర్మూలన లేదా పేదల ఆర్థికాభివృద్ధికి ఇతర ఏదేని ఆర్థిక చర్యలపై బూర్జువా రాజకీయ పార్టీలకు ఎంతటి చిత్తశుద్ధి వుంటుందో అందరికీ తెలిసిన విషయమే. అది వారి వర్గనిబద్ధతకే వ్యతిరేకమైంది. అటువంటి పరిస్థితిలో, ఈ మకిల చర్యకు విభిన్న రాజకీయ పార్టీలు మద్దతు లభించడం ఆశ్చర్యకరమేమీ కాదు. వర్గనిబద్ధతతో పాటుగా, ఈ రాజకీయ పార్టీలు కులవిభజన వ్యాధి పీడితాలు కూడా. దేశవ్యాపితంగా గుర్తించబడిన ఆరు రాజకీయ పార్టీల్లో రాజ్యాంగ సవరణ బిల్లుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఒక్కటి మాత్రమే మద్దతు యివ్వలేదు.

ఈ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదాన్ని త్వరితపర్చడం ద్వారా గడచిన నాలుగున్నరేళ్లలో వరుసగా ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి మోడీ ప్రభుత్వం మరో అజెండాను ముందుకు నెట్టింది. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాల కల్పన తప్పుడు వాగ్దానం మొదలు, విదేశీ బ్యాంకుల్లో దాచిన నల్లడబ్బును భారత్ రప్పించి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షలు జమచేయడం, పెద్దనోట్ల రద్దు, తొందరపాటుతో వస్తుసేవలపన్ను (జీఎస్టీ) అమలు వంటి ఆర్థికంగా వినాశకరచర్యలతో మోడీ సర్కారు ప్రజల జీవనాన్ని దుర్భరం చేసింది. మోడీ ప్రభుత్వ అవినీతి కూడా చర్చనీయాంశమైంది. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం క్షుణ్ణంగా బహిర్గతమైంది. రూ. 30 వేల కోట్ల ప్రజాధనం దోపిడీలో స్వయంగా మోడీ ప్రమేయం వున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దృష్టి మళ్లింపు చర్యలు ఉపయోగించడం ద్వారా దర్యాప్తు జరుగకుండా ఇప్పుడు ఆయన నివారించవచ్చు. కానీ, రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా, ఆ తరువాత కూడా రాఫెల్ ఒప్పందం మోడీని వెంటాడుతూనే వుంటుంది. ప్రాంతీయ, జాతీయ బూర్జువా రాజకీయ పార్టీల నాయకులు వివిధ కారణాల వల్ల అన్యమనస్కతతో వుండవచ్చు. కానీ, సామాన్య ప్రజలు మోడీ ప్రభుత్వ నిజస్వరూపాన్ని అర్థంచేసుకున్నారు. ఈ నెల 8,9 తేదీల్లో జరిగిన సార్వత్రిక సమ్మె భారత శ్రామికవర్గం మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి, గద్దె దించేందుకు సంసిద్ధతతో వున్న విషయాన్ని స్పష్టపర్చింది. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు మాత్రమేగాక, సమాజంలోని అన్ని వర్గాలవారు, సామాజిక కార్యకర్తలు సార్వత్రిక సమ్మెకు మద్దతునిచ్చారు. ఈ ఐక్యతను పరిరక్షించి, మరింతగా పటిష్టవంతం చేయవలసిన అవసరముంది. దాదాపు 20 కోట్ల మంది కార్మికులు సార్వత్రిక సమ్మెలో వున్నరోజే మోడీ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్ చట్టానికి సవరణలను లోకసభలో ప్రవేశపెట్టింది. కార్మికులు గత అర్థశతాబ్దకాలంలో ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను హరించడమే ఈ సవరణల లక్ష్యం. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యలను ప్రతిఘటించడానికి కార్మిక సంఘాలు ఐక్యతను మరింత విస్తృతపర్చవలసిన అవసరముంది. సప్లమెంటరీ బడ్జెట్ పద్దులను మంజూరు చేసేందుకు మాత్రమే ఈ నెల 31 నుండి జరుగనున్న పార్లమెంటు సమావేశంలో కార్మిక వ్యతిరేక చట్టాన్ని తీసుకొచ్చేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేయవచ్చు. గతంలో కూడా ద్రవ్యబిల్లుగా ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల చట్టాన్ని కేంద్రం ఆమోదించింది. ప్రజావ్యతిరేక మోడీ ప్రభుత్వం పట్ల మిగిలిన నూరురోజుల్లో ప్రజలు అప్రమత్తంగా వుండవలసిన అవసరం ఎంతైనా వుంది. దేశ పౌరులారా బహుపరాక్.

చురక

రాజకీయ అధికారం
రంగు మార్చే నేతలు
ప్రజలు నమ్మి గెలిపిస్తే
పెతున్నారు వాతలు

తలను ఊపే గంగిరెద్దు
తీరులాగ ఆటలు
స్వార్థానికి పార్టీ మారే
సంపాదన వేటలు

- వేల్పుల నారాయణ

అనుచితం - ఉచితం

అక్షర శరాలు - అలేఖ్య

అటు పార్లమెంటు ఎన్నికలు, ఇటు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలన్నీ ఓటర్ల మీద ఎనలేని ప్రేమను కనబరుస్తూ 'ఉచిత' హామీల వర్షాన్ని కురిపిస్తున్నాయి. ఇదివరకు అదేదో సినిమాలో ఓ రాజకీయ నాయకుడు వాగ్దానం చేసినట్లు, రాష్ట్రానికో సముద్రం, జిల్లాకో, తాలూకాకో కాలువ, ఊరికో బస్సు, వీధికో దీపం, ఇంటికో గేదె, ఇల్లాలికో తాళి ఉచితంగా ఇచ్చినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఇటీవల తమిళంలో వచ్చిన 'సర్కారీ' అనే సినిమా ఇటువంటి ఉచిత హామీలపై విమర్శలు ఎక్కుపెట్టడంతో సినిమాపై అధికార పక్షం ఆంక్షలు విధించటం అందరికీ విధితమే. దీనినిబట్టి ఏమి అర్థమైతుందంటే, ఎటువంటి విచక్షణజ్ఞానం లేకుండా రాజకీయ నాయకులు ఇస్తున్న ఉచిత హామీల గురించి సామాన్య ప్రజలను మేల్కొల్పటం కూడా నేరమేనని.

ఈ ఉచిత హామీల చరిత్రను ఒకసారి పరిశీలిస్తే గతంలో ఎన్నో రాష్ట్రాల రైతులకు ఉచిత విద్యుత్తు హామీ ఇచ్చి దాన్ని సక్రమంగా అమలు చెయ్యలేక, ఆర్థికంగా దెబ్బతిన్నాయి. కేవలం ఉచిత విద్యుత్ అని 9 గంటలు కూడా ఇవ్వలేని ప్రభుత్వాలు రైతులకు రుణమాఫీలు చేస్తాయంటే ఎలా నమ్మాలి. ఇటువంటి ఉచిత హామీలకు ఆద్యుడు ఒకప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి కీ॥శే॥ ఎంజీ రామచంద్రన్ అని చెప్పవచ్చు. ఆయన కాలంలో ఎన్నికల ప్పుడు ఓటర్లకు ఉచితంగా చీరలు, పంచెలు పంచి పెట్టారు. తదనంతర కాలంలో (2006) డీఎంకే పార్టీ ఎన్నికల్లో ప్రతి ఇంటికి ఓ కలర్ టీవీ పంపిణీ చేసింది. ఈ పందారానికి ఎటువంటి నియమ నిబంధనలు కాని, నియంత్రణ కాని లేకుండా పోయింది. 2011 ఎన్నికలకొచ్చేసరికి తానేమీ తక్కువ తినలేదన్నట్లు ఏఐడీఎంకే అధినేత్రి రామచంద్రన్ వారసురాలు జయలలిత 9000 కోట్ల రూపాయల విలువ చేసే తొమ్మిది లక్షల లాప్‌టాప్‌లు, 25 లక్షల మిక్సీలు, గ్రైండర్లు, 4 గ్రాముల బంగారు నాణేలు ఇలా ఒకటేమిటి అడిగిన వారికి, అడగని వారికి ఏదో ఒక వస్తువు ముట్టచెప్పింది. కొంతమంది పార్టీ కార్యకర్తలు వీటిని పెద్దఎత్తున వేరే రాష్ట్రాలకు తరలించి అమ్ముకున్న సందర్భాలు లేకపోలేదు. ఇవే కాకుండా రైతులకు రూ. 60.000, పక్కా ఇళ్లు, గేదెలు, గొర్రెలు, పేద యువతుల పెళ్లిళ్లకునెజూ. 50,000 నగదు సహాయం వంటివి అదనం. ఇలా ఒకరికొకరు పోటీలుపడి ఓటర్లను ఆకర్షించడానికి పెద్దఎత్తున నిధులు దుర్వినియోగం చెయ్యడం నేటి రాజకీయ నాయకులకు పరిపాటిగా మారిపోయింది. ఇటువంటి చర్యలవల్ల ఆర్థిక పరిస్థితి దిగజారి చివరకు ఓడిపోయిన పార్టీలు బజారున పడే ప్రమాదముంది.

2013లో సుబ్రహ్మణ్య బాలాజీ అనే వ్యక్తి తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో కేసువేస్తూ, ఇటువంటి ఉచితాలన్నీ ప్రజలకు లంచమివ్వటం వంటిదేనని (1951 యాక్టు) రాజ్యాంగ విరుద్ధమని, సెక్షన్ 123ను అతిక్రమించినట్లేనని వాదించడం జరిగింది. కాని దురదృష్టవశాత్తు సెక్షను 123 ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థులకు సంబంధించినదని, పార్టీలకు సంబంధం లేదని పేర్కొంది. అంతేకాకుండా పార్టీలు ఇచ్చే బహుమతు లను లంచాల కింద చూడలేమని తీర్పు చెప్పింది. అంటే ఓట్ల కోసం ఒక అభ్యర్థి ఏదన్నా కానుక ఇవ్వచూపితే అది లంచం కిందకు వస్తుంది అదే అతని పార్టీ అదే కానుకను ఇస్తే మాత్రం అది లంచం కిందకు రాదు. న్యాయస్థానాలు కూడా అప్పుడప్పుడు విచిత్రమైన తీర్పునిస్తుంటాయనే విషయం ఇది చూస్తుంటే నిజమనిపిస్తోంది.

అమెరికాలో ప్రభుత్వ నిధులను ఎట్టి పరిస్థి తుల్లో ప్రయివేటు ఆస్తుల కోసం ఉపయోగించకూ దదని ఆ దేశ న్యాయస్థానాలు తీర్పు చెప్పాయి. ఏదైనా రాజకీయ పక్షం ఉచితంగా కంప్యూటర్లను పంచాలనుకుంటే కేవలం వాటిని ప్రభుత్వ పాఠశాల ల్లోని పేద విద్యార్థులకు మాత్రమే పంచాల్సి వుంటుంది. ఆ కంప్యూటర్లు కూడా విద్యార్థులు పాఠశాలల్లో వినియోగానికి గాని విద్యార్థుల సొంతానికి కాదు. ఇందువల్ల పాఠశాలల్లో శాశ్వతంగా మౌలిక వసుతులు ఏర్పడతాయి. కాని మన దేశంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా విద్యార్థులకు ట్యాబ్‌లు, విద్యార్థినులకు సైకిళ్లంటూ పంచిపెడుతూ వుంటారు.

కాని మన న్యాయస్థానాలకు మాత్రం ఇటు వంటి నిర్ణయాలేవి తప్పుగా కనపడట్లేదు. ఈ ఉచిత బహుమతుల్ని కూడా సమాజ సంక్షేమ చర్యలలో భాగంగా పరిగణించటం విడ్డూరం. అసలు మిక్సీలు, గ్రైండర్లు, ఫ్యానులు వంటి వాటి పంపిణీ ఏ విధంగా సంక్షేమ కార్యక్రమాల కిందకొస్తాయో అర్థంకాదు. హిందూ సాంప్రదాయంలో ఎవరినన్నా అవసరార్థం కలిసేటప్పుడు ధనం ఇవ్వజూపితే అది లంచం అవుతుంది. అదే పత్రం, ఫలం, తోయం అన్నట్లు ఏ కాయో, పండో తీసుకెళితే మాత్రం తప్పుకాదు. బహుశా అందుకనే మన న్యాయస్థానాలకు ఎన్నికలప్పుడు కానుకలు పంచటం తప్పుగా కనిపించలేదు. పైపెచ్చు అవన్నీ జిల్లా కలెక్టర్ల ద్వారా పంచటంవల్ల, వాటి ఖర్చును ఆడిట్ చెయ్యటం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథాకల కిందే పరిగణించవచ్చని సుప్రీం కోర్టే పేర్కొన్నది.

సెక్షన్ 123 ప్రకారం ఉచిత బహుమతుల పంపిణీ న్యాయస్థానాలకు తప్పుగా కనపడకపోవచ్చు, కాని వాస్తవానికి వీటి ప్రభావం పేద, మధ్యతరగతి వర్గాల్లో అత్యధికం. ఇటువంటి వాటివల్ల ఎన్నికలు పారదర్శకంగా, నిజాయితీగా జరుగుతాయనుకో వటం అవివేకమే. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ఓటర్లకు ట్రాక్టర్లను సైతం పంపిణీ చేసిన ఉదంతాలున్నాయి. తెలంగాణాలో ఎన్నికల సమయంలో ప్రభుత్వం చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీని ఎలక్షన్ కమిషన్ అడ్డుకున్నది. ఒకడుగు ముందుకేసి ఇటువంటి ప్రలోభ పర్వాలకు అడ్డుకట్ట వేయాలని సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీం కోర్టు మాత్రం అది తన పరిధిలోనిది కాదని, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను సమన్వయ పరిచి ఇటు వంటి ప్రలోభాలకు పాల్పడకుండా వారిని ఒప్పించాలని, ఎలక్షన్ కమిషన్‌కు ఒక ఉచిత సలహా పడేసింది.

భారత క్రికెట్ కౌన్సిల్‌ని ప్రక్షాళన చెయ్యాలని, డీజిల్ వాహనాలను నిషేధించాలని కింది కోర్టుల్లో ఖాళీలను భర్తీ చెయ్యాలని వివిధ సమస్యలపై కేసులను సుమోటోగా స్వీకరించి ప్రభుత్వాన్ని ఆ దిశగా స్పందించేటట్లు ఆదేశిస్తోంది. కాని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉచిత తాయిలాలపై నిషేధం విధించటానికి వెనుకాడుతోంది. ఇటీవల ఎన్నికలను ఎదుర్కొన్న అన్ని రాష్ట్రాలూ రైతులకు రుణమాఫీ, పక్కా గృహాలు, ఉచిత విద్య, ఉచిత ఆరోగ్యం, ఉచిత భోజనం, నిరుద్యోగులకు భృతి వంటి వాటిని ఉచితంగా ప్రస్తావిస్తుంటే, వీటన్నిటికీ ఆర్థిక వనరులెక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించిన న్యాయస్థానాలు లేవు. ఇప్పుడున్న అధికారపక్షం ఒకడుగు ముందుకేసి ఏకంగా పదిశాతం రిజర్వేషన్లు కల్పించటం నిజంగా ఉచితాల్లో సమయానుచిత నిర్ణయం అని చెప్పవచ్చు. నిజానికి ఎన్నికల ముందు రాజకీయ పార్టీల మానిఫెస్టోలను పరిగణనలోకి తీసుకొని వాటిలో సాధ్యసాధ్యాలపై అధ్యయనం జరిపి, సుమోటోగా కేసును స్వీకరించి అనుచిత వాగ్దానాలను ఇచ్చే రాజకీయ పార్టీలను కోర్టు బోనుల్లో నిలబడితే తప్పకుండా మరోసారి అటువంటి వాగ్దానాలు చెయ్యకుండా జాగ్రత్తపడతారు. కాని ఇటువంటి చర్యలకు మన న్యాయస్థానాలకు సమయం లేదు.


కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో పెద్దఎత్తున ఉద్యోగ నియామకాలు చేపడతామని వాగ్దానం చేసి చివరకు చేతులెత్తేశాయి. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటానికి నిరుద్యోగ భృతి, రిజర్వేషన్లు వంటి తాయిలాలు ప్రకటిస్తున్నాయి. అవినీతిరహిత పాలనను అందించలేని ప్రభుత్వాలే ఉచిత కానుకలతో ప్రజలను ప్రలోభపెడతాయి. అవినీతికి అలవాటుపడ్డ వ్యక్తి తన తప్పును కప్పిపుచ్చుకోవటానికి తనచుట్టూ వున్నవారికి కూడా లంచాలు ఎరవేస్తారు. ఇప్పుడు రాజకీయ పార్టీలు చేస్తున్న పనికూడా ఇదే.

కనీసం ఇప్పటికైనా అత్యున్నత న్యాయస్థానం మేల్కొని ఈ ఉచిత కానుకలపై స్పందించకపోతే, రానున్న ఎన్నికల్లో ఉచితాల వలలో ఇరుక్కుని సామాన్యులు తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం వుంది. గత ఎన్నకల్లో రుణమాఫీ హామీ ఇవ్వకపోవటం వల్లే ఓడిపోయామని భావిస్తున్న ప్రతిపక్షం నవరత్నాల వల విసురుతోంది ఓటర్లపై. దీనికి వారిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. ప్రజల నిస్సహాయతను అబద్ధపు వాగ్దానాలతో సొమ్ముచేసుకుంటున్న పార్టీలున్నంతకాలం నిజాయితీగా రాజకీయాలు చేసేవారు ఓటమి చవిచూస్తూనే వుంటారు. కాబట్టి ప్రజలే అత్యాశకు పోకుండా, ఉచితాల ఎరలకు లొంగకుండా నిజమైన నాయకులను ఎన్నుకోవాలి.

చాసోగారికోపమొచ్చింది

డా.డి.వి.జి.శంకరరావు

నేడు ఛాసో జయంతి సందర్భంగా



ఎప్పుడో స్వర్గస్తులైన ప్రముఖ కథకులు చాసో కి ఇప్పుడు కోపమెలా వచ్చిందని బుర్ర గోక్కోకండి. మా విజయనగరం లో అంతే. సాహితీ వేత్తలిక్కడ మరణించరు. మా మధ్యలోనే తిరుగాడుతారు. మాతో మాట్లాడుతుంటారు. గురజాడ వారు, శ్రీశ్రీ, చాసో, ఆదిభట్ల, పతంజలి, ఒకరేమిటి కీర్తిశేషులందరూ ఊరిపై అభిమానం తో స్వర్గంలో కన్నా ఎక్కువగా ఇక్కడే సమయాన్ని గడుపుతారు. సాహితీ సమావేశాల తర్వాత మాతో ముచ్చట్లాడతారు.

గురజాడ వారు తన బోధలకి అభిమానుల కన్నా, తను సృష్టించిన పాత్ర గిరీశానికి అనుచరులు ఎక్కువైనారని అంటుంటారు. మనవాళ్ళుత్త వెధవాయిలోయ్ అంటూ ముచ్చట పడతారు తప్ప మొహం మాడ్చుకోరు. శ్రీశ్రీ అయితే అనవసరంగా తాను 'పదండి ముందుకు,పదండి తోసుకు ' అంటూ పిలుపిచ్చినానే, మన తెలుగువాళ్లు పక్కనున్న వారిని తోసుకు వెళ్లడం లోని శ్రద్ధ ముందుకు వెళ్ళడం లో చూపించడం లేదే అని బాధపడతారో తప్ప కోపం చెందరు. పతంజలి వారు భూమి ప్రస్తుతం బల్లపరుపు గా లేకుండా కమలం రేకుల్లా పొడుచుకుని ఉందంటూ అంటున్నారు.

అయితే చాసో గారు కూడా మున్నెన్నడూ కోపంగా లేరు. ఎంపు కథలో బాగా ముష్టి వాడి నుండి అత్యంత అమెరికా బలిష్టి వరకూ తాను చెప్పినట్లు ఎవడికి వాడు ఆర్థిక లాభం చూసుకోవడం కరెక్ట్ అయిందంటూ. నాటికే కాదు, నేటికీ, ఏనాటికీ ఇదే ఖాయమని అంటుంటారు. ఘాటుగా చుట్ట పీల్చి నిట్టూర్పు విడుస్తారు తప్ప ఇలా లేదు. ఈ రోజు నన్ను చూడగానే ఆయన చుట్ట చివర నిప్పు కన్నా ఆయన ముఖమే ఎర్రగా ఉంది. నాకర్థం కాలేదు. పైగా ఈరోజు వారి ముద్దులమ్మాయి చాగంటి తులసి గారిని కలిసి వస్తున్నాను. చక్కని సాహితీ ముచ్చట్లాడి.. సామాజిక మార్పుల కబుర్లు చెప్పుకుంటూ ఉపాహారం తిని. ఆఖరున చాసో లేఖల్ని కూడా నాకందించారు. చాసో గారి కథలపై నా మక్కువని తెలియబరుస్తూ చర్చలో కూడా పాల్గొన్నానే, మరి ముభావంగా ఉన్నారేం ఈయన అనుకొంటూ కారణమ్మడిగాను.

'మీ చర్చలయిపోయాక ఏమన్నావో గుర్తుందా?' నిలదీశారు.

'థాంక్యూ మేడం అని సెలవు తీసుకున్నాను'

'అంతకు మునుపు'

కొంచెం మేధోమథనం చేస్తే గానీ గుర్తుకురాలేదు. జ్ఞాపకం వెలిగిన తర్వాత చెప్పాను

'ఓహ్..అదా! 'చాలా సంతోషం అమ్మా. మీరు చాలా విలువైన చాసో లేఖల సంపుటి ఇచ్చారు. కానీ అంతకన్నా నాకు మీరు పెట్టిన రవ్వలడ్డు అద్భుతమైనది' అన్నాను సార్.'

"మరి నా లేఖల్ని,రచనల్ని రవ్వలడ్డు కన్నా తక్కువ చేస్తావా?"

'ఓహ్..అందుకా' అంటూ నవ్వుతూ చెప్పాను

"మీరు, మీ చిన్నారి తల్లి చిన్నాజీ ఆడాటున పస్తే,రాస్తున్న మహాకావ్యాన్ని రాయకుండా ఆపేసి.పక్కన పడేయొచ్చన్న మాట. నేను మాత్రం తను స్వహస్తాలతో చేసిన రవ్వలడ్డు ని పొగడ రాదా!మీ లేఖల పుస్తకం మార్కెట్ లో కొనుక్కోవచ్చు.కానీ ఆమె చేతి లడ్డు కి విలువ కట్టగలమా!"

కన్విన్స్ అయినట్టున్నారు.గట్టిగా దమ్ము పీల్చి నా భుజం తట్టారు.

వ్యాసరచయిత మాజీ ఎంపీ

జలంధర్ సైన్స్ కాంగ్రెస్ పరిహాసం

విశ్లేషణ

ఎం కోటేశ్వరరావు

పరస్పర విరుద్ధశక్తులు నిరంతరం పని చేస్తూనే వుంటాయి. ఒకటి వెనక్కి లాగుతుంటే మరొకటి ముందుకు తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తుంది. ఈ పోరులో ఇప్పటి వరకు జరిగిన చరిత్ర అంతా మొత్తం మీద పురోగామి శక్తుల విజయమే. అయినా సరే ఎప్పటికప్పుడు తిరోగామి శక్తులు తమ పని తాము చేస్తూనే వుంటాయి. జనవరి మూడు నుంచి ఏడవ తేదీ వరకు పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన భారత సైన్స్ కాంగ్రెస్ 106వ సమావేశాలలో కూడా జరిగింది అదే. అక్కడ చేసిన కొన్ని ఉపన్యాసాలు, సమర్పించిన పత్రాలు ప్రపంచంలో మనల్ని నగుబాట్లపాలు చేశాయి. ప్రపంచ మీడియా వీటి గురించి బహుళ ప్రచారమిచ్చింది.రెండు సంవత్సరాల క్రితం కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన బయాలజిస్ట్, నోబెల్ బహుమతి గ్రహీత అయిన వి రామకృష్ణన్ తాను హాజరైన సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో సైన్సు గురించి చర్చించింది తక్కువని తానింకోసారి ఇలాంటి సమావేశాలకు హాజరు కానని చెప్పిన మాటలు ఇంకా మన చెవుల్లో గింగురు మంటున్నా ఒక్కరంటే ఒక్కరు కూడా సదరు ఉపన్యాసాలను అడ్డుకొనేందుకు ప్రయత్నించలేదు. గత మూడు సమావేశాలలోనూ జరిగింది అదే. తాజా సమావేశాలు 'భవిష్యత్ భారత్ : శాస్త్రము, సాంకేతికము' అనే ఇతివృత్తంగా జరిగాయి. ఆందోళనకరమైన అంశం ఏమంటే గత సమావేశాల అనుభవాలను చూసి అలాంటి శక్తులు ఆ వేదికను ఉపయోగించుకోవటాన్ని అడ్డుకొనేందుకు ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. అశాస్త్రీయ విషయాలను నిరూపిత అంశాలుగా చిత్రిస్తున్న వారిని ఒక్కరంటే ఒక్కరు కూడా ఈ సమావేశాలలో నిలదీసి ప్రశ్నించకపోవటం మన శాస్త్రవేత్తల భావదారిద్ర్యానికి నిదర్శనమా! లేక తాము నమ్మిన, పరిశోధించిన అంశాలమీదే అపనమ్మకమా ? రెండూ ప్రమాదకరమే !

న్యూటన్ పుట్టక ముందే గురుత్వాకర్షణ శక్తి వుంది, డార్విన్ తాను చెప్పిన పరిణామ క్రమంలో భాగంగానే ఒక మానవుడిగా పుట్టాడు. వాటిని ఒక శాస్త్రీయ పద్ధతిలో వివరించటమే వారు చేసింది. ఆ రంగాలలో నిష్ణాతులైన వారు వాటిని అంగీకరించారు. అవి ప్రపంచం ముందుకు వచ్చినపుడు ఏ వేద లేదా సంస్కృత పండితుడు అవన్నీ తమకు ఎప్పుడో తెలుసని సవాలు చేసిన వారుగానీ, వివరించిన వారు గానీ లేరు. రాబోయే రోజుల్లో ఎవరైనా ఆ సిద్ధాంతాలు తప్పని ఆధారాలతో నిరూపిస్తే ఆ నూతన సిద్ధాంతాలను సమాజం అంగీకరిస్తుంది, అనుకరిస్తుంది. అదేమీ లేకుండా ఫలానా సిద్ధాంతాన్ని నేను తప్పు అంటున్నాను, లేకపోతే ఇవన్నీ వేదాల్లోనే వున్నాయనో పిచ్చివారెవరైనా చెబితే శాస్త్రవేత్తలు ప్రశ్నించలేకపోవటం నిజంగా మన దౌర్భాగ్యం కదూ ! ఇతర దేశాలతో పోటీపడి మన దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని అందరూ కోరుకుంటారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సభలు జరుగుతున్నాయంటే ఆ రంగంలో మన పురోగతి, సాధించిన విజయాలను సమాజం ముందుంచి శాస్త్రవిషయాల పట్ల భావిభారత పౌరుల్లో ఆసక్తికలిగించాలని ఎవరైనా ఆశిస్తారు. కానీ గత నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్నదేమిటి? దానికంటే అశాస్త్రీయ విషయాలను ముందుకు తెచ్చి వేదాల్లో అన్నీ వున్నాయష అనే రోజుల్లోకి తీసుకుపోతున్నారు. నిజానికి ఇదొక మానసిక వ్యాధి లక్షణంలా వుంది. ప్రతి సమాజం ఘనమైన గతంతో పాటు సిగ్గుపడాల్సిన అంశాలను కూడా కలిగి వుంటుంది. గత సమాజాల్లో అంతా ఘనతే వుంటే జనం మార్పులను ఎందుకు కోరుకున్నట్లు ?

జలంధర్ సైన్స్ సభల్లో కొందరు చేసిన ప్రవచన అంశాలు దేశాన్ని వెనక్కి తీసుకుపోయేవిగా వున్నాయి. అవేమిటో సంక్షిప్తంగా చూద్దాం. మహాభారత కాలం నాటికే మన దేశంలో టెస్టు తాడు కణాల పరిశోధన వుంది, వంద కుండల్లో వంద అండాలను పెట్టి కౌరవులను పుట్టించారు, ఇది టెస్ట్ ట్యూబ్ పిల్లల పరిజ్ఞానం కాదా అంటూ ఆంధ్రావిశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జి నాగేశ్వరరావు ప్రశ్నించారు. ఈ పేరుమోసిన విద్యావేత్త మేధస్సు అంతవరకే పరిమితం కాలేదు, రావణుడికి ఎందరు ఎక్కినా ఒకరికి ఖాళీ వుండే పుష్పక విమానం వుండటమే కాదు, లంకలో ఇరవైనాలుగు చిన్నా పెద్ద విమానాలు, ఎన్నో విమానాశ్రయాలు వుండేవని, సైనిక అవసరాలకువిమానాలను వాడారని కూడా రామాయణం చదివితే మనకు తెలుస్తుందని కూడా సెలవిచ్చారు. అంతేనా చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతం కంటే ముందే దాని గురించి మనకు తెలుసని డార్విన్ చెప్పినదాని ప్రకారం తొలి జీవి నీటి నుంచి ప్రారంభమైందని దశావతారాల్లో మత్స్యావతారం మొదటిదని అంటే దశావతారాలు పరిణామ సిద్ధాంతమని కూడా నాగేశ్వరరావు చెప్పారు. విష్ణువు దగ్గర లక్ష్యాన్ని ఛేదించి తిరిగి వచ్చే నియంత్రిత క్షిపణుల మాదిరి శంఖుచక్రం వుందని కూడా చెప్పారు.

రావణుడి గురించి చెప్పిన రావుగారు రాముడి విమానాల గురించి చెప్పలేదు. పురాణాల ప్రకారం సత్య, త్రేతా, ద్వాపర, కలియుగాల్లో రకరకాల విమానాలున్నాయి. వాటిలో ఎక్కువ భాగం మానసిక శక్తితోనే నడిచాయి. అలాంటపుడు రాముడికి విమానాలెందుకు లేవు, అడవులకు రథాల మీద, నదులు దాటేందుకు పడవలు ఎందుకు ఎక్కారు. విమానాల మీద పోవచ్చు కదా ! రావణుడు అడవిలోని సీతను అపహరించేందుకు రథంలో వచ్చాడు, సీతను రథంలో ఎక్కించుకొని పోయి సముద్రాన్ని ఎలా దాటాడు, రథాన్ని ఎక్కడ వుంచాడు, సముద్ర ప్రయాణానికి ఓడను వుపయోగించాడా ? విష్ణుమూర్తి అవతారంగా చెబుతున్న రాముడి దగ్గర నియంత్రిత క్షిపణి శంఖుచక్రం బదులు విల్లు, బాణాలు ఎందుకున్నాయి, విమానాలు ఎందుకు లేవు? లంకను చేరుకొనేం దుకు రాముడి దగ్గర ఓడలు కూడా లేవా, వుంటే వానర సైన్య సాయంతో వారధిని ఎందుకు కట్టించినట్లు ? రావణుడిని సంహరించేందుకు క్షిపణి ప్రయోగం ఎందుకు చేయలేదు. హనుమంతుడు లంకా దహనం చేశాడని రాశారు తప్ప రావణుడి దగ్గర వున్న పుష్పక విమానాన్ని, ఇతర విమానాలను, లంకలోని విమానాశ్రయాలను దహనం చేయలేదా, వానర లేదా రాముడి సేనలపై రావణుడు వైమానిక దాడులు ఎందుకు చేయలేదు, రావణుడిని వధించిన తరువాత రాముడు ఆ విమానాలను స్వాధీనం చేసుకోలేదా ? ఆ తరువాత ఆ విమానాలు, క్షిపణులు ఏమయ్యాయి అనే ప్రశ్నలకు కూడా వైస్ ఛాన్సలర్‌గారు సమాధానాలు చెప్పాల్సి వుంది. మన వేదాలు లేదా సంస్కృత గ్రంధాలను పరదేశీయులు అపహరించారు, వాటి ఆధారంగా నూతన అవిష్కరణలు చేశారు అని చెబుతారు. ఇలాంటి కాకమ్మ కథలు వినటానికి వీనుల వింపుగా వుంటాయి. మనమెందుకు చేయలేదు ? ఇలాంటివి ఇంకా చాలా వున్నాయి.

సమస్య ఏమంటే మన శాస్త్రవేత్తలు ఇలాంటి ప్రచారాన్ని ఖండిస్తూ ఎందుకు ముందుకు రావటం లేదు. వేదికలపై ఎందుకు అనుమతిస్తున్నారు. దీనికి ప్రధానంగా ఒకటి కనిపిస్తోంది. ప్రభుత్వం సైన్స్ కాంగ్రెస్ వంటి వాటికి ధన, ఇతర రూపాలలో కొంత సాయం చేస్తున్నది. వాటిని ప్రారంభిస్తున్న ప్రధాని, కేంద్ర మంత్రులు స్వయంగా ఇలాంటి అశాస్త్రీయ విషయాలను తమ సందేశాలలోవెల్లడిస్తున్నారు. అందువలన వారికి లేదా వారి దివాలాకోరు భావజాలానికి వ్యతిరేకత వ్యక్తం చేస్తే సాయం ఆగిపోవచ్చు, నిర్వాహకుల ఉద్యోగాలకు ముప్పు రావచ్చు, ప్రమోషన్లు ఆగిపోవచ్చు, అలాంటపుడు ఎవరేమి చెబితే మన కెందుకు అనే దిగజారుడుతనం తప్ప మరొకటి కనిపించటం లేదు.

సైన్స్ కాంగ్రెస్‌లో అశాస్త్రీయ ప్రకటనలు చేయటాన్ని సభకు హాజరైన వారు ఖండించకపోయినా బెంగళూరులో కొందరు శాస్త్రవేత్తలైనా నిరసించి పరువు కాపాడారు. ఇదేమాత్రం చాలదు. వివిధ సంస్థలకు చెందిన వున్నతాధికారులేమి చేస్తున్నారు. సైన్స్ కాంగ్రెస్ అజెండా నిర్ణయంలో ప్రభుత్వానికేమీ పాత్ర వుండదని ప్రభుత్వ ప్రధాన శాస్త్ర సలహాదారు కె విజయ రాఘవన్ చెప్పారు. ఆంధ్రవిశ్వవిద్యా లయ వైస్ ఛాన్సలర్ నాగేశ్వరరావు చెప్పిన అంశాలను విమర్శిస్తూ అతని మీద ఒక ఫిర్యాదును దాఖలు చేయాలన్నారు. ఒక ప్రముఖ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా వున్న బయాలజిస్ట్ నాగేశ్వరరావు చెత్త మాట్లాడుతున్నపుడు శాస్త్రవేత్తల్లో వేడి పుట్టాలని అన్నారు. నాగేశ్వరరావు, కృష్ణన్ మాట్లాడిన అంశాలు అపహాస్యం పాలుగావటంతో వాటితో తమకేమీ సంబంధం లేదని సైన్స్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రేమేందు పి మాథుర్ ప్రకటించారు. తదుపరి తమ సమావేశాల్లో ప్రసంగించే వారికి సంబంధించి నిబంధనలు సవరించనున్నామని, వారేమి మాట్లాడేది తెలుసుకొని, ఇతర విషయాలు మాట్లాడబోమనే హామీలు తీసుకొని సరైన వారిని ఎంపిక చేస్తామని చెప్పారు. తానే గనుక ప్రసంగ సమయంలో అక్కడ వుండి వుంటే ఏం మాట్లాడుతున్నారని ప్రశ్నించేవాడినని, ఆధారం చూపమని కోరి వుండే వాడినని అన్నారు. సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు మనోజ్ చక్రవర్తి విలేకర్లతో మాట్లాడుతూ నాగేశ్వరరావు మాటలతో తాను దిగ్భ్రాంతి చెందానని, అతనికి ఈ విషయాలు ఎలా తెలుసు, ఏదైనా ఆధారం వున్నదా, శాస్త్ర సమాజం దిగ్భ్రాంతి చెందింది అని వ్యాఖ్యానించారు. తాము కొల్‌కతా వెళ్లిన తరువాత అతను చేసిన ప్రసంగాన్ని ఖండిస్తూ లాంఛనంగా ఒక ప్రకటన చేస్తామని వెల్లడించారు. ఈ ప్రకటనలతో వైస్ ఛాన్సలర్ నాగేశ్వరరావుకు ఏమైనా పరువు ప్రతిష్టలుంటే పదవి నుంచి తప్పుకొని వుండాల్సింది.

ప్రపంచం మీద ప్రభావం చూపిన నాలుగువేల మంది శాస్త్రవేత్తలలో భారతీయులు కేవలం పది మందే అన్నది టెక్2 న్యూస్ విశ్లేషణ. ప్రతి ఏటా ప్రపంచవ్యాపితంగా ఎక్కువగా వుటంకించిన శాస్త్రవేత్తల జాబితాను క్లారివేట్ అనలిటిక్స్ అనే సంస్థ గత ఐదు సంవత్సరాలుగా ప్రచురిస్తున్నది. 2018 జాబితాలో పేర్కొన్న పది మందిలో సిఎన్ఆర్ రావు (ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, బెంగళూరు),దినేష్ మోహన్ (ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్), రాజీవ్ వర్షనే (వ్యవసాయ శాస్త్రవేత్త, ఇక్రిశాట్), అశోక్ పాండే, టాక్సికాలజీ పరిశోధకులు, అవినిష్ అగర్వాల్, అలోక్ మిట్టల్, జ్యోతి మిట్టల్ (ఎన్విరాన్‌మెంటల్ సైన్సు), రజనిష్ కుమార్(కెమికల్ ఇంజనీరింగ్), సంజీవ్ సాహు(నానో టెక్నాలజీ), శక్తివేల్ రత్నస్వామి(కంప్యుటేషనల్ మాథమాటిక్స్). నాలుగువేల మంది శాస్త్రవేత్తలు 60దేశాలకు చెందిన వారు. వీరిలో 80శాతం మంది కేవలం పదిదేశాలకు చెందిన వారైతే 70శాతం ఐదుదే శాల నుంచి వున్నారు. దేశాల రీత్యా అమెరికా 2,639,బ్రిటన్ 546, చైనా 482, భారత్ 10 మంది వున్నారు. సంస్థల రీత్యా హార్వర్డ్ విశ్వవిద్యాలయం 186మందితో అగ్రస్థానంలో వుంది. ఒకే అంశం మీద పరిశోధన చేసే వారినే గతంలో జాబితాలో చేర్చగా ఈ ఏడాది వివిధ రంగాలలో పని చేస్తున్నవారికి చోటు కల్పించటంతో మన సంఖ్య పదికి చేరిందట. పదిహేను సంవత్సరాల క్రితం చైనా-భారత్ ఒకే స్థాయిలో వుండేవి, ఇప్పుడు ప్రపంచ శాస్త్ర పరిశోధన ఫలితాల్లో చైనా 15-16 శాతం సమకూర్చుతుండగా మన దేశ వాటా నాలుగు శాతమే అని సిఎన్ఆర్ రావు చెప్పారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలు దీనికి దోహదం చేసే అంశాలలో వున్నాయి. ఇవిగాక పారిశ్రామిక భాగస్వామ్యాలు, పెట్టుబడులు కూడా ప్రభావం చూపుతాయి.

అశాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేస్తున్న పాలకులు, వారికి వంత పలికే కుహనా లేదా ఆత్మను చంపుకొని తాము చదివిన దానికి భిన్నంగా కుహనా శాస్త్ర అంశాలను చెప్పేవారిని ఎదిరించేందుకు ధైర్యం చేయని అశక్తులు అసలు సైన్సు సమావేశాలు ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. కేవలం ఇటు వంటి సమావేశాలే సమాజంలో సైన్సు పట్ల ఆసక్తి కలిగిస్తాయని చెప్పలేము గానీ ఇదొక అవకాశం. పరిశోధన, ప్రచారానికి తగిన నిధులు కేటాయించేందుకు రానురాను పాలకులు విముఖత చూపుతున్నారు. సమాజాన్ని తిరోగమనంలో నడపాలని చూసే వారికి శాస్త్రీయ, ప్రత్యామ్నాయ విధానాల అవగాహన పెరగటం ఏమాత్రం ఇష్టం వుండదు. పరిశోధన, అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించని దేశమూ, సమాజమూ ముందుకు పోయిన దాఖలా మనకు కనపడదు. యధారాజా తధా ప్రజ అన్నట్లు ఆ పని చేయని పాలకులు వున్నపుడు వారికి వంతపాడే మేధావులు కూడా ఇష్టగానాలు, నృత్యాలే చేస్తారు. జలంధర్ సైన్స్ కాంగ్రెస్‌లో జరిగింది అదే. ఇలాంటి ధోరణులను ప్రతిఘటించకపోతే రాబోయే సమావేశాల్లోనూ అదే పునరావృతం అవుతుంది.

విశాలాంధ్ర
బతుకు
The Life
గురువారం
17 జనవరి 2019



శిఖరం తల వంచింది!

సహజంగా పుట్టుకతో అంగవైకల్యం ఉన్న వ్యక్తి తాను ఎదిగే కొద్ది పరిసరాలను తనకు అనుగుణంగా మార్చుకుంటాడు. తను మమూలు మనుషులకేం తక్కువ కాదని నిరూపించు కోవాలని ప్రయత్నిస్తుంటాడు. అలా కాకుండా ప్రమాదవశాత్తు అంగవైకల్యం ఏర్పడితే ఆ వ్యక్తి తన జీవితం అక్కడితోనే ఆగిపోయిందని కృంగిపోతాడు. నలుగురిలో కూడా కలవలేడు. ఎప్పుడూ నిరాశతో బాధపడుతూ కాలం వెళ్ళదీస్తుంటాడు. కానీ ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరుణిమా సిన్హా మాత్రం తను కోల్పోయిన జీవితాన్ని సాధించుకోవాలనే తపనతో ఎవరెస్ట్, కిలిమంజారో వంటి శిఖరాలతో పాటు అంటార్కిటికాలోని ఎత్తైన శిఖరాన్ని అధిరోహించిన మొదటి మహిళగా కీర్తి గడించింది. ఆమె తన ధైర్యంతో పద్మశ్రీ, టెన్సింగ్ నార్కే వంటి అవార్డులను సైతం దక్కించుకుంది.

అరుణిమాది యూపీలోని అంబేడ్కర్ నగర్. అరుణిమా వాలీబాల్, ఫుట్ బాల్ మాజీ జాతీయ క్రీడాకారిణి. ఆమె సిఐఎస్ఎఫ్‌లో ఉద్యోగ రీత్యా పరీక్ష కోసం రైలులో ప్రయాణిస్తున్న సమయంలో దొంగలు పడి ఆమెను బయటకు తోసేశారు. ఆ సమయంలో వేరే రైలు ఆమె కాలుపై ఎక్కడంతో తన మోకాలు దిగువ భాగం నుంచి కాలును తొలగించాల్సి వచ్చింది. ఈ దుర్ఘటన వల్ల తను నాలుగు నెలల పాటు



ఆసుపత్రిలోనే గడపవలసి వచ్చింది. తర్వాత ఢిల్లీకి చెందిన ప్రవేట్ ఇండియన్ కంపెనీ ఆమెకు ఒక కాలును బహుకరించింది. ఇండియన్ రైల్వే ఆమెకు జరిగిన ప్రమాదానికి రూ 5 లక్షల పరిహారాన్ని అందించింది.

ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలోనే తను ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలనుకుంది. దీనికి కారణం క్రికెటర్ యువరాజ్ సింగ్ నుంచి తను పొందనటువంటి ప్రేరణ అటువంటిది. తను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో యువరాజ్ సింగ్ క్యాన్సర్‌తో పోరాడి గెలిచాడని అనేక ఛానల్స్‌లో ప్రచారం చేశారు. ఈ విషయం ఆమెలోని ఉత్సాహాన్ని ఉరకలేయించింది. ఆమె కలను సాకారం చేసుకోవడానికి వైకల్యం పెద్ద అడ్డే కాదని నిర్ణయించుకుంది.

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం కోసం ఉత్తరకాశీలోని నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటనిరింగ్‌లో శిక్షణ పొందింది. ఆమెకు తన అన్న ఓంప్రకాష్ సహకారం కూడా లభించింది. ఈ క్రమంలో అరుణిమా ఎవరెస్ట్‌ను అధిరోహించిన మొదటి భారతీయ మహిళ బచేంద్రిపాల్‌తో ఫోన్‌లో మాట్లాడింది. టాటా స్టీల్ అడ్వంచర్ ఫౌండేషన్ సహాయంతో బచేంద్రిపాల్ ఆధ్వర్యంలో కొంత కాలం శిక్షణ తీసుకుంది.

తన 26 ఏళ్ళ వయస్సులో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించింది. ఎవరెస్ట్ అధిరోహించిన తర్వాత అరుణిమా లక్ష్యం ప్రపంచంలోనే ఎత్తైన ఏడు శిఖరాలను ఎక్కి భారత పతాకాన్ని ఎగుర వేయడం. 2014 చివరకు ఆరు ఎత్తైన శిఖరాలను అధిరోహించింది. జనవరి 4, 2019కి ఏడో శిఖరం అంటార్కిటికాలోని విన్సన్‌ను కూడా అధిరోహించి చరిత్ర సృష్టించింది.





అరుణిమా లక్ష్యంలో భాగంగా ఆఫ్రికాలోని కిలిమంజారో, యూరప్‌లోని ఎల్‌బ్రూరస్, ఆస్ట్రేలియాలోని కాసియాస్కో, అర్జెంటీనాలోని అకాన్కాగో, ఇండోనేషియాలోని కార్ట్సెన్జ్ పిరమిడ్‌ను, చివరగా అంటార్కిటికాలోని విన్సన్ శిఖరాన్ని అధిరోహించి భారతదేశం గర్వించ దగ్గ స్థాయికి ఎదిగింది.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ అరుణిమాని సత్కరించి రూ.25లక్షల రూపాయల చెక్‌ను అందించారు. అరుణమా తను అందుకున్నటువంటి ప్రైజ్ మనీ అంతటిని తన స్వంత ఖర్చులకు వినియోగించకుండా పేద పిల్లలు, వికలాంగుల కోసం స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించింది. ఈ అకాడమీకి షాహీద్ చంద్రశేఖర్ వికలాంగ్ ఖేల్ అకాడమీ అని పేరు కూడా పెట్టింది.

ఆమె తన జీవితంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులను గ్రంధస్తం కూడా చేసింది. ఆ గ్రంధానికి 'బొరెన్ ఎగైన్ ఆన్ ది మౌంటెన్' అని పేరు పెట్టింది. ఆవిడ చూపినటువంటి ప్రతిభకు గానూ భారత ప్రభుత్వం ఆమెను 2015లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. తర్వాత టెన్సింగ్ నార్కే, అర్జున అవార్డును బహుకరించింది.

కలబందతో కోమలంగా!

కలబందను ఇప్పుడు విరివిగానే వాడుతున్నారు. కుండీల్లో పెంచుకోవడం నుంచి ఇంటి అలంకరణ వరకూ ఎన్నో రకాలుగా ఉపయోగిస్తున్నారు. ఇందుకు కారణం ఆరోగ్యం, అందం పెంచడంలో దీనికిదే సాటి. ముఖ్యంగా గృహవైద్యంలో దీని పాత్ర అమోఘం. నిజానికిది ఒక క్రోటన్ మొక్క. ఎడారి మొక్క. చూడడానికి కూడా విభిన్నంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. దీని ఆకులు మందంగా ఉంటాయి కానీ దీని గుజ్జులో 96 శాతం నీరే ఉంటుంది. ఆ గుజ్జును గాయాలు, పుళ్ళకు పైపూతగా వేయవచ్చును. కాలిన గాయాలను తగ్గించడంలోనూ ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ఫంగస్, బాక్టీరియా లాంటివి చేరకుండా చేస్తుంది. ఈ ప్రదేశాల్లో రక్తప్రసరణ వేగంగా జరిగేలా చేస్తుంది. యాంటీ సెప్టిక్‌గా, దురద నివారిణిగా పనిచేస్తుంది. నొప్పిని తగ్గిస్తుంది. గాయాల నుంచి రసి కారకుండా చేస్తుంది. ఆర్థరైటిస్‌ని నివారిస్తుంది. అప్పటికే ఆర్థరైటిస్ బారిన పడినవారికి నొప్పి నివారిణిగా పనిచేస్తుంది. రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గించడం ద్వారా రెండో రకం మధుమేహాన్ని నివారిస్తుంది. జీర్ణసంబంధ వ్యాధులను నివారించడంలోనూ కలబంద రసం బాగా పనిచేస్తుంది. ఎక్స్ కిరణాల నుంచి శరీరాన్నికాపాడడంలో మంచి యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రేడియేషన్ కారణంగా ఏర్పడిన ఫ్రీరాడికల్స్‌ను నశింపచేస్తుంది. సోరియాసిస్ వ్యాధిగ్రస్తులకు మచ్చలను తగ్గించడంలో కలబంద బాగా ఉపయోగపడుతుంది. చర్మ సంబంధ వ్యాధుల నివారణలో గొప్పగా పనిచేస్తుంది. చర్మరంధ్రాలు



తెరుచుకుని పోషకాలు, తేమను గ్రహించేలా చేస్తుంది. దీనివల్ల శరీరం మృదువుగా, కోమలంగా ఉంటుంది. కల బందలో విటమిన్ బి - 13, విటమిన్ సీ-ఇలు అధి కంగా ఉంటాయి. ఈ విటమిన్‌లు పెరిగే వయస్సు కారణంగా వచ్చే లక్షణాలను కనిపించకుండా చేస్తాయి. కేన్సర్ వ్యాధి సోకిన వెంటనే గుర్తిస్తే కలబంద గుజ్జును వరసగా వారం రోజులు తీసుకోండి. కేన్సర్ వ్యాధి కణాలతో సమర్థవంతంగా పోరాడుతుంది. ఒక టేబుల్ స్పూన్ నెయ్యిని వేడి చేసి అదులో రెండు టేబుల్ స్పూన్‌ల కలబంద గుజ్జును వేయించి తింటే పొడి దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది. కొద్దిగా తేనెతో కలిపి మూడు సార్లుగా మూడురోజులు తిన్నా మంచి ఫలితం ఉంటుంది. చిటెకెడు మిరియాల పొడిని టేబుల్ స్పూన్ కలబంద గుజ్జులో కలిపి రోజుకు మూడుసార్లు తింటే మహిళలకు రుతుసమయ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కళ్ళు మండుతున్నాయా? కళ్ళమీద కలబంద గుజ్జును పెట్టండి. నిముషాల్లో ఉపశమనం లభిస్తుంది.



మనసు దోచే హెయిర్ పిన్స్

హెయిర్ పిన్స్ ఎప్పటినుంచో వాడుకలో ఉన్నవే. కాకపోతే వాటి రూపం మారింది. పూర్వం హెయిర్‌పిన్స్ అంటే కేవలం స్లైడ్స్, అవికూడా చాలా సాదాసీదాగా ఉండేవి. ఆ తర్వాత కాలంలో వాటిమీదే చిన్నచిన్న డిజైన్లు వచ్చేవి. ఇప్పుడు వీటి రూపం పూర్తిగా మారిపోయింది. వేళ్ళకు పెట్టే ఉంగరాలు, చెవులకు పెట్టే లోలాకుల మాదిరిగానే ఇది కూడా ఎన్నో ఆకృతులను సంతరించుకుంది. ముత్యాలు, చమ్కీలతో చమక్కులు చూపిస్తోంది. గోల్డ్, సిల్వర్ కోటింగ్‌తో కేక పెట్టిస్తోంది. తామరపూలు, చెట్లు ఇలా రకరకాల రూపాల్లో మనసు దోచేస్తోంది. మరి ఇలాంటి హెయిర్ పిన్స్ మీకూ ఉన్నాయా!



గోధుమ మొలకల జ్యూస్..!

అనారోగ్య సమస్యలు నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే తపనా అదే స్థాయిలో పెరుగుతోంది. జీవించినన్ని రోజులూ ఆరోగ్యంగా జీవించాలని ఆశిస్తున్నవారంతా ఫాస్ట్‌ఫుడ్‌కి చెక్ పెట్టి ముండి ఆహారాన్ని తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రకృతి సహజంగా లభించే పండ్లు, కూరగాయలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని పదిలపరుచుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఉడికించిన ఆహారంలో కాన్న ముడి ఆహారంలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయని, శరీరానికి కావలసిన ఖనిజాలు, విటమిన్లు ఎక్కువగా అందులోనే లభిస్తాయని శాస్త్రవేత్తలూ చెబుతున్నాయి, పరిశోధనల్లోనూ రుజువైంది. ఇలా అత్యధిక పోషకాలను అందించే ముడి పదార్థాల్లో గోధుమ గడ్డి ఒకటి. అనేక అనారోగ్యాలను నివారించే శక్తి దీనికి ఉంది. గోధుమ మొలకలను పోషకాల మూటగా చెబుతారు ఆహార నిపుణులు. ఎర్ర రక్త కణాలను అభివృద్ధి చేసే బి 12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ ఇందులో ఎక్కువగా ఉంటాయి, రక్తలేమి వ్యాధితో బాధపడేవారికి ఇది దివ్య ఔషధమని వివరిస్తున్నారు. యాంటీ ఆక్సిడెంట్స్, ఫైటో న్యూట్రియన్స్, బీటా కెరోటిన్, బయో ఫ్లావనాయిడ్స్ ఎక్కువగా ఉండే గోధుమ గడ్డి,రసం రోగనిరోధక శక్తిని పెంచి కేన్సర్ కణాలను నశింపచేస్తుంది, కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె జబ్బులను నియంత్రిస్తుంది. మరిలాంటి గోధుమ మొలకలతో జ్యూస్ తయారుచేసుకుంటే ఎన్ని పోషకాలు అందుతాయో అంచనా వేయడం కష్టమే. అలాగని ఎక్కువ మోతాదులో ఈ జ్యూస్‌ని తీసుకోవద్దు. వారానికి ఒక్కసారి 30 ఎంఎల్ మాత్రమే తీసుకోవాలి. గోధుమ గడ్డి రసాన్ని నిల్వ కూడా చేయకూడదు. గ్లాసులోకి తీసుకున్న వెంటనే తాగాలి. ఇంట్లో పెంచిన గోధుమ గడ్డితో జ్యూస్ తయారుచేసుకోవడం ఉత్తమం. వీలైనంతవరకు గోధుమ గడ్డిని నీలోనే పెంచాలి. విత్తనాలు చల్లిన తర్వాత 10 రోజులకు 6, 7 అంగుళాల మేర గోధుమ గడ్డి పెరుగుతుంది. దీనిని వేర్లతో సహా



తియ్యాలి. వేర్లు వేరుచేసి గడ్డిని మాత్రం కొద్దిగా నీళ్ళు కలిపి మిక్సీ చేసుకోవాలి. అదే గోధుమ మొలకల జ్యూస్. దీనిని గ్లాసులోకి తీసుకున్న వెంటనే తాగాలి. విటమిన్ ఏ, బి, సీ, ఈ, కె, కాల్షియం, మెగ్నీసియం వంటి ఎన్నో సూక్ష్మపోషకాలు దీని నుంచి శరీరానికి అందుతాయి.

నేను - సుడిగుండం (నవల) 17

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

"తొందర్లో మనం కలుసుకుంటాం అనుకుంటున్నాను." అని బస్ ఎక్కింది. అది కదిలి ముందుకు వెళ్తుంటే నాకు ఎందుకో దిగులుగా అనిపించింది.

నేనూ, వెన్నెలా ఇంటికి వస్తున్నాం. "ఆ కవర్‌లో ఏముంది బావా?"

"ఉత్తరం అని చెప్పిందిగా"

"ఎదురుగా వున్నప్పుడు ఉత్తరాలు ఎందుకు?"

"ఎదురుగా చెప్పలేని విషయాలు ఉత్తరాల్లో రాస్తారు"

"అది నేను చదవొచ్చా?"

"ఇతరుల ఉత్తరాలు చదవకూడదు" అన్నాను.

అప్పుడు చిన్నబుచ్చుకుంది.

"నువ్వు ఇతరుడివా" అంది మెల్లగా

కవర్ వెన్నెలకి యిచ్చి చదువు అన్నాను.

ఏమనుకుందో వద్దులే బావా అని యిచ్చేసింది.

"ఇంత దూరం ఒక్కతే వచ్చింది. ఇంట్లో వాళ్లకి చెప్పిందా?"

"చెప్పకుండా ఎలా వుంటుంది?"

"అయినా పంపించారా?"

"పంపిస్తారు. అయినా ఆడపిల్లలు ఇదివరకటిలా ఇంట్లో కూర్చుంటానంటే కుదరదు. వాళ్లు ఉద్యోగాలు చేయాలి. విమానాలు నడపాలి. మగవాళ్లు చేసే అన్ని పనులూ చేయాలి. అమిత సైకాలజీలో డిగ్రీ తీసుకుంది."

"అంటే ఏంటి బావా?"

"మనుషులందరూ ఎలా ఆలోచిస్తారు అని తెలుసుకోవటం"

"నా గురించి ఆ అమ్మాయికి తెలిసిపోతుందా?" అంది ఆశ్చర్యంగా

"ఎందుకు తెలవదు. అయినా ఓసారి చూడగానే ఎవరూ ఎవరికి అర్థం కారు. వారితో మాట్లాడాలి. చిన్నప్పటి నుంచి వారి అలవాట్లు ఎలా వున్నాయి. అమ్మా నాన్నలూ, చెల్లీ వీరందరితో ఎలా వుంటారు ఇలాంటివన్నీ తెలుసుకోవాలి"

వెన్నెల మాట్లాడకుండా నడుస్తోంది.

అకస్మాత్తుగా అడిగింది.

"ఆ అమ్మాయంటే నీకు ఇష్టమా!"

"ఇష్టమే" అన్నాను.

అప్పుడు వెన్నెల ముఖంలో కనిపించిన భావాన్ని నేను ఎప్పుడూ మరిచిపోలేను.

"అమితా నేను కలిసి చదువుకున్నాం. అందరూ అందరితో స్నేహం చేయలేరు. మనసుకి దగ్గరగా వచ్చిన వారితోనే చేస్తారు"

"మనసుకి దగ్గరగా రావటం అంటే...?"

"అభిప్రాయాలు కలవాలి. అన్నీ కాకపోవచ్చు. కనీసం కొన్నయినా కలవాలి. ఇవన్నీ ముందు ముందు నీకు అర్థం అవుతాయి. క్లాసు పుస్తకాలు మనకు కొంత నేర్పిస్తాయి. అందరూ చదువుకోలేరు. కాని బతుకుతో వారికుండే అనుభవాలు కూడా చదువు లాంటివే" అన్నాను.

"ఇంతకూ ఆ అమ్మాయి ఎందుకు వచ్చింది?"

"నాకు ఉద్యోగం చూసింది"

"విశాఖపట్టణంలోనా?"

"కాదు. హైదరాబాద్ లో"

"బాగుంటుందా???

"నేనింకా చూడలేదు. విశాఖ కంటే హైదరాబాద్ పెద్దది. అక్కడ చార్మినార్ వుంది. అసెంబ్లీ ఉంది. 'జూ' వుంది. సాలార్ జంగ్ మ్యూజియమ్, ఇంకా చూడాల్సినవి చాలా వున్నాయి"

"చూడకుండా ఇవన్నీ ఎలా చెబుతున్నావు?"

"ఇవన్నీ పుస్తకాల్లో వుంటాయి. పత్రికల్లో వుంటాయి. నేను రెండు రోజుల్లో వెళ్లిపోవాలి వెన్నెలా"

"అప్పుడే వెళ్లిపోతావా?" అంది దిగులుగా.

"లేకపోతే ఆ ఉద్యోగం ఇంకొకరికి యిచ్చేస్తారు" అన్నాను.

తాను మాట్లాడకుండా నడుస్తోంది. కనుకొలకుల్లో నీరు కదలటం చూసాను.

అమిత ఇక్కడికి రావటం సంచలనమే. అత్తయ్య, మావయ్య ఏమనుకుంటున్నారో తెలియదు. వెన్నెల ఇంకా చిన్న పిల్ల కాదు. తను రకరకాలుగా ఆలోచిస్తోంది. ఇంటి దగ్గరకు వెళ్లగానే అమ్మ మాట్లాడుతుందని తెలుసు.

వెన్నెల ఆగిపోయింది. "ఏమైందీ?" అన్నాను.

"ఇంటికి వెళ్తాను"

"మన ఇంటికిరా... గంట తర్వాత వెళ్లవచ్చు"

"అమ్మ ముందే వద్దు అంది. ఆలస్యం అయితే తిడుతుంది" అంది. మరో మాట కేసి చూడకుండా వెళ్లిపోయింది.

****

ఇంటి దగ్గర అమ్మ పనిలో వుంది.

నేను అమ్మకి చెప్పి పొలాల దగ్గరకు వెళ్లాను. నా జేబులో అమిత యిచ్చిన కవర్ వుంది. వెన్నెల అన్నట్లు అమితకి ఉత్తరం ఎందుకు రాయాలనిపించింది. తను చెప్పాలనుకున్న విషయం నాకే చెప్పవచ్చు.



అయినా అంత ముఖ్యమైన విషయం ఏమిటి? నాలో రకరకాల ఆలోచనలు. అమిత నన్ను ఇష్టపడుతుందా? ప్రేమిస్తోందా? ఉద్యోగం విషయం చిన్నదేనా? ఇంటి దగ్గరే ఉత్తరం చదవాలనుకున్నాను. .

నా ఆలోచనలకు నేను సిగ్గు పడ్డాను. నేను కూడా మామూలు యువకుడిలా ఆలోచిస్తున్నాను. అమితకు నా మీదున్న అభిమానాన్ని అపార్థం చేసుకుంటున్నాను. ఇదీ సరయింది కాదు అనుకున్నాను.

పొలం గట్టు మీద కూర్చుని కవర్ చించాను. అందులో వెయ్యి రూపాయలున్నాయి. కాస్త ఆశ్చర్యం, అప్పుడు ఉత్తరం చదవటం మొదలు పెట్టాను.

రామూ....

నువ్వు నీ వ్యక్తిగత విషయాలను నాతో పంచుకున్నావు. మనందరికీ చాలా కోరికలుంటాయి. ఆశయాలుంటాయి. అవన్నీ మనం అనుకున్న విధంగా మనల్ని నడవనీయవు. నువ్వు వచ్చేముందు నీకు ఉద్యోగం ఎంత అవసరమో చెప్పావు.

అందుకే మా నాన్నని అడిగాను- ఉద్యోగం కావాలని.

"ఎవరమ్మా ఈ రాము" అన్నారు.

"మనకున్న పరిచయం గురించి, మనం మాట్లాడుకునే అంశాల గురించి వివరంగానే చెప్పాను. నేను మాట్లాడుతున్నప్పుడు ఆయన ముఖంలో రకరకాల అనుమానాలు కనిపించాయి.

"నువ్వు ఇంత ప్రత్యేకంగా చెబుతున్నావంటే, అతని మీద నీకు ఓ ఇంట్రెస్ట్ వుంది"

"నాకు అర్థం కాలేదు నాన్నా

"నువ్వు రాముని ప్రేమిస్తున్నావా" అని సూటిగా అడిగారు.

"అతను మంచివాడు. కష్టపడి చదువుకున్నాడు. మా భావాలు దగ్గరగా వుంటాయి. అది ప్రేమ అని నేను అనుకోవటం లేదు. స్నేహం మాత్రమే..."

"ముందు ముందు అది ప్రేమగా మారుతుందా అన్నారు.

"అది చెప్పటానికి నేను ఇప్పుడు సిద్ధంగా లేను"

ఈ వాక్యం దగ్గర ఆగిపోయాను. మరలా రకరకాల ఆలోచనలు నన్ను కుదిపేస్తున్నాయి. బలవంతాన నిగ్రహించుకుని తిరిగి చదవటం మొదలు పెట్టాను.

"అయినా రాముకి మేనకోడలు వుంది. ఇంటి బాధ్యతలు వున్నాయి. మా మధ్య ఎప్పుడూ ఇలాంటి చర్చలు జరగలేదు. నేను ఎవరినన్నా ప్రేమిస్తే ముందు మీకూ, అమ్మకి చెబుతాను. రహస్య ప్రేమలూ, పెళ్లిళ్లూ నాకు ఇష్టం వుండవు" అన్నాను.

"సరే. చూద్దాం" అన్నారు నాన్న

అమ్మా- నాన్న ఏం మాట్లాడుకున్నారో తెలియదు. అమ్మకూ అదే చెప్పాను. ఇప్పుడే పెళ్లి చేసుకోవాలని నేను అనుకోవటం లేదు. నేనింకా చదువుకోవాలి. నీకు వయసు పెరుగుతుంది అంటావు. ఇప్పటి ఆడపిల్లలు ఇరవై సంవత్సరాలకే తల్లులు కావాలనుకోవటం లేదు అని చెప్పాను.

నాన్నకి తెలిసినవారు హైదరాబాద్‌లో వున్నారు. వారికి ఓ మనిషి కావాలి అని చెప్పారు.

నిన్ను విశాఖ పిలిపించమన్నారు. మీకు ఫోన్ లేదు అన్నాను. టెలిగ్రామ్ కూడా వద్దు. నేను వెళ్తానన్నాను. ఏమనుకున్నారో సరే అన్నారు.

దారిలో నాలో రకరకాల ఆలోచనలు వచ్చాయి. ముఖ్యంగా 'ప్రేమ' అనే అంశం మీద. ఇది రెండు రకాలు. ఆశయం మీద ప్రేమ. అదొక్కటే చాలదు. మన ప్రయాణంలో మనలాంటి వారికి తోడు కావాలి. ఒంటరి ప్రయాణాలు అందరూ చేయలేరు. అయినా ప్రేమలాంటి విషయాల మీద తీరిక వున్నవారు ఎక్కువగా ఆలోచిస్తారు. చర్చిస్తారు.

కనీస జీవితం కోసం ఆరాటపడే చోట ఇలాంటి వాటికి తావుండదు. ఫిజికల్‌గా నచ్చినంత మాత్రాన ప్రేమిస్తున్నామనుకోవటం కుదరదు. అది శాశ్వతం కాదు.

ఇదంతా ఎందుకు రాస్తున్నానో అర్థం చేసుకో. 'ప్రేమ' కోసం పుట్టేవారు వేరే వుంటారు. వారి బతుకంతా ప్రేమ చుట్టూ తిరుగుతూ వుంటుంది. అందులో విజయాలూ, అపజయాలూ వుంటాయి. అలాంటి కథలకు సాహిత్యంలో, సినిమాల్లో గిరాకి వుంటుంది.

శరత్‌చంద్రుడూ, ఠాగూర్ ఇలాంటి వారి నేపథ్యం వేరు. వారికి కనీస జీవితమో, గొప్పదో వుంది. వారు పెరిగిన వాతావరణం వేరు. చూసిన సమస్యలు వేరు. చిన్నప్పుడు అందరిలా పెరిగినా వారీ స్పందనలు వేరు. అలా రియాక్టయ్యారు. (ఇంకా ఉంది)

ఎన్‌డీఏకు ఎంపికైతే భవిష్యత్ ఉజ్వలమే...

త్రివిధ దళాల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

సైనిక, నౌకా, వైమానిక దళాల్లో ఎందులోనైనా ఉద్యోగంలో చేరి, గుర్తింపు పొందాలనుకునే వారు ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ పరీక్ష రాసి, అందులో చేరే అవకాశం మరోసారి వచ్చింది. దీనికి సంబంధించి తాజాగా నోటిఫికేషన్ వెలువడింది. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైనవారు యూపీఎస్సీ నిర్వహించే ఈ పరీక్షను రాయవచ్చు. ఇందులో పాసైతే తాము కోరుకున్న దళంలో చేరడానికి శిక్షణ పొందుతూ బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సులు చదివే అవకాశం కూడా ఉంది. అనంతరం సంబంధిత విభాగంలో ప్రత్యేక శిక్షణ పొంది, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుల్లో ఆఫీసర్ హోదాతో ఉద్యోగంలో చేరవచ్చు. ఈ నోటిఫికేషన్ వివరాలు, ఇతర విశేషాలు ఈ విధంగా ఉన్నాయి.

నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)కు ఎంపికవ్వటమంటే.. ఉన్నతమైన భవిష్యత్తుకు బాట వేసుకోవడమే. ఎన్డీఏ ద్వారా ఉచితంగా ప్రామాణిక విద్యను పొందవచ్చు. నేరుగా ఉన్నతస్థాయి ఉద్యోగం అందుకోవచ్చు. సంఘంలో గుర్తింపు లభిస్తుంది. మూలవేతనం రూ.56,100తోపాటు మిలటరీ సర్వీస్ పే రూ.15,500 ప్రతి నెలా చెల్లిస్తారు. దీనికి డీఏ, హెచ్‌ఆర్ఏ అదనం. ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఎయిర్ ఫోర్స్‌కు ఎంపికైనవారు అదనంగా ఫ్లయింగ్ అలవెన్సు రూ.25,000 ప్రతినెలా పొందుతారు. రెండేళ్ల సర్వీసుతోనే పదోన్నతి లభిస్తుంది.13 ఏళ్లు పనిచేస్తే ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో వరుసగా లెఫ్టినెంట్ కల్నల్, కమాండర్, వింగ్ కమాండర్ స్థాయికి చేరుకుంటారు.

రెండు పేపర్లు...

ఎన్‌డీఏ పరీక్ష ప్రశ్నపత్రం మొత్తం 900 మార్కులకు ఉంటుంది. ఇందులో రెండు పేపర్లుంటాయి.

➠ పేపర్-1లో మ్యాథ్స్ నుంచి 300 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు.

➠ పేపర్-2లో 600 మార్కులకు జనరల్ ఎబిలిటీ విభాగం నుంచి ప్రశ్నలుంటాయి. వ్యవధి రెండున్నర గంటలు. ఇందులో ఇంగ్లిష్‌కు 200, జనరల్ నాలెడ్జికి 400 మార్కులు కేటాయించారు. జనరల్ నాలెడ్జ్ విభాగంలో ఫిజిక్స్ నుంచి 100, కెమిస్ట్రీ నుంచి 60, జనరల్ సైన్స్ నుంచి 40, చరిత్ర, స్వాతంత్ర్యోద్యమాలు తదితరాల నుంచి 80, భూగోళశాస్త్రం నుంచి 80, వర్తమానాంశాల నుంచి 40 మార్కులకు ప్రశ్నలడుగుతారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. రుణాత్మక మార్కులున్నాయి. వర్తమాన వ్యవహారాలు తప్ప మిగతా ప్రశ్నలు ఆయా సబ్జెక్టుల్లో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచే వస్తాయి. రాత పరీక్షలో అర్హత పొందిన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టులు నిర్వహిస్తారు. ఈ విభాగానికి 900 మార్కులు కేటాయించారు. ఇందులో భాగంగా తొలిరోజు ఆఫీసర్స్ ఇంటిలిజెన్స్ ర్యాటింగ్ (ఓఐఆర్), పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్టు (పీపీ అండ్ డీటీ) నిర్వహిస్తారు. ఇందులో అర్హులకు మిగిలిన 4 రోజులు ఇంటర్వ్యూ, గ్రూప్ టెస్టింగ్, ఆఫీసర్ టాస్కులు, సైకాలజీ టెస్టులు ఉంటాయి.

రాత పరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. వైద్య పరీక్షలు, అభ్యర్థి ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిభ ఆధారంగా సంబంధిత విభాగాలకు ఎంపిక చేస్తారు.

సన్నద్ధత ఇలా...

➠ సీబీఎస్ఈ 11, 12 తరగతుల పుస్తకాలను క్షుణ్ణంగా చదవాలి. వీటితోపాటు 8,9,10 తరగతుల పుస్తకాలనూ చదవడం మంచిది.



➠ ప్రాథమికాంశాలతో అధ్యయనం ప్రారంభించాలి. వీటిపై పట్టు ఉంటే ప్రశ్న ఏ విధంగా అడిగినప్పటికీ జవాబు గుర్తించడం సాధ్యమవుతుంది.

➠ పాత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. ఆయా సబ్జెక్టులు, అందులోని చాప్టర్లకు ఉన్న ప్రాధాన్యం, ప్రశ్నలతీరుపై అవగాహనకు పాత ప్రశ్నపత్రాలు ఉపకరిస్తాయి.

➠ పరీక్షకు పది రోజుల ముందు రోజుకొకటి చొప్పున మాక్ పరీక్షలు రాయాలి. దీనిద్వారా సమయపాలన అలవడుతుంది. ఏయే విభాగాల్లో వెనుకబడ్డారో తెలుసుకోవడం ద్వారా తుది సన్నద్ధతకు మెరుగులద్దుకోవడానికి వీలవుతుంది.

➠ రుణాత్మక మార్కులున్నందున తెలియని ప్రశ్నలను వదిలేయడమే మంచిది.

సబ్జెక్టుల వారీగా.....

➠ మ్యాథ్స్ ప్రశ్నలకు ఎక్కువ సమయం అవసరం. పరీక్షకు ముందు బాగా సాధన చేస్తే తక్కువ వ్యవధిలో వీటిని ముగించడానికి అవకాశం ఉంటుంది. అయితే కొన్ని ప్రశ్నలకు సమాధానం గుర్తించే విధానం తెలిసినప్పటికీ అందుకు ఎక్కువ సమయం అనివార్యం కావచ్చు. ఆఖరులో సమయం ఉంటేనే వీటి సంగతి చూడాలి. గణితంలోని ప్రాథమికాంశాలు, సూత్రాలు, అనువర్తనంపై దృష్టి సారించాలి. ఈ పేపర్లో మ్యాట్రిసెస్ అండ్ డిటెర్మినేంట్స్ నుంచి 30, ట్రిగనోమెట్రీ 30, కాల్క్యులస్ 20, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ 20, ప్రాబబిలిటీ 10, కాంప్లెక్స్ నంబర్స్ 10 వరకు ప్రశ్నలు వస్తున్నాయి. పాత ప్రశ్నపత్రాలను పరిశీలించి ఆయా చాప్టర్ల నుంచి వస్తోన్న ప్రశ్నల ప్రకారం సన్నద్ధతలో ప్రాధాన్యం ఇచ్చుకోవాలి.

➠ ఫిజిక్స్‌లో ప్రశ్నలు సాధించడానికి భావనలపై మంచి పట్టుండాలి. ఆయా సూత్రాల అనువర్తనంపై అవగాహన తప్పనిసరి.

➠ రసాయనశాస్త్రంలో మూలకాల వర్గీకరణ, సమ్మేళనాలు, మిశ్రమాలపై దృష్టి సారించాలి.

➠ ఆంగ్ల వ్యాకరణం, పదసంపద కొన్ని రోజుల్లోనే నేర్చుకోవడం సాధ్యం కాదు. ప్రతిరోజూ వాటికోసం కొంత సమయం వెచ్చించాలి. కొత్త పదాలను తెలుసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంగ్లిష్ విభాగంలో సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, సెలక్టింగ్ వర్డ్స్‌లో పదేసి చొప్పున ప్రశ్నలు రావచ్చు. అలాగే వాక్యంలోని పదాలు ఒక క్రమంలో అమర్చమనే ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయి. అర్థాలు, వ్యతిరేకపదాలు, తప్పుని గుర్తించడం, కాంప్రహెన్షన్ పైనా ద ృష్టి సారించాలి.

➠ కరెంట్ అఫైర్స్ విభాగంలో పరీక్ష తేదీ నుంచి 9 నెలల వెనుక వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కీలక పరిణామాలపై ప్రశ్నలు రావచ్చు. దినపత్రికలు చదువుతున్నప్పుడే ముఖ్యాంశాలను నోట్సుగా రాసుకోవాలి. టాటా మెక్ గ్రాహిల్స్, అరిహంత్ పుస్తకాలను పరిశీలించవచ్చు. లూసెంట్స్ జనరల్ నాలెడ్జ్ జీకే ప్రశ్నలకు ఉపయోగపడుతుంది.

మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలకు పాఠ్యపుస్తకాలు సరిపోతాయి. ఎంసెట్, జేఈఈ పాత ప్రశ్నపత్రాలు ఉపయోగపడతాయి. చరిత్ర, భూగోళశాస్త్రం, జనరల్ సైన్స్ విభాగాల్లోని ప్రశ్నలకు ఆయా సబ్జెక్టుల్లో ఎన్‌సీఈఆర్‌టీ 8,9,10 తరగతులతో పాటు ప్లస్ 1, 2 పుస్తకాలు ఎంతో ప్రయోజనం. ఇంటర్వ్యూలో ఒక అధికారికి ఉండాల్సిన లక్షణాలు అభ్యర్థిలో ఏ మేరకు ఉన్నాయో గమనిస్తారు. ఆత్మ విశ్వాసంతో జవాబులు చెప్పాలి. మనదేశ రక్షణరంగంపై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం...

మొత్తం ఖాళీలు : 392. వీటిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో 342 (ఆర్మీ 208, నేవీ 42, ఎయిర్ ఫోర్స్ 92), నేవల్ అకాడమీ (10+2 క్యాడెట్ స్కీం)లో 50 ఉన్నాయి.



అర్హత : ఆర్మీ వింగ్ పోస్టులకు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్‌ఫోర్స్, నేవల్ వింగ్స్ (ఎన్డీఏ), 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (ఇండియన్ నేవల్ అకాడమీ)కు దరఖాస్తు చేయాలనుకుంటే ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నవారూ అర్హులే..

వయసు : జులై 2, 2000 - జులై 1, 2003 మధ్య జన్మించిన పురుష అభ్యర్థులు అర్హులు.

శారీరక ప్రమాణాలు : కనీస ఎత్తు 157 సెం.మీ., ఎయిర్‌ఫోర్సుకు 162.5 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగిన బరువు అవసరం.

దరఖాస్తులకు చివరి తేదీ : ఫిబ్రవరి 4 (సాయంత్రం 6 వరకు)

పరీక్ష తేదీ : ఏప్రిల్ 21

ఏపీ, తెలంగాణల్లో పరీక్ష కేంద్రాలు : హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి

వెబ్‌సైట్ : www.upsc.gov.in

శిక్షణ విధానం

తుది అర్హత సాధించినవారు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, పుణెలో చదువు, శిక్షణ పొందుతారు. అనంతరం ఆర్మీ క్యాడెట్లను డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీకి; నేవల్ క్యాడెట్లను ఎజిమాలలోని ఇండియన్ నేవల్ అకాడమీకి; ఎయిర్ ఫోర్స్ క్యాడెట్లను హైదరాబాద్‌లోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీకి సంబంధిత ట్రేడ్ శిక్షణ కోసం పంపుతారు. అభ్యర్థి ఎంపికైన విభాగాన్ని బట్టి ఈ శిక్షణ ఏడాది నుంచి 18 నెలల వరకు ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెలా రూ.56,100 స్టయిపెండ్ చెల్లిస్తారు. శిక్షణ అనంతరం ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఆర్మీలో లెఫ్టినెంట్, నేవీలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్ ఫోర్స్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్ (పైలట్) హోదాతో కెరీర్ ప్రారంభిస్తారు. ఈ మూడూ సమాన స్థాయి ఉద్యోగాలు.

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాలు

భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్టాటిస్టిక్స్, ఇంజినీరింగ్, న్యాయవిద్యల్లో తదితరాల్లో పట్టాలు పొందిన అనుభవజ్ఞులైన అభ్యర్థులకు రూ. 15 లక్షల నుంచి రూ. 52 లక్షల వరకు వార్షిక వేతనాన్ని ఇవ్వనుంది. ఇంటర్వ్యూలో పొందిన మార్కుల ఆధారంగా ఎంపికలు జరుగుతాయి.



ఎస్‌బీఐ ప్రకటించిన 31 స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. అర్హతలూ, ఆసక్తి ఉన్న అభ్యర్థులు జనవరి 31వ తేదీలోపు దరఖాస్తులను పంపుకో వాల్సి వుంటుంది.

స్పెషలిస్ట్ క్యాడర్ పోస్టులకు ఎంపికైతే ఆకర్షణీయమైన వార్షిక వేతనం లభిస్తుంది.

➠ హెడ్ (లీగల్) ఉద్యోగానికి రూ.47 లక్షల నుంచి 52 లక్షలు

➠ డీజీఎం పోస్టుకు రూ. 35 లక్షల నుంచి రూ.47 లక్షలు

➠ మేనేజర్ పోస్టుకు రూ. 18 లక్షలు

➠ స్టాటిస్టిషియన్ పోస్టుకు రూ. 15 లక్షలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తిచేయటంతోపాటు సంబంధిత డాక్యుమెంట్ల కాపీలను ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది.

పోస్టుల వివరాలు

డిప్యూటీ మేనేజర్ (స్టాటిస్టిషియన్) -2

ప్రాజెక్టు డెవలప్‌మెంట్ మేనేజర్- అగ్రికల్చర్/ ఇంటర్నేషనల్ బ్యాకింగ్/ రీటెయిల్/ కార్పొరేట్ బ్యాంకింగ్- 3

మేనేజర్ (సర్వీసింగ్- డిజిటల్)- 3

మేనేజర్ (బిజినెస్ అనలిస్ట్/కస్టమర్ సర్వీస్ అనలిస్ట్) - 3

మేనేజర్ (ఆన్‌లైన్ ఫుల్‌ఫిల్‌మెంట్/ఇంటిగ్రేషన్ అండ్ జర్నీ/సూపర్‌స్టోర్ ఫుల్‌ఫిల్‌మెంట్)- 3

మేనేజర్ (డిజిటల్ మార్కెటింగ్- 4

హెడ్ (లీగల్)- 1, డీజీఎం (ఎన్‌సీఎల్‌టీ)-1

డీజీఎం (లా)-1, ఎగ్జిక్యూటివ్ (క్రెడిట్ మానిటరింగ్)-10

హెడ్ (ప్రొడక్ట్, ఇన్వెస్టిమెంట్ అండ్ రిసెర్చి) -1

అర్హత : సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, పీజీ, బీఈ, సీఏ, అనుభవం.

ఎంపిక : షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు : జనరల్/ ఓబీసీలకు రూ.600బీ ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.100.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 31.

బీఎస్ఎఫ్‌లో 63 కానిస్టేబుల్ పోస్టులు

భారత హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్).. స్పోర్ట్స్ కోటాలో 63 కానిస్టేబుల్ (జీడీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

క్రీడా విభాగాలు : ఆర్చరీ, ఆక్వాటిక్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఫుట్ బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల్, తదితర క్రీడలు...

అర్హతలు : పదో తరగతి ఉత్తీర్ణత. నిర్దేశించిన శారీరక ప్రమాణాలుండాలి. ప్రకటనలో తెలిపిన క్రీడా ఈవెంట్లలో పాల్గొనడం తప్పనిసరి. పురుషులు మాత్రమే వీటికి అర్హులు.

వయసు : 18-23 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక : ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, సంబంధిత క్రీడల ట్రయల్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ద్వారా.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ : ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (2019, జనవరి 5 నుంచి 11)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్ : http://bsf.nic.in

ఎన్‌పీసీఐఎల్‌లో 162 ఉద్యోగాలు

భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) కాక్రపర్ గుజరాత్ సైట్‌లో ఖాళీగా ఉన్న 162 స్టైపెండరీ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు...

స్టైపెండరీ ట్రైనీ/సైంటిఫిక్ అసిస్టెంట్ (ఇంజనీరింగ్ డిప్లొమా అభ్యర్థులు) : 51

విభాగాల వారీ ఖాళీలు : మెకానికల్-26, ఎలక్ట్రికల్-17, ఎలక్ట్రానిక్స్-5, కెమికల్-3.

స్టైపెండరీ ట్రైనీ/సైంటిఫిక్ అసిస్టెంట్ (సైన్స్ గ్రాడ్యుయేట్లు) : 6

విభాగం : కెమిస్ట్రీ



సైంటిఫిక్ అసిస్టెంట్/బి (సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా అభ్యర్థులు) : 7

స్టైపెండరీ ట్రైనీ/టెక్నీషియన్- ప్లాంట్ ఆపరేటర్ : 51

స్టైపెండరీ ట్రైనీ/టెక్నీషియన్-మెయింటెయినర్ : 47

విభాగాల వారీ ఖాళీలు : ఫిట్టర్-17, ఎలక్ట్రీషియన్-6, ఎలక్ట్రానిక్స్ మెకానిక్-10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-7, వెల్డర్-3, మెషినిస్ట్-3, డీజిల్ మెకానిక్-1.

అర్హత : పోస్టును బట్టి సైన్స్ సబ్జెక్టులతో పదో తరగతి, 10+2/ఐఎస్సీ, ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణత, పని అనుభవం ఉండాలి.

ఎంపిక : రాత పరీక్ష, ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 31, 2019.

వెబ్‌సైట్ : https://npcilcareers.co.in

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో 13 ఖాళీలు

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 13 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాల వారీ ఖాళీలు : మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్/డీ (డెంటల్ సర్జన్-ప్రోస్థో డాంటిక్స్)-1, మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్/డీ (డెంటల్ సర్జన్-పెరిడాంటాలజీ)-1, మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్/డీ (సైకియాట్రీ)-1, మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్-సీ (జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్)-5, సైంటిఫిక్ అసిస్టెంట్-సీ(మెడికల్ సోషల్ వర్కర్)-1, ఫార్మసిస్ట్ బీ- 2, టెక్నీషియన్/సీ (సీఎస్ఎస్‌డీ-సెంట్రలైజ్డ్ స్టెరిలైజేషన్ సప్లయిపార్ట్‌మెంట్)-1, టెక్నీషియన్/సీ (ఎక్స్-రే/రేడియోగ్రఫీ)-1.

అర్హత : పోస్టును బట్టి హెచ్ఎస్సీ (10+2), సంబంధిత విభాగాల్లో ట్రేడ్ సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ, ఎంబీబీఎస్, ఎండీఎస్, ఎండీ/డీఎన్‌బీ ఉత్తీర్ణత, పని అనుభవం ఉండాలి.

ఎంపిక : రాత పరీక్ష/స్క్రీనింగ్ టెస్ట్/స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు విధానం :** ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 25, 2019.

వెబ్‌సైట్ : https://recruit.barc.gov.in

విశాలాంధ్ర బిజినెస్

2.96 ▲ సెన్సెక్స్ 36,321.29	3.50 ▲ నిఫ్టీ 10,890.30	200 ▲ బంగారం (విజయవాడ) 30,910 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 30,910 ప్రొద్దుటూరు 30,813 22 క్యారెట్లు, 10 గ్రాములు	-100 ▼ వెండి (విజయవాడ) 40,300 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,3 00 ప్రొద్దుటూరు 42,356 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 71.24

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
యస్-బ్యాంక్	208.35	2.64
ఇండియాబుల్స్ హౌసింగ్	829.60	2.57
ఇండస్ఇండ్ బ్యాంక్	1,526.70	2.11
విప్రో	336.55	2.05
బీపీసీఎల్	347.25	1.62

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	286.45	-1.93
భారతీ ఇన్ఫ్రాటెల్	275.85	-1.39
బజాజ్ ఫైనాన్స్	2,569.85	-1.32
వేదాంత	196.30	-1.31
యూపీఎల్	766.10	-1.27

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	70.93	71.24
యూరో	81.13	81.17
పౌండ్	90.99	91.79
ఆస్ట్రేలియా డాలర్	51.03	51.11
సింగపూర్ డాలర్	52.37	52.57

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,930	32,080
చెన్నై	30,930	32,080
బెంగళూరు	30,340	32,449
ముంబై	31,660	33,861
విజయవాడ	-	32,400
విశాఖపట్నం	30,910	32,200
ప్రొద్దుటూరు	30,813	32,313
ముడి చమురు	60.30	

అప్పో పబ్‌జీ మొబైల్ సిరీస్ 2019

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: స్మార్ట్‌ఫోన్ రంగంలో పలు మోడల్స్‌ను ఎప్పటికప్పుడు అందిస్తూ ముందుకు సాగుతున్న అప్పో ఇప్పుడు టెన్సెంట్ గేమ్స్, పబ్‌జీ కార్ప్‌తో కలిసి అప్పో పబ్‌జీ మొబైల్ ఇండియా సిరీస్ 2019ని ప్రకటించింది. ఇందులో భాగంగా పోటీదారులు కోటి రూపాయల వరకూ విలువైన బహుమతులను గెలుచుకోవచ్చని సంస్థ బ్రాండ్ డైరెక్టర్ విల్ యాంగ్ వెల్లడించారు. ఇప్పటికే ఈ చాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు 2,50,000 రిజిస్ట్రేషన్స్ వచ్చాయని, వీటిల్లో అత్యధికులు యువతేనని తెలిపారు.

జంతు సంరక్షణకు కృషి : సదా



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: జంతువుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వాటి ఉనికిని కాపాడుకోవాలని ప్రముఖ నటి సదా తెలిపారు. నేడిక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా జంతు సంక్షేమం కోసం కృషిచేస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యానిమల్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఐఏపీఓ)కు మద్ధతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. జంతువుల సంరక్షణ ఉద్యమాలు కుక్కలు, పిల్లుల కోసం కాదని, మన ఆహారం, జీవనశైలి కారణంగా రోజువారి ప్రాతిపదికన క్రూరత్వానికి గురువుతున్న అన్ని జంతు వుల కోసం పోరాడాల్సి ఉందన్నారు. జంతుసంరక్షను ఇష్టపడే వారు ఎఫ్ఐఏపీఓ చేపట్టిన 21 రోజుల కంపాసియన్ ఛాలెంజ్ స్వీకరించాలన్నారు. ఇటీవల ఆడ పులి అవనిని హతమార్చేందుకు జారీ చేసిన ఉత్తర్వులపై సదా పోరాడిన విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు ఆమె సంపూర్ణ శాకాహారానికి ప్రాచుర్యం కల్పించేందుకు రంగంలో దిగారు.

పీఎస్‌బీల్లో ప్రభుత్వ వాటాకు ఎసరు!

- 52 శాతానికి తగ్గించాలని సర్కారు సూచన
- ఇక ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంక్‌లను (పీఎస్‌బీ) నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టుగా కనిపిస్తోంది. దేశ వ్యాప్తం గా ఎంతటి వ్యతిరేకత ఎదురైనప్పటికీ బ్యాంకుల విలీనన్ని వేగంగా ముందుకు తీసుకుపోతున్న సర్కారు.. తాజాగా ఈ దిశగా మరో ఎత్తుగడ వేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉన్న సర్కారు వాటాను క్రమంగా తగ్గించాలని కేంద్రం బ్యాంకులకు సూచించింది. మేటి కార్పొరేట్ విధానాలను అమలు చేసే క్రమంలో భాగంగానే ప్రభుత్వపు ఈక్విటీని 52 శాతానికి తగ్గించుకోవాలని కోరింది. పీఎస్‌బీలో ప్రభుత్వం ప్రధాన వాటాదారుగా ఉండాలని తాము కోరుకుంటున్నామని.. అయితే కార్పొరేట్ విధానాలు చెబుతున్నట్టుగా ఆయా సంస్థలో సర్కారు వాటా తొలిదశలో 52 శాతానికి తగ్గించుకోవాలని తాము బ్యాంకులకు సూచించినట్టుగా ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి బ్యాంకులకు పూర్తి అనుమతులను, అధికారాలను జారీ చేసినట్టుగా ఆయన వివరించారు. మార్కెట్లో పరిస్థితులు ఎప్పుడు అనువుగా ఉంటే అప్పుడు.. ఈ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని తాము పీఎస్బీలకు సూచించినట్టుగా ఆయన తెలిపారు. దీంతో చాలా బ్యాంకుల్లో ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనంలో ఉన్న వాటా.. క్రమంగా మార్కెట్ల ద్వారా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోనుంది. ప్రభుత్వ వాటా విక్రయం వల్ల మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సూచిస్తున్నట్టుగా పీఎస్‌బీల్లో దాదాపు 25% వాటా మార్కెట్ శక్తుల ఆధీనంలోకి రానుందని రాజీవ్ కుమార్ తెలిపారు. గణాంకాల ప్రకారం కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులలో సర్కారు దాదాపు 75 శాతం వాటాను కలిగి ఉంది. ప్రభుత్వ వాటాను తగ్గించుకోవడం వల్ల బ్యాంకులు ప్రూడెన్షియల్ లెండింగ్ నిబంధనల మేరకు విరివిగా రుణాల వితరణ జరిపేందుకు వీలు పడుతుందని ప్రభుత్వం కొత్త ఈక్వేషన్ చెబుతోంది. బ్యాంకుల్లో వాటా తగ్గించుకోవడం వల్ల ప్రభుత్వానికి బ్యాంకింగ్ రంగం నుంచి రావాల్సిన డివిడెండ్ ఆదాయం గణనీయంగా తగ్గిపోయి అభివృద్ధి పథకాలకు విఘాతం కలిగే ప్రమాదం కనిపిస్తోంది.

ఎస్‌బీఐ తొలి అడుగు..

ప్రభుత్వ అదేశాల మేరకు దేశంలో అతిపెద్ద బ్యాంకింగ్ సంస్థ భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ఇప్పటికే ఈ దిశగా కార్యాచరణను మొదలు పెట్టింది. అర్హత కలిగిన సంస్థాగత ప్లేస్‌మెంట్ (క్విప్) ద్వారా దాదాపు రూ.20000 కోట్ల విలువైన షేర్లను విక్రయించేందుకు గాను ఎస్‌బీఐ చర్యలను ప్రారంభించింది. దీంతో ఎస్‌బీఐలో ప్రభుత్వపు వాటా 58.53 శాతానికి దిగిరానుంది. క్విప్ ద్వారా నిధులను సమీకరించి వ్యాపారాభివృద్ధిని చేపట్టేందుకు గాను గత నెలలో వాటాదారులు ఎస్‌బీఐ ప్రతిపాదనకు పచ్చజెండా ఊపారు. మిగతా బ్యాంకులు కూడా మార్కెట్‌లోని పరిస్థితుల మేరకు వివిధ మార్గాల ద్వారా ప్రభుత్వ వాటాను విక్రయించేందుకు గాను ఇప్పటికే సన్నద్ధమవతున్నట్టుగా సమాచారం. దీనికి కొనసాగింపుగా సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ తదితర బ్యాంకులు ఎంప్లాయిస్ షేర్ పర్చేజ్ స్కీమ్‌ను (ఈఎస్‌పీఎస్) బాటను ఎంచుకున్నాయి.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం...!

ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంకుల విలీనంతో పాటు మోడీ సర్కారు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను (ఆర్ఆర్‌బీ) కూడా విలీనం చేసే ప్రక్రియను మొదలు పెట్టినట్టు ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. గ్రామీణ భారతావనికి మెరుగైన సేవలను అందించే ఉద్దేశంతోనే తాము ఈ ప్రక్రియలో దూకుడుగా ముందుకు సాగుతున్నట్టుగా రాజీవ్ కుమార్ తెలిపారు. తాజాగా మోడీ ప్రభుత్వం పంజాబ్ గ్రామీణ్ బ్యాంక్, మాల్వా గ్రామీణ్ బ్యాంక్, సట్లేజ్ గ్రామీణ్ బ్యాంక్‌ల విలీనం చేసింది. జనవరి నుంచి విలీనం చేసిన బ్యాంక్ సేవలను మొదలు పెట్టినట్టుగా ఆయన తెలిపారు. గ్రామీణ బ్యాంకుల స్పాన్సర్డ్ బ్యాంక్‌లతో చర్చలు జరిపిన తరువాతే ఆయా బ్యాంకులు అందిస్తున్న ప్రాంతాలు వాటి ఆసక్తి మేరకే ఈ విలీనం ప్రక్రియను చేపట్టి నట్టుగా ఆయన వివరించారు. వీటితో పాటు కొన్నిచోట్ల పం జాబ్ గ్రామీణ్ బ్యాంక్ (పీఎన్‌బీ), ఉత్తర్ బీహార్ బ్యాంక్ (యూకో బ్యాంక్) రెంటిని మధ్య బిహార్ గ్రామీణ్ బ్యాంక్‌లో (పీఎన్‌బీ) విలీనం జరిపినట్టుగా ఆయన తెలిపారు. ప్రాం తీయ గ్రామీణ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వ 50 శాతం వాటా ను, ప్రయోజిత బ్యాంకులు 35 శాతం వాటాను, 15 శాతం వాటాను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కలిగి ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల వారికి సేవలందించేందుకు పని చేస్తున్న ఆర్ ఆర్‌బీల విలీనం కారణంగా.. చాలా ప్రాంతాల్లో బ్యాంకు శాఖలు మూతపడి.. బ్యాంకింగ్ సేవలకు విఘా తం కలిగే ప్రమాదం ఉంది. ఈ ప్రక్రియను సర్కారు మరింత ముందుకు తీసుకుపోతే పేద గ్రామీణ ప్రజలకు విరివిగా రుణాలు లభించడం కూడా భారంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

బ్రెగ్జిట్ బిల్లుకు...పార్లమెంట్ నో..!

- ప్రతిపక్షం అవిస్వాస తీర్మానం
- థెరెసా భవితవ్యం ప్రశ్నార్థకం
- బ్రిటన్‌లో ఎన్నికలు అనివార్యం?



లండన్ : యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలిగేందుకు బ్రిటన్ ప్రధాని థెరెసా మే ప్రవేశ పెట్టిన బ్రెగ్జిట్ బిల్లును బ్రిటన్ పార్లమెంట్ తిరస్కరించింది. బ్రిటన్ ప్రధానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. బ్రెగ్జిట్ బిల్లుపై బుధవారం జరిగిన ఓటింగ్‌లో వ్యతిరేకంగా 432 మంది ఎంపీలు ఓటేయగా, అనుకూలంగా 202 మంది ఎంపీలు ఓటేశారు. దీంతో 230 ఓట్ల తేడాతో బ్రెగ్జిట్ బిల్లు వీగిపోయింది. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా భారత సంతతికి చెందిన ఏడుగురు ఎంపీలూ ఓటేశారు. బ్రెగ్జిట్‌పై థెరెసా మే అభ్యర్థనను ఎంపీలెవరూ పట్టించుకోలేదు. బిల్లు వీగిపో వడంతో ప్రతిపక్ష లేబర్ పార్టీ థెరెసా ప్రభుత్వంపై అవిస్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. ఒకవేళ తీర్మానం ఆమోదం పొందితే ప్రభుత్వం రాజీనామా చేయాల్సిందే. దీంతో బ్రిటన్‌లో ఎన్నికలు అనివార్యం కానున్నాయి. ఇటీవలి కాలంలో యూకే ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇంత ఘోర పరాజయాన్ని ఎదుర్కోవడం ఇదే తొలిసారి. హౌస్ ఆఫ్ కామన్స్ (దిగువసభ)లో 8 రోజుల పాటు బిల్లుపై సుదీర్ఘ చర్చ జరిగింది. 200 మంది ఎంపీలు ప్రసంగించారు. 1924 తర్వాత ఓటింగ్‌లో భారీ సంఖ్యలో సభ్యులు వ్యతిరేకంగా ఓటువేయడం ఇదే తొలిసారి. బ్రెగ్జిట్ ఒప్పందం లోపభూయిష్టంగా ఉందంటూ అధికార కన్జర్వేటివ్ పార్టీ ఎంపీలు కొంతమంది ఆమెకు వ్యతిరేకంగా ఓటు వేశారు. 230 ఓట్ల ఆధిక్యంతో ఒప్పందాన్ని ఎంపీలు తిరస్కరించారు. బ్రెగ్జిట్ కోసం యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో బ్రిటన్ కుదుర్చుకున్న ఒప్పం దాన్ని ఈయూ నేతలు ఇదివరకే ఆమోదించిన విషయం తెలిసిందే. అయితే బిల్లుపై బ్రెగ్జిట్‌కు బ్రిటన్ పార్లమెంట్ ఆమోదం లభించడం అంత సులభమైన విషయం కాదు. ప్రధాని థెరెసా మే కుదుర్చుకున్న ఒప్పందం బ్రిటన్‌కు నష్టం చేకూర్చేలా ఉందంటూ ఆమె మంత్రివర్గంలోని నాయకులే రాజీనామా చేసి వెళ్లిపోవడం, సొంత పార్టీ ఎంపీలే మేపై అవిశ్వాస నోటీసులు ఇవ్వడం తెలిసిందే. ఇది బ్రిటన్‌కు ఎంతో మేలు చేసే ఒప్పందమేననీ, ఇంతకన్నా మంచి ఒప్పందాన్ని ఎవరూ కుదర్చలేరనీ ఆమె వాదిస్తున్నప్పటికీ చాలా మంది ఆమెను వ్యతిరేకించారు. పార్లమెంట్‌లో బిల్లు వీగిపోవడంతో రానున్న కాలంలో ఆసక్తికర పరిణామాలు తప్పవు. పార్లమెంట్ ఆమోదం లేకుండా బయటకు రావొచ్చు లేదా, కొత్త ఒప్పందం కోసం మరోసారి చర్చలు జరపవచ్చు. మే ప్రభుత్వం పడిపోయి ఎన్నికలు జరగొచ్చని ప్రతిపక్ష లేబర్‌పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

ప్రపంచబ్యాంకు రేసులో ఇంద్రానూయి...!



వాషింగ్టన్: ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవి రేసులో భారత సంతతికి చెందిన పెప్సీకో మాజీ సీఈవో ఇంద్రా నూయి తెరపైకి వచ్చారు. అగ్రరాజ్యం అమెరికా ప్రతిపాదనతో ఆమె ఆ పదవిని చేపట్టే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ప్రపంచ బ్యాంక్ అధ్యక్షురాలిగా ఇంద్రా నూయిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ నామినేట్ చేసినట్టు 'న్యూయార్క్ టైమ్స్' వెల్లడించింది. ప్రపంచ బ్యాంక్ ప్రస్తుత అధ్యక్షుడు జిమ్ యాంగ్ కిమ్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 1న ఆయన పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ఇటీవల ప్రకటించారు. దీంతో అధ్యక్ష పదవికి ఎన్నిక అనివార్యమైంది. ప్రపంచ బ్యాంక్‌లో అతిపెద్ద భాగస్వామి కావటంతో అమెరికా సూచించిన వ్యక్తికే పదవి దక్కే అవకాశం ఉంది. అధ్యక్షుడిని ప్రతిపాదించే వ్యక్తుల్లో ఇవాంక ట్రంప్ కీలక వ్యక్తి కావడంతో ఆమె విజ్ఞప్తిని సభ్య దేశాలు ఆమోదించే అవకాశం ఉంది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంత మహిళల్లో ఇంద్రా నూయికి ప్రత్యేక స్థానం ఉందంటూ ట్రంప్, ఇవాంకా అనేక సార్లు ప్రశంసించిన విషయం తెలిసిందే. ప్రపంచ బ్యాంక్ అధ్యక్ష పదవికి మొదట ఇవాంక, నిక్కి హేలి పేర్లు కూడా వినిపించిన విషయం తెలిసిందే.



ఖాళీ కొబ్బరి చిప్ప రూ.3వేలే..!

- 55 శాతం డిస్కౌంట్
- అమెజాన్ మరో విచిత్రం

ముంబై: ఆన్‌లైన్ వర్తక దిగ్గజం... అమెజాన్ మరోసారి సంచలనం సృష్టించింది. విస్తృత ప్రచారం కోసం... పిడకలు, గొబ్బెమ్మలు, రెడీమేడ్ పిడకల్ని అమ్మకానికి సిద్ధపడిన అమెజాన్ తాజాగా ఖాళీ కొబ్బరి చిప్ప బౌల్‌ను లిస్ట్‌లో పెట్టింది. నాచురల్ కోకోనట్ షెల్ బౌల్ ధర రూ.1289 నుంచి ప్రారంభం.. డిమాందును బట్టి రూ.2499 వరకూ పెరిగే అవకాశం ఉందంటూ ప్రకటించింది. ప్రస్తుతం 55శాతం స్పెషల్ డిస్కౌంట్ తో రూ.1365లకు (కొబ్బరిచిప్ప ధర రూ.3 వేల) అందిస్తోందట. దీని సైజు కూడా ఒకటిన్నర అంగుళాల ఎత్తు, నాలుగున్నర అంగుళాల వెడల్పు మాత్రమే. ఓ వంద మిల్లీ లీటర్ల నీళ్ల పట్టేంత ఖాళీ మాత్రమే ఉంటుంది. ఇటీవలి కాలంలో కొబ్బరి చిప్పలతో చేసిన బౌల్స్ వాడడం ట్రెండ్‌గా మారింది. కొబ్బరి చిప్పలను పాలిష్ చేసి, అందమైన రంగులోకి మలుస్తున్న చిప్పలు చాలా మందిని ఆకర్షిస్తున్నాయి. కానీ ఇవి ఒక్కొక్కటీ రూ.100లోపే ఉంటున్నాయి. మరి ఓ ఖాళీ కొబ్బరి చిప్పను ఏకంగా రూ.1,365కు అమ్మడంపై నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. ఆన్‌లైన్‌లో చూసిన ఐపీఎస్ అధికారి రెమా రాజేశ్వరి ఆశ్చర్యపోయి దాన్ని ట్విటర్‌లో పంచుకున్నారు. దీనికి సంబంధించిన స్ర్కీన్ షాట్‌ను పోస్ట్ చేశారు. ఆమె ట్వీట్‌పైనా నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

క్లాస్‌మేట్ స్పెల్‌బీ రెడీ...!

విజయవాడ : భారతదేశపు నెంబర్ వన్ నోట్ బుక్ బ్రాండ్ ఐటీసీ, రేడియో మిర్చి, పాఠశాల విద్యార్థుల కోసం అతి పెద్ద స్పెల్లింగ్ పోటీ... క్లాస్‌మేట్ స్పెల్ బీ 11వ సీజన్‌తో మళ్లీ తిరిగి వచ్చింది. దేశంలోని అత్యుత్తమ స్పెల్లర్ల సామర్థ్యాలను గుర్తిం చేందుకు, వారి ప్రత్యేక స్పెల్లింగ్ కౌశల్యాలకు గుర్తింపు ఇచ్చేందుకు సరైన వేదికను అందిస్తోంది. భారీ స్థాయిలో నిర్వహించే ఈ స్పెల్లింగ్ పోటీ గత సీజన్ కన్నా భారీ, అత్యుత్తమ అనుభవాన్ని అందించే భరోసాను ఇస్తోంది. 30 నగరాల్లో 1000కు పైగా పాఠశాలలకు వెళ్లి, 5 నుంచి 9వ తరగతి చదువుతున్న 6,50,000 పైగా విద్యార్థులను చేరుతుంది. స్పెల్లింగ్ బీలో జాతీయ చాంపియన్‌కు రూ.2,00,000లు నగదు, వాషింగ్టన్‌లో ప్రతిష్టాత్మక స్క్రిప్స్ స్పెల్లింగ్ బీలో తల్లిదండ్రులతో కలసి పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఈ సందర్భంగా ఐటీసీ ఎడ్యుకేషన్ అండ్ స్టేషనరీ ప్రొడక్ట్స్ బిజినెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శైలేంద్రత్యాగి మాట్లాడుతూ, క్లాస్‌మేట్ నిరంతరం ప్రతి విద్యార్థిలోని ప్రత్యేకతను గుర్తించి ప్రోత్సహించి, వేడుక చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ సీఈవో మహేశ్ శెట్టి మాట్లాడుతూ, స్పెల్లింగ్ బీ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సంప్రదించి అనుసంధానం చేస్తుందని, ఈ పోటీ అత్యుత్తమ ఆంగ్ల భాషను ప్రతిపాదించే మైలురాయి కార్యక్రమంగా నిలుస్తుందన్నారు. క్లాస్‌మేట్ మార్కెటింగ్ మేనేజర్ అభిషేక్ ఆనంద్ మాట్లాడుతూ, జట్లు పలు పొరల క్రియాశీలక వేదికను రూపొందించి విద్యార్థుల ఔట్‌రీచ్‌ను ఉత్తేజపరుస్తుందన్నారు.

పల్చని ఓరియంట్ ఫ్యాన్ విడుదల



విజయవాడ : 180 కోట్ల డాలర్ల విలువతో విస్తృత శ్రేణి సీకే బిర్లాలో భాగమైన ఓరియంట్ ఎలక్ట్రిక్ లిమిటెడ్ భారత దేశపు మొట్టమొదటి, ప్రపంచంలోనే అత్యంత పలుచని ఏరో స్లిమ్ ప్రీమియం సీలింగ్ ఫ్యాన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా ఓరియంట్ ఎలక్ట్రిక్ లిమిటెడ్ సీనియర్ ఉపాధ్యక్షులు, బిజినెస్ హెడ్ అతుల్ జైన్ మాట్లాడుతూ, "ఏరో స్లిమ్ తన ఐఓటీ నియంత్రణలతో పల్చని సిలిండ్రికల్ డిజైన్, విద్యుత్తు దక్షత గల ఇన్‌వర్టర్‌ను కలిగి ఉండి, ఈ వలయంలో నూతన మైలు రాళ్లను స్థాపించనుంది. ఇది అసాధారణ 240 సీఎంఎం ఎయిర్ డెలివరీ అందిస్తుంది. 40 శాతం విద్యుత్తును ఆదా చేస్తుంది. విలక్షణ ఫినిషింగ్, పనితీరు, సరళమైన పని నిర్వహణ, చూడగానే టక్కున ఆకట్టుకుందనే భరోసా మాకు ఉంది" అని అన్నారు.

టీచర్లకు తీపి కబురు

- 'ఏడో వేతన' సిఫార్సులకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ : సంక్రాంతి పండుగ రోజు ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉపాధ్యాయులకు ఏడో వేతన సంఘం సిఫార్సుల అమలుకు అమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ స్థాయి టెక్నికల్ సంస్థల సిబ్బందికి కూడా ఏడో వేతన సంఘం సిఫార్సులు అమలు చేయనున్నారు. వేతనాల పెంపుతో కేంద్ర ప్రభుత్వంపై రూ.1,241.78 కోట్ల అదనపు భారం పడనుంది. 1 జనవరి 2016 నుంచి 31 మార్చి 2019 వరకు 50శాతం ఎరియర్స్‌ను కేంద్ర ప్రభుత్వం చెల్లించనుంది.

130 ఔషధాలకు అమెరికా ఓకే

న్యూఢిల్లీ: దేశీయ ఔషధ పరిశ్రమ ఎగుమతుల్లో దాదాపు మూడో వంతు ఎగుమతులు అమెరికాకే జరుగుతాయి. అమెరికా మార్కెట్ భారత ఔషధ కంపెనీలకు కీలకం. ఆయా ఔషధ కంపెనీలు అమెరికా మార్కెట్‌లో కొత్తగా జనరిక్ ఔషధాలను ప్రవేశపెట్టడానికి చేసుకునే దరఖాస్తులు (అబ్రివియేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్-ఏఎన్‌డీఏ), ఏఎన్‌డీఏలకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) ఇచ్చిన అనుమతులు, పరిశోధన, అభివృద్ధిపై ఔషధ కంపెనీలు చేసే వ్యయం కంపెనీలు, పరిశ్రమ పనితీరును ప్రతిబింబిస్తాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి దేశంలోని మొదటి 5 ఔషధ కంపెనీలు 130 ఏఎన్‌డీఏలకు ఆమోదం పొందాయి. ఏడాది క్రితం ఇదేకాలంలో ఆమోదం పొందిన 92 ఏఎన్‌డీఏలతో పోలిస్తే 41 శాతం వృద్ధి నమోదైంది. 2018, సెప్టెంబరు చివరినాటికి ఈ కంపెనీలకు లభించిన మొత్తం ఏఎన్‌డీఏ ఆమోదాలు 1,374 ఔషధాలకు చేరాయి. ఈ కంపెనీలు మొత్తం 2,025 జనరిక్ ఔషధాలను అమెరికా మార్కెట్లోకి ప్రవేశపట్టడానికి దరఖాస్తు చేసుకున్నాయి. దాదాపు గత రెండేళ్లుగా ఔషధ కంపెనీలకు ఎదురుగాలులు వీస్తున్నాయి. అమెరికా మార్కెట్‌లో ధరల క్షీణత, ఏపీఐల ధరలు పెరగడం, దేశీయ మార్కెట్‌లో ధరల నియంత్రణల వంటి ప్రతికూల అంశాలను కంపెనీలు ఎదుర్కొంటున్నాయి. దీంతో కంపెనీలు పరిశోధన అభివృద్ధిపై వ్యయాన్ని తాత్కాలికంగా తగ్గించినట్లు కనిపిస్తోంది. 2018-19 తొలి ఆరు నెలల్లో మొదటి 5 కంపెనీల విక్రయాల్లో ఆర్ అండ్ డీ వ్యయం 7.64 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదేకాలంలో ఇది దాదాపు 8.64 శాతం ఉంది.

ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు



ముంబై: దేశీయ మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. కొనుగోళ్ల అండతో సూచీలు లాభాలతో ప్రారంభమైనప్పటికీ మదుపర్ల అప్రమత్తతతో ఆద్యంతం ఊగిసలాడాయి. చివరకు అత్యల్ప లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో మిశ్రమ ఫలితాల్ల ముగిసాయి. కొనుగోళ్ల అండతో ఈ ఉదయం సూచీలు ఉత్సాహంగానే ప్రారంభమ య్యాయి. ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 100 పాయింట్లు పైగా లాభపడగా.. నిఫ్టీ 10,900 మార్క్ పైన ట్రేడ్ అయ్యింది. అయితే ఆ జోరు ఎంతోసేపు నిలువలేదు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోవడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లు కూడా బలహీనంగా ఉండటం మార్కెట్‌పై ప్రభావం చూపింది. దీంతో బుధవారం నాటి సెషన్‌లో సూచీలు తీవ్ర ఒడుదొడుకులకు గుర య్యాయి. ఒక దశలో నష్టాల్లోకి జారిన సూచీలు చివరకు స్వల్ప లాభాలను సాధించాయి. మార్కెట్ ముగిసే సమ యానికి సెన్సెక్స్ అత్యల్పంగా 2.96 పాయింట్లు లాభపడి 0.01 శాతంతో 36,321 వద్ద, నిఫ్టీ 3.5 పాయింట్ల లాభంతో 0.03శాతంతో 10,890 వద్ద స్థిరపడ్డాయి. డాలర్ తో రూపాయి మారకం విలువ 71.18గా కొనసాగుతోంది. సెన్సెక్స్ ప్యాక్‌లో యస్‌బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఇన్ఫోసిస్, ఐసిఐసిఐ బ్యాంకు, టిసిఎస్, ఎస్‌బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జిసి, యాక్సిస్ బ్యాంకు, ఎన్‌టిపిసి 2.66శాతం ఎగిశాయి. మరోవైపు భారతిఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఆసియన్ పెయింట్స్, వేదాంత, హెచ్‌సిఎల్ టెక్, హచ్‌యుఎల్, హీరో మోటాకార్ప్, కొటక్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి,హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు,ఐటిసి 1.38శాతం దిగ జారాయి. విదేశీ మదుపరులు సుమారు రూ.159.60కోట్ల విలువైనషేర్లను కొనుగోలు చేయగా, దేశీయ మదుపరులు రూ.417.44కోట్లు అమ్మినట్లు తెలుస్తోంది. ఎన్‌ఎస్‌ఈలో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, యస్ బ్యాంక్, విప్రో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారత్ పెట్రోలియం షేర్లు లాభపడగా.. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, యూపీఎల్ లిమిటెడ్, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టపోయాయి. లండన్ ఎఫ్‌టిఎస్ఇ 0.61శాతం నష్టపోగా, ఫ్రాంక్‌ఫర్ట్ డిఏఎక్స్ 0.22శాతం ఎదిగింది. పారిస్ సిఏసి 40 0.20శాతం పెరిగింది.కొరియా కాస్పి 0.43శాతం, షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగిసింది.

ఆన్‌లైన్ ఇంటర్వ్యూకి సన్నద్ధత తప్పనిసరి

ఉద్యోగానికి సంబంధించి సెలక్షన్ ప్రక్రియలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్స్, ముఖాముఖి ఇంటర్వ్యూ.. ఇవన్నీ ఎప్పటి నుండో ఉన్నవే.. బహుళజాతి సంస్థ (ఎం.ఎన్.సి)లు రావడంతో ఇంటర్వ్యూలను ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తూ అభ్యర్థిని ఎంపికచేసే పద్ధతి మొదలైంది. అలాగూ అన్ని సందర్భాల్లోనూ ముఖాముఖి ఇంటర్వ్యూ చేయడానికి అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే కొన్నిసార్లు విదేశాల నుంచి లేదా దేశంలోనే దూర ప్రాంతాల నుంచి ఇంటర్వ్యూలు చేయాల్సి వస్తుంది. ఇలాంటి సందర్భాలలో కంపెనీల ముందున్న ప్రత్యామ్నాయ మార్గం 'ఆన్‌లైన్ ఇంటర్వ్యూ. ఈ ఆన్‌లైన్ ఇంటర్వ్యూలో విజయం సాధించాలంటే అభ్యర్థులు తీసుకోవలసిన జాగ్రత్తలు కొన్ని ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం.

ఆన్‌లైన్ ఇంటర్వ్యూ కూడా నేరుగా జరిపే ముఖాముఖి ఇంటర్వ్యూ లాంటిదే. ఈ ఇంటర్వ్యూలో ఒకరినొకరు చూసుకుని మాట్లాడే సౌకర్యం ఉండటంతో ప్రత్యక్ష ఇంటర్వ్యూ మాదిరిగానే అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది (ఇంటర్వ్యూ చేసే వారి కళ్లలోకి చూస్తూ మాట్లాడటం, బాడీ లాంగ్వేజ్ మొదలైనవి). వీటితోపాటు అదనంగా ఇంటర్నెట్ కనెక్షన్, పీసీ/ ల్యాప్‌ట్యాప్‌కు నాణ్యమైన వెబ్ కెమెరా ఉండేలా చూసుకోవాలి.



- అలాగే ఇంటర్వ్యూలో నెగ్గాలంటే అవసరమైన సాంకేతిక పరికరాల లభ్యత కూడా కీలకమే. కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్, మంచి రిజల్యూషన్ ఉన్న వెబ్ కెమెరా, హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్, నాణ్యమైన ఆడియో స్పీకర్స్ లేదా స్పష్టత ఉండే హెడ్‌ఫోన్స్ ఇందుకు అవసరమౌతాయి. అలాగే వీడియో చాటింగ్‌కి వీలుగా మీ సిస్టమ్‌లో స్కైప్ లాంటి సాఫ్ట్‌వేర్‌లను అమర్చుకోవాలి.
- ఆన్‌లైన్ ఇంటర్వ్యూలో పాల్గొంటున్న సమయంలో మీరున్న గదిలో మంచి బ్యాగ్రౌండ్ ఉండటం తప్పనిసరి. వెలుతురు కూడా సక్రమంగా ఉండాలి. ఇంటర్వ్యూ చేసేవాళ్లకు మీరు స్పష్టంగా కనిపించాలి. మీరున్న గదిని చిందరవందరగా లేకుండా బాగా సర్దుకోవాలి. అలాగే ఇంటర్వ్యూ మధ్యలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవడమూ ముఖ్యమే.
- ముఖాముఖి ఇంటర్వ్యూ మాదిరిగానే ఆన్‌లైన్ ఇంటర్వ్యూకి కూడా మంచి డ్రస్సింగ్ తప్పనిసరి. మీ దుస్తులు కెమెరాలో ఎలా కనిపిస్తున్నాయో ముందుగానే ఒకసారి చెక్ చేసుకోవడం మంచిదే. అలాగే మీకు అవసరమైనవన్నీ సిస్టమ్ పక్కనే ఉంచుకోండి. ఇంటర్వ్యూ చేసే సమయానికి కనీసం ఐదు నిముషాల ముందే మీ సిస్టమ్ ఆన్ చేసి, మీ మెయిల్ ఐడీ, స్కైప్ అకౌంట్, వీడియో చాటింగ్‌లోకి లాగిన్ అవ్వండి.
- ఇంటర్వ్యూ కాల్ రాగానే కెమెరా వైపు చూస్తూ ఇంటర్వ్యూ చేసే వాళ్లను విష్ చేయండి. మీ మాటలు వారికి, వాళ్ల మాటలు మీకు స్పష్టంగా వినిపిస్తున్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోండి. ఎదురెదురుగా, ప్రత్యక్షంగా మాట్లాడుతున్నామనే భావన వాళ్లలో కనిపించాలి. ఇలా చేస్తే మీరు చాలావరకు విజయవంతమైనట్టే.
- వీడియో, ఆడియోలో ఏదైనా అవాంతరాలుంటే టెక్ట్స్ మెసేజ్ ద్వారా వారికి సమాచారమివ్వండి.
- ఇంటర్వ్యూ చేసేవారితో ఐ కాంటాక్ట్‌లో ఉంటూ, చెప్పేది విని, జాగ్రత్తగా సమాధానం చెప్పడానికి ఏకాగ్రత చాలా ముఖ్యం.
- ఇంటర్వ్యూ జరుగుతున్నంతసేపూ కెమెరా వైపు చూస్తూనే మాట్లాడండి. గదిలో అటు, ఇటు పక్క చూపులు చూడటం పద్ధతి కాదు.
- మరీ బిగ్గరగా కాకుండా, అలా అని మరీ నెమ్మదిగా కాకుండా స్వరం మధ్యస్థంగా ఉండేలా చూసుకోండి. సమాధానం చెప్పేటప్పుడు స్పష్టత ముఖ్యమని గమనించండి.
- మీ హావభావాలన్నీ పద్ధతి ప్రకారం ఉండాలి. కుర్చీలో కూర్చునే విధానం, డ్రస్సింగ్, ముఖ కవళికలు ఇవన్నీ ఇంటర్వ్యూ చేసేవాళ్లకు కనిపిస్తాయి. అందువల్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- మీరు సమాధానం చెప్పే తీరు, ఎలా వింటున్నారు, ఎలా స్పందిస్తున్నారు.. వంటివన్నీ స్పష్టంగా వారికి తెలుస్తాయి. ఇంటర్వ్యూ మొత్తాన్ని వాళ్లు రికార్డు చేసే అవకాశాలూ చాలా ఎక్కువే. ఏవైనా సందేహాలుంటే మళ్లీ ప్రత్యేక కోణంలో పరీక్షించడానికి, సమీక్షించడానికి ఆన్‌లైన్ ఇంటర్వ్యూలో అవకాశం ఉంటుంది. కాబట్టి ముఖాముఖి ఇంటర్వ్యూ కంటే కూడా చాలా జాగ్రత్తగా ఉండటం అవసరం.
- ఆత్మవిశ్వాసంతో సూటిగా, స్పష్టంగా మాట్లాడాలి. సుదీర్ఘ ఉపన్యాసం వద్దు. అడిగిన విషయాలకే జవాబులు చెబితే సరిపోతుంది. తెలిసిన ప్రతి విషయాన్ని వాళ్లకు చెప్పాలనుకుంటే అది మనకే మైనస్ కావచ్చు.
- విదేశీయులు ఇంటర్వ్యూ చేసినట్లయితే ఉచ్చారణపరమైన ఇబ్బందులు తప్పకపోవచ్చు. కాబట్టి ఏకాగ్రతతో వాళ్లు చెప్పేది పూర్తిగా వినండి. అంటే మీరు మంచి శ్రోతగా మారిపోవాలి. అడిగిన ప్రశ్న అర్థం కాకపోతే మరోసారి రిపీట్ చేయమని మర్యాదపూర్వకంగా వారిని కోరడానికి సందేహించవద్దు.
- ఒకవేళ అనుకోని అవాంతరాల కారణంగా మీ పీసీ, నెట్ కనెక్షన్ అందుబాటులో లేనట్లయితే దగ్గరలో ఉన్న మంచి ఇంటర్నెట్ సెంటర్‌ను ముందే వెదు క్కుని, అన్ని విధాలా పరీక్షించుకోవడం ఉత్తమం. లేదంటే ఆఖరు నిముషంలో ఇబ్బందులు తప్పవు.



'బిజ్ ఏక్టివ్'లో
87 రకాల టెక్నాలజీ కోర్సులు

ఏఐ, బ్లాక్ చెయిన్ వంటి కొత్త టెక్నాలజీ కోర్సులు నేర్చుకోవాలంటే హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి శిక్షణ కేంద్రాలలో చేరనవసరం లేదని, తామే ఆ కోర్సులు నేర్పిస్తామని 'బిజ్ ఏక్టివ్' సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్ యాకూబ్ పాషా చెబుతున్నారు. ఏకంగా 87 రకాల టెక్నాలజీ కోర్సులు తమ సైట్ ద్వారానే నేర్చుకోవచ్చని ఆయన పేర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ నగరం కేంద్రంగా సేవలందిస్తున్న బిజ్ ఏక్టివ్‌లో బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా వంటి నగరాల నుంచి కూడా విద్యార్థులున్నారని ఆయన తెలిపారు. యాకూబ్ పాషా ఉద్యోగం చేసే సమయంలో ఎదురైన అనుభవాలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ విషయంలో గ్రామీణ యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు 'బిజ్ ఏక్టివ్' సంస్థను స్థాపించారు.





యాకూబ్ స్వస్థలం వరంగల్ జిల్లా మల్లంపల్లి. ఆర్థిక పరిస్థితుల కారణంగా బీటెక్‌ను మధ్యలోనే ఆపేసి, వరంగల్‌లో ఢిల్లీకి చెందిన ఓ ఎడ్యుకేషన్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. గ్రామీణ ప్రాంతం నుంచి రావటంతో టెక్నాలజీ కోర్సులను అంత త్వరగా అందుకోలేకపోయారు. ఇది ఆయన ఉద్యోగంపై ప్రభావం చూపించింది. తనలాగా ఇతర గ్రామీణ యువత ఇబ్బంది పడకూడదన్న అభిప్రాయంతో అందుబాటు సమయంలో తక్కువ ఖర్చుతో సాంకేతిక కోర్సులను అందించాలనే లక్ష్యంతో 2016 మార్చిలో లక్ష రూపాయల పెట్టుబడితో వరంగల్ కేంద్రంగా 'బిజ్ ఏక్టివ్' సర్వీసెస్‌ను ప్రారంభించారు. తెలుగు, హిందీ భాషల్లో గ్రామీణులకు అర్థమయ్యేలా సులువైన పద్ధతుల్లో కోర్సులను అందించడమే ఈ సంస్థ ప్రత్యేకత.

నేపాల్, దుబాయ్‌లకు విస్తరణ...

ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు చెన్నై, ముంబై, కోల్‌కత్తా, బెంగళూరు నగరాల్లో ఈ సంస్థ సేవలందిస్తోంది. 18 వేల మంది కస్టమర్లున్నారు. ఈ సంస్థ ఉత్పత్తులకు ఉత్పత్తులకు నేపాల్, దుబాయ్‌ల నుంచి డిమాండ్ ఉంది. త్వరలోనే ఆయా ప్రాంతాల్లో కేంద్రాలను ఈ సంస్థ ప్రారంభించనుంది. ఏడాదిలో లక్ష కస్టమర్లను చేరుకోవాలన్నది ఈ సంస్థ లక్ష్యం. అందుకే ఆఫ్‌లైన్‌లో శిక్షణ ప్రారంభించింది. ఇందుకు ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ వేణుగోపాల్ లక్ష్మీపురంను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. ప్రస్తుతం ఈ సంస్థకు 200 మంది డిస్ట్రిబ్యూటర్లున్నారు. గత రెండేళ్లలో రూ.3 కోట్ల టర్నోవర్‌ను సాధించింది. ఈ ఏడాది కాలంలో రూ.10 కోట్ల ఆదాయాన్ని చేరుకోవాలన్నది టార్గెట్. ప్రస్తుతం ఈ సంస్థలో 8 మంది ఉద్యోగులున్నారు. పలు ఎన్‌జీవో, ఏంజిల్ ఇన్వెస్టర్లతో చర్చలు జరుపుతోంది. ఏడాదిలో రూ.2 కోట్ల నిధులను సమీకరణను లక్ష్యంగా నిర్ణయించుకుంది.

2 ప్యాకేజీలు..

ప్రస్తుతం బిజ్‌ఏక్టివ్‌లో 2 రకాల ప్యాకేజీలున్నాయి. 1. ఎడ్యు అడ్వాన్స్‌డ్. ధర రూ.2,999. ఇందులో 152 అంశాలకు సంబంధించిన 87 రకాల కంప్యూటర్ కోర్సులుంటాయి. హిందీ భాషలో 10 రకాల కోర్సులుంటాయి. ఇవన్నీ ఆడియో, వీడియో ట్యుటోరియల్స్ రూపంలో ఉంటాయి. స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సుతో పాటూ 200 రకాల ఈ- పుస్తకాలను కూడా అందిస్తున్నారు ఇంటర్నెట్ అందుబాటులో లేనివాళ్ల కోసం ఆయా ప్యాకేజీ కోర్సుల పుస్తకాలను పెన్‌డ్రైవ్‌లో అందిస్తున్నారు. రెండోది, ఎడ్యు అల్టిమేట్. ధర రూ.6,600. ఇందులో మొదటి ప్యాకేజీతో పాటూ షాపింగ్ చేసుకునేందుకు వీలుగా స్మార్ట్ కార్డ్‌ను ఇస్తారు. బిజ్‌కార్ట్.కామ్‌లో షాపింగ్ చేసుకోవచ్చు. 4 లక్షలకు పైగా ఉత్పత్తులున్నాయి. రీచార్జ్, కరెంట్ బిల్లుల వంటి యుటిలిటీ సేవలతో పాటూ బస్, రైలు, విమాన టికెట్లను కూడా బుకింగ్ చేసుకోవచ్చు.

'భారతీయుడు 2' ఫస్ట్‌లుక్



అగ్ర కథానాయకుడు కమల్‌హాసన్ నటిస్తున్న చిత్రం 'భారతీయడు 2'. 1996 సూపర్‌హిట్ 'భారతీయుడు'కు సీక్వెల్‌గా వస్తోన్న చిత్రమిది. శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో కమల్ సరసన కాజల్ నటిస్తున్నారు. అనిరుధ్ సినిమాకు బాణీలు అందిస్తున్నారు. సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను శంకర్ విడుదల చేశారు. ఇందులో కమల్ తన వర్మ కళను ప్రదర్శిస్తూ కనిపించారు. జనవరి 18 నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానున్నట్లు చిత్ర బృందం పేర్కొంది.

తొలుత ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను డిసెంబరు 14న హైదరాబాద్‌లో ప్రారంభించనున్నట్లు వార్తలు వచ్చాయి. రెండో షెడ్యూల్ చెన్నైలో జరగనుందని చెప్పుకొచ్చారు. శంకర్ '2.ఓ' బ్లాక్‌బస్టర్ తర్వాత తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఈ సినిమాపై కూడా భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.

కమల్ మరోపక్క 'శభాష్ నాయుడు' సినిమాలో నటిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రూపుదిద్దుకుంటోన్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతల్ని కమలే చూసుకుంటున్నారు. రమ్యకృష్ణ, బ్రహ్మానందం, శ్రుతిహాసన్ ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. కొన్ని కారణాల వల్ల ఈ చిత్రం షూటింగ్ వాయిదా పడుతూ వచ్చింది.



రజనీకాంత్ సరసన కీర్తి సురేశ్

రజనీకాంత్ 'పేట' సినిమాతో ఇటీవల మంచి హిట్ అందుకున్నారు. ఈ సినిమా తర్వాత ఆయన దర్శకుడు ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో నటించనున్నట్లు తెలి సింది. ఈ ప్రాజెక్టు గురించి కొన్ని రోజుల క్రితం మురుగదాస్ మాట్లాడుతూ.. రజనీకి కథ చెప్పానని, ఆయన నుంచి ఫోన్‌కాల్ కోసం ఎదురుచూస్తున్నానని అన్నారు. ఫాంటసీ చిత్రంగా దీన్ని తెరకెక్కించబోతున్నట్లు కూడా చెప్పారు. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించి అధికారిక ప్రకటన ఇంకా చేయలేదు. ఇందులో రజనీకాంత్ సరసన కీర్తి సురేశ్ నటించే అవకాశం ఉన్నట్లు తాజా సమాచారం. సినిమాలోని కథానాయిక పాత్రకు ఆమె బాగా సరిపోతారని యూనిట్ భావిస్తోందట. ఈ ప్రచారంలో ఎంత మాత్రం నిజం ఉందో తెలియాలంటే చిత్ర బృందం నుంచి ప్రకటన రావాల్సిందే. కీర్తి సురేశ్ 'సర్కార్' సినిమా కోసం మురుగదాస్‌తో కలిసి పనిచేశారు. విజయ్ హీరోగా నటించిన ఈ చిత్రం విజయం సాధించింది. కీర్తి సురేశ్ ప్రస్తుతం ఓ మలయాళ సినిమాతో బిజీగా ఉన్నారు. ఇటీవల తెలుగులో ఆమె కొత్త చిత్రం షూటింగ్ ఆరంభమైంది. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. మరోపక్క ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'ఆర్.ఆర్.ఆర్' (వర్కింగ్ టైటిల్) చిత్రంలోనూ కీర్తి నటించే అవకాశాలు ఉన్నట్లు ఇటీవల తెగ వార్తలు వచ్చాయి. అయితే దీనిపై నటి, చిత్ర బృందం స్పందించలేదు.

అనుష్కతో మరో ఇద్దరు హీరోయిన్లు..



భాగమతి చిత్రం తర్వాత టాలీవుడ్ హీరోయిన్ అనుష్క హేమంత్ మధుకర్ దర్శకత్వంలో సినిమా చేస్తోన్న విషయం తెలిసిందే. సైలెన్స్ టైటిల్ తో థ్రిల్లర్ మూవీగా వస్తున్న ఈ సినిమాలో మాధవన్, సుబ్బరాజు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో అనుష్కతోపాటు మరో ఇద్దరు హీరోయిన్లు కూడా సందడి చేయనున్నారు. అంజలి, షాలిని పాండే కీలక పాత్రల్లో నటించనున్నట్లు టాక్. కోన ఫిలిం కార్పొరేషన్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి గోపీ సుందర్ సంగీత దర్శకుడు. మార్చి నుంచి సినిమా సెట్స్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం.

శ్రీదేవి బంగ్లాకు బోనీ కపూర్ నోటీసులు



శ్రీదేవి బంగ్లా సినిమాకు ప్రముఖ ప్రొడ్యూసర్ బోనీ కపూర్ లీగల్ నోటీసులు జారీ చేశారు. ఇంటర్నెట్ స్టార్ ప్రియా ప్రకాశ్ వారియర్ ఆ ఫిల్మ్‌లో శ్రీదేవి పాత్రలో నటిస్తోంది. అయితే ఈ సినిమా టీజర్‌ను ఈమధ్యే రిలీజ్ చేశారు. ప్రశాంత్ మంబుల్లే ఈ సినిమాను డైరక్ట్ చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ శ్రీదేవి.. గత ఏడాది దుబాయ్‌లోని ఓ హోటల్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శ్రీదేవి బంగ్లా టైటిల్‌తో వచ్చిన సినిమా మరో వివాదానికి కారణమైంది. ఆ సినిమాను శ్రీదేవి భర్త బోనీ కపూర్ వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. బోనీ కపూర్ నుంచి లీగల్ నోటీసు అందిందని, దాన్ని మేం సవాల్ చేస్తామని, ఓ సస్పెన్స్ థ్రిల్లర్ తరహాలో సినిమాను రూపొందించామని, శ్రీదేవి అనేది సాధారణ పేరు మాత్రమే అని డైరక్టర్ ప్రశాంత్ వెల్లడించారు. అయితే శ్రీదేవి బంగ్లా టీజర్‌లో హీరోయిన్ ఓ బాత్‌టబ్‌లో ఉన్న సీన్ కొన్ని అనుమానాలకు తావిస్తోంది. దాంతో బోనీ కపూర్ ఆ సినిమాపై లీగల్ నోటీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది.

విశాలాంధ్ర సినిమా



'అర్జున్ రెడ్డి' నటితో విశాల్ పెళ్లి..!

సినీ నటుడు విశాల్ పెళ్లిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త కుమార్తె అయిన అనీశాతో ఆయన వివాహం జరగనున్నట్లు గతంలో విశాల్ తండ్రి, ప్రముఖ నిర్మాత జీకే రెడ్డి మీడియా ద్వారా వెల్లడించారు. అయితే విశాల్‌ను పెళ్లిచేసుకోబోయే అమ్మాయి ఎవరో కాదు. 'పెళ్లిచూపులు' చిత్రంలో విజయ్ దేవరకొండకు ప్రేయసిగా నటించిన యువతే. విజయ్ నటించిన 'అర్జున్‌రెడ్డి' చిత్రంలోనూ అనీశా నటించారు. విశాల్‌తో కలిసి దిగిన ఫొటోను అనీశా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

'కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నాను. నా ఎదుగుదలలో, ఆలోచనల్లో స్ఫూర్తిగా నిలిచినందుకు మీ అందరికీ ధన్యవాదాలు. నా జీవితంలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి నాకు సరైన తోడు దొరికింది. విశాల్ మంచి మనసు నాకెంతో నచ్చింది. విశాల్‌తో జీవితం పంచుకుని ఆయన్ను సంతోషంగా ఉంచడానికి నా బెస్ట్ నేను ప్రయత్నిస్తాను.' అని అనీశా పేర్కొన్నారు. ఈ నెలలోనే హైదరాబాద్‌లో నిశ్చితార్థం జరగబోతోందని విశాల్ తండ్రి వెల్లడించారు. పెళ్లి కూడా ఇక్కడే చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

బ్రహ్మానందానికి శస్త్రచికిత్స



ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం ఆయన అస్వస్థతకు గురవడంతో హుటాహుటిన ముంబైలోని ఏహెచ్‌ఐ (ఏషియన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్)కు తరలించినట్లు ఆయన సన్నిహితులు వెల్లడించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండెకు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు రమాకాంత సోమవారం ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. బ్రహ్మానందం ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. ఆయన త్వరగా కోలుకోవాలని అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా కామెంట్లు పెడుతున్నారు. ఈ మధ్యకాలంలో బ్రహ్మానందం తక్కువ సినిమాల్లో నటిస్తున్నారు.



'సైరా'లో విజయ్ సేతుపతి లుక్ చూశారా?

మెగాస్టార్ చిరంజీవి హీరోగా డైరెక్టర్ సురేందర్‌రెడ్డి రూపొందిస్తున్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ బ్యానర్‌పై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితకథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సినిమాలో తమిళ స్టార్ హీరో విజయ్.. రాజా పాండి అనే పాత్రలో నటిస్తున్నారు. సేతుపతి పుట్టినరోజు సందర్భంగా అతనికి బర్త్‌డే విషెస్ చెబుతూ.. చిత్రంలో విజయ్ పాత్రకు సంబంధించిన మోషన్ టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.

తెలుగుతో పాటు పలు ఇతర భాషల్లో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. అమితాబ్ బచ్చన్, జగపతి బాబు, నయనతార, కిచ్చ సుదీప్, తమన్నా వంటి ప్రముఖ నటులు చిత్రంలో కనిపించనున్నారు.

కేజ్రీవాల్‌కు రెబెల్ పోటు.. : ఆప్‌కు బల్దేవ్‌సింగ్ రాజీనామా



చండీగఢ్ : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రెబెల్ ఎమ్మెల్యే బల్దేవ్ సింగ్ బుధవారం పార్టీ సభ్యునిగా రాజీనామా చేశారు. మూల సిద్ధాంతాలు, సూత్రా లను పార్టీ నాయకత్వం వదిలివేసిందని, అధ్యక్షుడు కేజ్రీవాల్ నియంతగా, అహంకారిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భోలత్ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరా ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా బల్దేవ్ సింగ్ రాజీనామాతో సార్వత్రిక ఎన్నికల ముందు ఆప్‌కు ఎదురుదెబ్బ తగిలినట్లయింది. 'పార్టీ సభ్యునిగా రాజీనామా చేయ టం చాలా బాధించింది. పార్టీ, అధ్యక్షుడి వ్యవహారశైలి నచ్చకే.. అసంతృప్తితో రాజీనామా చేస్తున్నాను' అంటూ కేజ్రీవాల్‌కు సమర్పించిన రాజీనామా లేఖలో సింగ్ పేర్కొన్నారు. 'మీ నియంతృత్వ పోకడల కారణంగానే ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్, మేధా పాట్కర్, కిరణ్ బేడీ, డా॥గాంధీ, హెచ్‌ఎస్ ఖాల్సా, సుచా సింగ్ ఛోటేపూర్, గుర్‌ప్రీత్ గుగ్గి, ఆశీష్ ఖేతాన్, అశుతోష్, హెచ్‌ఎస్ ఫూల్కా వంటి నేతలను ఆప్ కోల్పోయింది.' అని బల్దేవ్ సింగ్ వెల్లడించారు.

ప్రజాస్వామ్యమే మహాబలం : రాహుల్



న్యూఢిల్లీ : ప్రజాస్వామ్యమే భారతదేశానికి మహాబలమని, దానిని ఎట్టిపరిస్థితుల్లోనూ పరిరక్షించుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బుధవారం అన్నారు. భారతీయ పార్లమెంటులో చోటుచేసుకునే వాగ్వాదాలు మా దేశంలో అయితే తుపాకులు పేలేలా చేస్తాయని అఫ్ఘన్ ఎంపీలు తనతో చెప్పిన సందర్భాన్ని రాహుల్ గుర్తుచేశారు. ఫేస్‌బుక్ ద్వారా ఆయన ఆ సన్నివేశాన్ని వివరించారు. "ఓ రోజు మన పార్లమెంటులో అఫ్ఘనిస్థాన్‌కు చెందిన ఎంపీలు విజిటర్స్ గేలరీలో కూర్చొని ఉండటాన్ని గమనించాను. వారిని చూసినప్పుడు.. 'ఈ ఎంపీలు పరదేశం నుంచి వస్తే.. మనం చేస్తున్నది ఏమిటి..' సభ్యుల నినాదాలు, వాగ్వాదాలతో సభ దద్దరిల్లుతోంది. కనీసం విదేశీయులు ఉన్నప్పుడైనా ఈ సభ సజావుగా సాగలేదా? అని అనిపించింది. అనంతరం అఫ్ఘన్ ఎంపీలు నా కార్యాలయంలో నన్ను కలిసినప్పుడు సభలో జరిగినదానికి చింతిస్తున్నానని వారితో చెప్పాను. దాంతో అఫ్ఘన్ ఎంపీ ఒకరు భావోద్వేగానికి గురి కావడాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఏం జరిగిందని అడిగితే.. 'మిస్టర్ గాంధీ.. మీ దేశంలో జరిగినట్లు పార్లమెంటులో వాగ్వాదాలు మా దేశంలో జరిగితే బయట తుపాకులు పేలుతాయి' అని అన్నారు. కాబట్టి మనకు మన ప్రజాస్వామ్యమే మహాబలం. దీనిని ఎట్టిపరిస్థితుల్లోనూ పరిరక్షించుకోవాలి" అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు.



శబరిమలలో మళ్లీ ఉద్రిక్తత..!

- ఇద్దరు మహిళా భక్తుల అడ్డగింత
- రెచ్చిపోయిన ఆందోళనకారులు
- పోలీసులపై రాళ్లు, కొబ్బరి చిప్పలతో దాడి

కేరళ : శబరిమలలో మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. శబరిమల అయ్యప్ప ఆలయ దర్శనానికి వెళ్తున్న ఇద్దరు మహిళలను ఆందోళనకారులు అడ్డుకున్నారు. పంబ బేస్ క్యాంప్ దాటి వెళ్తుండగా నీలిమల వద్ద మహిళాభక్తులను అడ్డుకుని వెనక్కి పంపించారు. అనంతరం ఆ మహిళలను పోలీసులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. కన్నూరుకు చెందిన రేమా నిషాంత్, షనీలా రాజేశ్ అనే ఇద్దరు మహిళలు ఎవరికి అనుమానం రాకుండా పురుషుల దుస్తుల్లో తెల్లవారుజామున 5 గంటల సమయంలో శబరిమల దర్శనానికి వచ్చారు. ఆరుగురు పురుషులతో కలిసి దాదాపు 5 కిలోమీటర్లు నడిచారు. ఐతే, నామజపం చేస్తుండగా ఆందోళనకారులు మహిళలను గుర్తించి అడ్డుకున్నారు. ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో మహిళలు మరికొంత దూరం ముందుకువెళ్లారు. నీలిమల వద్ద పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు వీరిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు ఆందోళనకారులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. కొబ్బరికాయలను, రాళ్లతో పోలీసులపై దాడికి దిగారు. దీంతో ఇద్దరు మహిళలను, ఆరుగురు పురుషులను పోలీసులు నీలక్కల్‌కు తరలించారు.

'కోటా'...కోట కాదు..

- పట్టుకోసమే రిజర్వేషన్ ఎత్తుగడ
- మోడీ సర్కారుపై రైతుల ఆగ్రహం
- దళితులు, ఆదివాసీల మద్దతు కరవు
- అగ్రవర్ణాలు సైతం దూరం
- బలపడుతున్న విపక్షాల ఐక్యత

న్యూఢిల్లీ : అన్ని రంగాల్లో విఫలమై నాలుగేళ్లలోనే ప్రజాదరణ కోల్పోయిన నరేంద్రమోడీ ప్రభుత్వం తిరిగి అధికారం నిలబెట్టుకోవడానికి కొత్తకొత్త ఎత్తులు వేస్తోంది. అందులో మొదటిది అగ్రవర్ణాల్లో పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించడం. సాధారణంగా బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ మొదటి నుంచీ రిజర్వేషన్లకు వ్యతిరేకం. బీహారు ఎన్నికల సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రకటనలు గుప్పించారు. అయినా వచ్చే సాధారణ ఎన్నికల్లో అధికారం రాదని గ్రహించిన బీజేపీ పెద్దలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందారు. సాధారణంగా అగ్రవర్ణాలే బీజేపీకి వెన్నుదన్ను. ఇటీవల ఐదు రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో అగ్రవర్ణ యువత బీజేపీని చావుదెబ్బ కొట్టింది. ఈ విషయాన్ని గుర్తించిన బీజేపీ పెద్దలు రూటు మార్చారు. తమ అగ్రవర్ణ ఓటు బ్యాంకును ఎలాగైనా కాపాడుకోవడానికే బీజేపీ పదిశాతం కోటాను రంగంలోకి తీసుకొచ్చింది. ఎన్నికల నాటికి ఇంకా తన అమ్ముల పొడిలో చాలా అస్త్రాలు ఉన్నట్టు బీజేపీ ప్రచారం చేసుకుంటుంది. ప్రధాని నరేంద్రమోడీ ఏకపక్ష వైఖరి, నిరంకుశత్వం, కనీసం సహచర మంత్రులను కలుపుకోకపోవడం వంటి అనేక కారణాలు బీజేపీ ప్రతిష్టను మంటగలుపుతున్నాయి. అటు నరేంద్రమోడీ, ఇటు బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాపై పార్టీలోనే వ్యతిరేకత పెల్లుబుకుతోంది. బీజేపీ తిరిగి అధికారం చేజిక్కించుకునే అవకాశాలు మాత్రం ఏ కోశాన కనిపించడం లేదు.

మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్థికంగా వెనకబడిన బలహీనవర్గాలకు పదిశాతం రిజర్వేషన్ల కోటా న్యాయ పరిశీలనకు ఏమాత్రం నిలిచేది కాదని న్యాయ నిపుణులే స్పష్టంచేస్తున్నారు. అయితే, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కోటా దోహదపడవచ్చని వెల్లడిస్తున్నారు. అగ్రవర్ణాలకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతోనే బీజేపీ పదిశాతం కోటాను ముందుకు తీసుకొచ్చింది. సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్(సీఎస్‌డీఎస్)కి చెందిన లోక్‌నీతి రీసెర్చి ప్రోగ్రామ్ అందించిన డేటా ప్రకారం గడచిన రెండు దశాబ్ధాలుగా అగ్రవర్ణ ఓటర్లే బీజేపీకి అండగా నిలిచారు. 2014 ఎన్నికల్లో అగ్రకులాలు దాదాపు గంపగుత్తగా బీజేపీకి మద్దతిచ్చాయి. 1996 నుంచి అగ్రవర్ణ ఓటర్లు కాంగ్రెస్ నుంచి బీజేపీకి క్రమంగా బదిలీ అవుతూ వచ్చారని ఆ డేటా వెల్లడించింది. అందువల్ల అగ్రవర్ణాల్లో పరిగణనలోకి తీసుకోదగిన ఓటు బ్యాంకు బీజేపీకి లభించింది. దీనితోపాటు పదిశాతం కోటాతో లాభపడిన ఆర్థికంగా వెనుకబడిన బలహీనవర్గాలు కూడా తమతో కలిసివస్తాయని బీజేపీ గంపెడాశతో ఉంది. ప్రత్యేకించి ఇందులో గల రైతు వర్గాలపై ఆశలు పెంచుకుంది. అయితే, ఇది ఆశించిన స్థాయిలో లాభించే అవకాశాలు లేవని ఆ డేటా పేర్కొన్నది. గుజరాత్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అధిపత్యం గల రైతు వర్గాలు, పటేళ్లు, లింగాయత్‌లు బీజేపీకి మద్దతుగా నిలిచారు. మహారాష్ట్ర (మరాఠీలు), హర్యానా(జాట్లు) వంటి ఇతర రాష్ట్రాల్లో బీజేపీ పట్ల అగ్రవర్ణాల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. 2014లో కాంగ్రెస్‌తో పోలిస్తే రైతుకులాలు బీజేపీకే మద్దతు పలికాయి. 2009తో పోలిస్తే రెట్టింపు ఓట్లను బీజేపీ పొందింది. గత ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలిచిన రైతులు ఆ తర్వాత పంథా మార్చారు. మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులకు చేసిందేమీ లేకపోవడంతో ఉద్యమబాట పట్టారు. దాదాపు 2014 చివరి నుంచే రైతుల్లో తిరుగుబాటు వచ్చేసింది. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టారు. ఢిల్లీని సైతం ముట్టడించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, పండిన పంటకు గిట్టుబాట ధర కల్పించాలని డిమాండు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర ప్రభుత్వం పక్కనపెట్టడంతో అగ్రవర్ణాల్లో మోడీ సర్కారుపై అసహనం పెరిగింది. మొత్తంమీద ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై సుప్రీం తీర్పు బీజేపీకి చావుదెబ్బ కొట్టినట్టు అయింది. ఈ తీర్పు వల్ల అటు అగ్రవర్ణాలు, ఇటు దళితులు, ఆదివాసీ ఓటర్లు బీజేపీకి దూరమయ్యారు. ఆశ్చర్యకరంగా 2014లో దళితులు, ఆదివాసీలు సైతం బీజేపీకి అండగా నిలిచారు. తమకు అనుకూలంగా వచ్చిన సుప్రీం తీర్పును మోడీ సర్కారు పట్టించుకోలేదని, దళితుల ఒత్తిడికి తలొగ్గిందని అగ్రవర్ణాలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. మోడ్ ఆఫ్ ది నేషన్ (ఎంఓటీఎన్) 2018 మధ్యకాలంలో నిర్వహించిన సర్వే బీజేపీకి మతిపోయేలా చేసింది. తమకు అండగా నిలిచిన అగ్రవర్ణాల్లో సగానికి పైగా బీజేపీకి వ్యతిరేకంగా మారినట్టు ఆ సర్వే తేల్చిచెప్పింది. వ్యక్తిగత వివాదాల పరిష్కారానికి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని తరచూ దుర్వినియోగం చేస్తున్నట్టు అగ్రవర్ణాలు ఆరోపిస్తున్నాయి. దీనికారణంగా అగ్రవర్ణ ఓటర్లను బీజేపీ భారీగానే కోల్పోయే ప్రమాదం ఉన్నట్టు సర్వే వెల్లడించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో బీజేపీ ఓటమి దీని ఫలితమేనని తేల్చిచెప్పింది. ఆయా రాష్ట్రాల్లో స్థానిక పొత్తులు, సామాజిక సమీకరణాలు, కాంగ్రెస్ ఎంతోకొంత పుంజుకోవడం బీజేపీకి మరింత నష్టం కలిగించే పరిణామమని తెలిపింది. అందుకే పదిశాతం కోటాపైనే బీజేపీ నమ్మకం పెట్టుకుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పార్టీ పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లి అగ్రవర్ణ పునాదులను నిలుపుకోవాలని తంటాలు పడుతోంది. దేశంలో అగ్రవర్ణాల ఓటు బ్యాంకు పరిమితంగా ఉండటం, దళితులు, ఆదివాసీలు బీజేపీపై పెట్టుకున్న ఆశలు నెరవేరకపోవడం, దేశంలో కొంతమేరకు కాంగ్రెస్ పుంజుకోవడం, దాదాపు ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడం, మోడీ నిరంకుశ, ఏకపక్ష నిర్ణయాలు కమలానికి తీరని నష్టం కలిగించవచ్చని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.



అక్షరాస్యతతోనే కుటుంబ నియంత్రణ
బీహార్ డిప్యూటీ సీఎం



ముజఫర్‌నగర్ : నిరక్షరాస్యులే ఎక్కువ మంది పిల్లల్ని కంటారని బీహార్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి సుశీల్ కుమార్ మోడీ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో జనాభా నియంత్రణకు ప్రభుత్వం ప్రజల్లో చైతన్యం నింపి విద్యావంతులను చేయాలని ఆయన సూచించారు. దేశంలో అక్షరాస్యతతోనే అన్ని సమస్యలను పరిష్కరించవచ్చని, ప్రజలను విద్యావంతులను చేయడం ద్వారా కుటుంబ నియంత్రణ కూడా అమలు అవుతుందని సుశీల్ కుమార్ మోడీ అభిప్రాయపడ్డారు. విద్యావంతుల ఇళ్లల్లో పిల్లల సంఖ్య తక్కువగా ఉంటుందన్నారు. 2024 నాటికి జనాభాలో మన దేశం చైనాను మించి పోతుందని సుశీల్ కుమార్ మోడీ ఆందోళన వ్యక్తం చేశారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచే 10శాతం కోటా అమలు



న్యూఢిల్లీ : వచ్చే విద్యాసంవత్సరం నుంచే అగ్రవర్ణ పేదలకు పదిశాతం కోటాను అమలు చేస్తామని కేంద్ర మానవ వనరులశాఖమంత్రి ప్రకాష్ జవదేకర్ చెప్పారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సహా దేశవ్యాప్తంగా అన్ని కాలేజీలు, యూనివర్సిటీల్లో ఈ కోటా అమలు జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటాలను ప్రైవేట్ విద్యాసంస్థల్లోనూ అమలు చేస్తామన్నారు. ఎన్నికలే లక్ష్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం పదిశాతం రిజర్వేషన్లను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన విషయం విదితమే. ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం కోటా అమలుకు కొత్తచట్టం తీసుకొస్తారా లేదా ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు జారీ చేస్తారా అనే విషయాన్ని మంత్రి స్పష్టంచేయలేదు. దేశంలోని 40 వేల కాలేజీలు, 900 యూనివర్సిటీల్లో కోటాను అమలు చేస్తామని జవదేకర్ తెలిపారు. ప్రైవేట్ సంస్థలు సైతం కోటా కిందకు వస్తాయని స్పష్టంచేశారు.

సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావు నియామకంపై
వచ్చేవారంలో విచారణ : సుప్రీం



న్యూఢిల్లీ : సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి ఎం.నాగేశ్వరరావు నియమిస్తూ ఈనెల 10న వెలువడిన ఆదే శాలను సవాల్ చేస్తూ ఓ ఎన్జీవో దాఖలు చేసిన పిటిషన్‌పై వచ్చే వారంలో విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకారం తెలిపింది. ఈ వ్యవహారంలో అత్యవ సరంగా విచారణ జరిపేందుకుగాను సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుటకు వచ్చింది. పిటిషనర్ అయిన ఎన్జీవో 'కామన్ కాజ్', ఆర్టీఐ కార్యకర్త అంజలి భరద్వాజ్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషన్ శుక్రవారం వాదనలు వినిపించారు. అదేరోజు విచారణ చేపట్టడం ఏ మాత్రం కుదరదని, వచ్చే వారంలో విచారిస్తామని సీజేఐ గొగోయ్ ధర్మాసనం ఆయనకు స్పష్టం చేసింది. ప్రధాని మోడీ ఆధ్వర్యంలోని అత్యున్నత స్థాయి సంఘం ఆలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించిన అనంతరం నాగేశ్వరరావుకు ఆ బాధ్యతలను అప్పగించింది. ఈనెల 10న వెలువడిన ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎన్జీవో కామన్ కాజ్‌తో పాటు అంజలి భరద్వాజ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీబీఐ డైరెక్టర్ నియామకానికి సంబంధించిన పత్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరారు. ఆయా పిటిషన్లను పరిశీలించిన తర్వాత వాటిపై వచ్చే వారంలో విచారిస్తామని సర్వోన్నత న్యాయస్థానం బుధవారం వెల్లడించింది.

ఎవరినీ ప్రలోభపెట్టే అవసరం లేదు

- మా ప్రభుత్వానికి ధోకా లేదు : కుమారస్వామి స్పష్టీకరణ
- అబద్ధాల ప్రచారాన్ని మానుకోండి : మీడియాకు సూచన



బెంగళూరు : కర్ణాటకలో రాజకీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో పాలక సంకీర్ణం-బీజేపీకి మధ్య ఫిరాయింపుల విషయంలో పరస్పర విమర్శలు, ప్రతి విమర్శలు జోరందుకున్నాయి. ఈ క్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి బుధవారం స్పందిస్తూ 'ఆందోళన అక్కర్లేదు..పరిస్థితి నియంత్రణలోనే ఉంది. మా ప్రభుత్వానికి ధోకా లేదు' అని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలను తమ వైపుకు తిప్పుకోవాల్సిన అవసరం లేదని, తాను ప్రశాంతంగానే ఉన్నానని చెప్పారు. కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణం నుంచి ఎదుయ్యే ప్రలోభాల భయంతో బీజేపీ ఎమ్మెల్యేలు గుర్‌గావ్‌లో ఆశ్రయం పొందుతున్నారన్న విషయమై ఓ విలేకరి ప్రశ్నించగా 'ఎలాంటి ఆపరేషన్ల (ఫిరాయింపులు) అవసరం నాకు లేదు. నా వద్ద సరిపడ సంఖ్యాబలం ఉంది' అని కుమారస్వామి బదులిచ్చారు. మీ పార్టీ ఎమ్మెల్యేలు సంక్రాంతి వేడుకల కోసం వెళ్లారా లేక మరో కారణమేమైనా ఉందా' అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్పనుద్దేశించి ఆయనన్నారు. తాము జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణానికి ఇచ్చిన మద్దతును ఉపసంహరించుకుంటున్నట్టు ఇద్దరు ఎమ్మెల్యేలు హెచ్ నగేశ్ (స్వతంత్రుడు), ఆర్.శంకర్ (కేపీజేపీ) మంగళవారం గవర్నర్ వజుభాయి వాలాకు లేఖ ద్వారా తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కాయి. తమ పార్టీ ఎమ్మెల్యేలను ఎక్కడికి పంపడం లేదని, ఇదంతా మీడియా సృష్టి అంటూ ముఖ్యమంత్రి వెల్లడించారు. 'మా నాయకులను ఏదేని రిసార్టుకు తరలించాల్సిన అవసరం మాకు లేదు. తప్పుడు సమాచారంతో రాష్ట్ర ప్రజలను గందరగోళానికి గురిచేయొద్దు అని మీడియాను కోరుతున్నా' అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా రిసార్టుకు తరలిపోయారా అన్న దానిపై స్పష్టతలేదు. కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఐదుగురు ముంబైలో బీజేపీ నియంత్రణలో ఉన్నారన్న వార్తలపై సీఎం స్పందిస్తూ అలాంటిదేమీ లేదని చెప్పారు. అక్కడ ఏం జరుగుతున్నదో తనకు తెలుసునన్నారు. వారు మిగతా వారికి అందుబాటులో లేకపోవచ్చునని, తనను సంప్రదిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అన్ని వాస్తవాలను కాంగ్రెస్ నాయకత్వానికి చెప్పినట్టు ఆయన వెల్లడించారు. కన్నడ వార్తాఛానళ్ల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇక్కడ పరిస్థితి నాకన్నా మీకు బాగా తెలుసా? ముఖ్యమంత్రిగా ఉన్న నాకు రాష్ట్రంలో ఏం జరుగున్నది తెలియదా? అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. ఇదే కొనసాగితే కన్నడ వార్తాఛానళ్ల విషయంలో ప్రజలే తగు నిర్ణయం తీసుకుంటారు' అంటూ మీడియాపై సీఎం మండిపడ్డారు. ఇదిలావుండగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఇంచార్జి కేసీ వేణుగోపాల్‌తో ఉపముఖ్యమంత్రి కేసీ వేణుగోపాల్, సీఎల్‌పీ నేత సిద్దరామయ్య భేటీ అయ్యారు. అనంతరం సిద్దరామయ్య మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. 'కర్ణాటక ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేదని.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా బీజేపీలో చేరరు' అంటూ ప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ దినేశ్ గుండు రావు ట్విట్టర్ ద్వారా ధీమా వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వాన్ని అస్థిరపర్చే చర్యలు జరుగుతున్నాయంటూ అమిత్‌షా, యడ్యూరప్ప, బీజేపీపై ఆరోపణలు చేశారు. దేశంలో మోడీ-షా మాఫీయా రాజ్యం అంతానికి సమయం ఆసన్నమైందంటూ ట్వీట్ చేశారు. 'మా ప్రభుత్వ స్థిరత్వంపై ప్రశ్నలు సంధించడానికి బదులు బీజేపీ అపవిత్ర విధానాలను బట్టబయలు చేస్తే సబబుగా ఉంటుంద'ంటూ మీడియాకు హితవు పలికారు. బీజేపీ విషయంలో మృదువు వైఖరి ఎందుకోసంటూ తన ట్వీట్లతో మీడియాకు చరకలు అంటించారు.

బీజేపీ రథయాత్రకు 'సుప్రీం' నిరాకరణ..!

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో రథయాత్రకు ఉవిళ్లూరిన బీజేపీకి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. రథయాత్రకు అనుమతి నిరాకరించింది. బీజేపీ రథయాత్రతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, మత ఘర్షణలు చోటుచేసుకునే ప్రాంతాల్లోనే రథయాత్ర నిర్వహిస్తున్నారని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వివరించింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ అభ్యంతరాలతో సుప్రీంకోర్టు ఏకీభవించి.. రథయాత్ర రూట్ మ్యాప్‌ను సవరించి కోర్టుకు సమర్పించాలని బీజేపీని ఆదేశించింది. రథయాత్రకు మరోసారి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఇటీవలే కోల్‌కతా హైకోర్టు సింగిల్ బెంచ్ ఈ రథయాత్రలకు అనుమతి ఇచ్చింది. రథయాత్ర వల్ల మత ఘర్షణలు చెలరేగే అవకాశం ఉందని భావిస్తూ బెంగాల్ ప్రభుత్వం.. డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేసింది. దీంతో డివిజన్ బెంచ్ ప్రభుత్వ వాదనను సమర్థిస్తూ రథయాత్రకు అనుమతి నిరాకరించగా... బీజేపీ సుప్రీం కోర్టు తలుపు తట్టింది. ఐతే ఇక్కడ కూడా బీజేపీకి భంగపాటు తప్పలేదు.

20.6 కేజీల బంగారం పట్టివేత



చెన్నై : దుబాయ్, శ్రీలంకల నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ. 6.8కోట్ల విలువైన 20.6 కేజీల బంగారాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజన్స్ (డీఆర్ఐ) స్వాధీనం చేసుకుంది. బంగారాన్ని అక్రమ రవాణా చేస్తున్న నలుగురిని అరెస్టు చేశామని బుధవారం అధికారిక ప్రకటన వెలువడింది. అరెస్టయిన నలుగురు ముఠాకీలక సూత్రదారులని, సహకరించిన బంధువు, ఇద్దరు అక్రమ రవాణాదారులను కస్టడీలోకి తీసుకున్నామని ప్రకటన పేర్కొంది. నివాస గృహాల్లో ఈ మొత్తం బంగారాన్ని దాచారని, దీనిని ఆయా వ్యక్తులకు చేరవేయడానికి ఉపయోగించే బీఎండబ్ల్యూ కారు, రూ. 21 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వివిధ విమానాశ్రయాల్లో అక్రమ రవాణా చేస్తున్న ప్రయాణీకుల నుంచి బంగారపు కడ్డీలను సేకరించి చెన్నైలోని చూలాయ్‌ముడు చెందిన ముఠానాయకుడు సరఫరా చేస్తారని నిందితులు విచారణలో తెలిపారన్నారు. స్మగుల్డ్ బంగారం దుబాయ్ నుంచి ముంబై మీదుగా చెన్నై చేరుకుంటుందని, శ్రీలంక నుంచి ఇలాగే వస్తుందన్నారు. పండుగకు పెద్ద ఎత్తున బంగారపు కొనుగోళ్లు ఉండటం, దాని రేటు పెరగడంతో అక్రమరవాణా పెరిగిందని అధికారులు వెల్లడించారు.

యూపీఎస్‌సీనే ప్రామాణికం
ఐదు రాష్ట్రాల పిటిషన్లకు సుప్రీం తిరస్కరణ

న్యూఢిల్లీ : డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)ల ఎంపిక, నియామకంపై గతేడాదిలో వెలువరించిన ఆదేశాల సవరణను కోరుతూ ఐదు రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. డీజీపీల ఎంపిక, నియామకానికి సంబంధించి స్థానిక చట్టాలను అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పంజాబ్, కేరళ, పశ్చిమ బెంగాల్, హర్యానా, బీహార్ రాష్ట్రాలు సుప్రీంకోర్టును కోరాయి. ఈ మేరకు ఐదు రాష్ట్రాల వాదనలు విన్న సీజేఐ రంజన్ గొగోయ్ ధర్మాసనం అందుకు నిరాకరించింది. ప్రజా ప్రయోజనాలు, రాజకీయ జోక్యం నుంచి పోలీసు అధికారులకు రక్షణ కల్పించే ఉద్దేశంతో ఇచ్చిన ఆదేశాలను సవరించేది లేదని ధర్మాసనం స్పష్టంచేసింది. పంజాబ్, హర్యానా డీజీపీల పదవీకాలాన్ని జనవరి 31 వరకు పొడిగించడంతో పాటు ఆయా రాష్ట్రాల ఫిర్యాదులపై విచారణకు డిసెంబరు 12న అంగీకరించింది. డీజీపీ సురేష్ అరోరా (పంజాబ్), డీజీపీ బీఎస్ సంధు (హర్యానా)ల పదవీకాలం డిసెంబరు 31తో ముగియనుండగా దానిని జనవరి 31 వరకు సర్వోన్నత ధర్మాసనం పొడిగించింది. డీజీపీల నియామకం కోసం యూపీఎస్‌సీకి ప్రామాణికం కావాలని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించింది. దీనిని సవరించాలని పలు రాష్ట్రాలు కోరుతున్నాయి. ఈ క్రమంలో తాము సమగ్ర చట్టాన్ని రూపొందించామంటూ పంజాబ్, హర్యానా, బీహార్, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు న్యాయస్థానానికి వెల్లడించాయి. అయితే, పోలీసు అధికారులకు రాజకీయ జోక్యం నుంచి రక్షణ కల్పించే ఉత్తర్వులను సవరించేది లేదంటూ ఐదు రాష్ట్రాల పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది.


దేశద్రోహ చట్టం దుర్వినియోగం...!
కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్



న్యూఢిల్లీ : 'దేశద్రోహం' చట్టాన్ని తొలగించాలని కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్ అన్నారు. ఇదొక వలసవాద చట్టమని, దీన్ని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వలసవాదుల చట్టం ఇవాళ్టి రోజుల్లో ఎంత మాత్రం అవసరం లేదని అన్నారు. కేవలం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ట్వీట్ చేసిన వాళ్లపై కూడా 'దేశద్రోహం' కేసులు బనాయిస్తున్నారని, చట్టాన్ని కేంద్రం దుర్వినియోగం చేస్తోందని పేర్కొన్నారు.

2016, ఫిబ్రవరి 9న జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత వ్యతిరేక నినాదాలు చేశారన్న అభియోగంపై జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్‌పై 1200 పేజీల ఛార్జిషీటును ఢిల్లీ పోలీసులు సోమవారం దాఖలు చేశారు. మాజీ విద్యార్థి నేతలు ఉమర్ ఖాలీద్, అనిర్బన్ భట్టాచార్యతో పాటు 36 మంది పేర్లను ఛార్జిషీటులో పేర్కొన్నారు. రెండ్రోజుల తర్వాత కపిల్ సిబల్ దీనిపై వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, మూడేళ్ల కిందట కేసుపై ఇప్పుడు ఛార్జిషీటు దాఖలు చేయడం పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, ఎన్నికల వేళ, అదికూడా తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రధాని ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారని కన్హయ్య కుమార్ విమర్శించారు.

కన్హయ్యపై దేశద్రోహం కేసు తగదు : శివసేన



ముంబై : బీజేపీపై శివసేన మరోసారి కలం కరవాలాన్ని దూసింది. జేఎన్‌యూ విద్యార్థి నేత కన్హయ్య కుమార్‌ను విమర్శించే నైతిక హక్కు బీజేపీకి లేదని శివసేన తన అధికార పత్రిక సామ్నా సంపాదకీయంలో దుయ్యబట్టింది. కాశ్మీర్‌లో పీడీపీతో పొత్తు పెట్టుకున్న రోజే బీజేపీ ఆ హక్కు కోల్పోయిందని స్పష్టం చేసింది. పార్లమెంటు మీద దాడి సూత్రధారి అఫ్జల్‌గురును అమర వీరుడిగా పీడీపీ అధినేత, కాశ్మీర్ మాజీ సీఎం మహబూబా ముఫ్తీ భావిస్తారని గుర్తు చేసింది. అలాంటి పీడీపీతో పొత్తుపెట్టుకుని బీజేపీ పాపానికి ఒడిగట్టిందని మండిపడింది. కన్హయ్యపై దాఖలు చేసిన దేశద్రోహం కేసు నుంచి రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నించవద్దని హితవు చెప్పింది. భయంకరమైన టెర్రరిస్టు అజ్మల్ కసబ్‌కు కోర్టులో తనను తాను సమర్థించుకునే అవకాశం కల్పించారని, కన్హయ్యకు కూడా తన వాదాన్ని వినిపించే అవకాశమివ్వాలని సామ్నా సూచించింది. కన్హయ్యకుమార్ మంచివక్త అనీ, నిరుద్యోగ యువతకు ప్రతినిధి అనీ శివసేన పత్రిక ప్రశంసించింది.

టైట్లర్‌ను ఆహ్వానించడం బెదిరింపే : ఎస్‌ఏడీ

న్యూఢిల్లీ : సిక్కు అల్లర్లలో ప్రధాన పాత్ర వహించిన జగదీష్ టైట్లర్‌ను కాంగ్రెస్ సముచిత స్థానం కల్పించడం సాక్షులను బెదిరించడమే అని శిరోమణి అకాలీదళ్ నాయకుడు మంజిదర్ సింగ్ సీర్సా విమర్శించారు. టైట్లర్, కమల్‌నాథ్‌లు కూడా అరెస్టవుతారన్న భయంతోనే కాంగ్రెస్ ఈ పనికి పూనుకుందన్నారు. పార్టీ అధిష్ఠానం మద్దతు సిక్కు అల్లర్లకు పాల్పడిన వారికి ఉందని చెప్పడమే ఆ పార్టీ ధ్యేయమని సీర్సా వెల్లడించారు. సజ్జన్ కుమార్‌కు జైలు శిక్ష విధించగానే, కోర్టు, పోలీసులు ఎవరూ వారిపై చర్యలు తీసుకోకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షీలా దీక్షిత్ బాధ్యతలు చేపట్టిన కార్యక్రమంలో ఢిల్లీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అజయ్ మాకెన్,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గంజాయి ముఠా అరెస్ట్

విశాలాంధ్ర - కర్నూలు క్రైం : జిల్లాలో గంజాయిని విక్రయిస్తున్న ముఠా నాయకుడు శ్రీనివాస గౌడ్‌తోపాటు మరో 10 మందిని అరెస్టుచేసి 10 కేజీల గంజాయి, బొలేరో వాహనం, ఆటో, ద్విచక్ర వాహనం, మొబైల్స్, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నట్లు కర్నూలు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. రెండో పట్టణ పోలీస్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో నిందితులను పాత్రికేయుల ముందు హాజరుపరిచి, వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శ్రీనివాస గౌడ్ ఆధ్వర్యంలో 9 మంది పురుషులతోపాటు, ఓ మహిళ గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్పీ స్పెషల్‌పార్టీ, రెండో పట్టణ ఎస్సై జగన్నాథం, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర రావు, హనుమంతు, నీలకంఠప్ప, మేరీ జయంతి, కానిస్టేబుళ్లు వరకుమార్, రామాంజనేయ రెడ్డి, రంగస్వామి, సుంకన్న తదితరులు దాడులు చేసి అరెస్టు చేశారన్నారు. కర్నూలు రైల్వే స్టేషన్ పార్కింగ్ స్టాండ్ వద్ద ఒక బొలేరో వాహనం, ఒక ఆటోలో గంజాయి విక్రయిస్తున్న ముఠా నాయకుడు శ్రీనివాస గౌడ్‌తోపాటు రాములమ్మ, రవి, సిద్ధయ్య, షేక్ అక్బర్ బాషా, ఉస్మాన్‌బాషా, సూరి జుబేర్ అహ్మద్, మహమ్మద్ వసీమ్, ముల్లా అలిమ్‌అబ్జల్, చాంద్‌బాషాలను అరెస్టుచేసి, 10 కేజీల గంజాయి, ఒక బొలేరో వాహనం, ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.89,520 నగదు,14 మొబైల్ ఫోన్‌లు, రూ.10 కాయిన్స్ 22 , 210 ఇత్తడి బిళ్లలు, సౌదీ అరేబియన్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దాడుల్లో పాల్గొన్న సిబ్బందిని ఆయన అభినందిస్తూ, వారికి రివార్డ్స్ ప్రకటించారు.

సంక్రాంతి నాడు
స్వగ్రామంలో గడిపే స్ఫూర్తి అందరిలో రావాలి

విశాలాంధ్ర - చంద్రగిరి : తాను పుట్టిన ఊరు నారావారిపల్లెలో గత 20 ఏళ్లుగా బంధుమిత్రులతో కలసి సంక్రాంతి జరుపుకోవడం ఆనవాయితీగా చేస్తున్నామని ఇదే స్ఫూర్తి అందరిలో రావాలని, స్వగ్రామాలకు వెళ్ళి సంక్రాంతి సంబరాలు జరుపుకుంటే ఆ అనుభూతి అద్భుతంగా ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తన స్వ గ్రామం నారావారిపల్లెలోని టీటీడీ కళ్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పనులు చేయడం ముఖ్యమని ఆనందం పొందడం కూడా ముఖ్యమని అన్నారు. మన వారసత్వం, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని, కానీ వాటిని అడ్డం పెట్టుకుని జూదం ఆడడం మంచిది కాదని అన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా లోటు బడ్జెట్ ఉన్నా ఏ రాష్ట్రం చేయని విధంగా అభివృద్ధి చేశామని, సంక్షేమ కార్యక్రమాలు, పెన్షన్లు, ఇళ్ళు, రేషన్, అర్హత గల వారందరికీ ఇచ్చామన్నారు. జిల్లాలో 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటింటి చెత్త సేకరణ, బిందు సేద్యంలో దేశంలోనే చిత్తూరు జిల్లా 10వ స్థానంలో ఉందన్నారు. అనంతపురం, చిత్తూరు జిల్లాలను హార్టీకల్చర్ హబ్‌గా మార్చి వ్యాపార పంటలతో అధిక ఆదాయం వచ్చేలా చేస్తున్నామని, పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యం వైపు రైతులను మరలిస్తున్నామని, పీల్చే గాలి, తినే తిండి, తాగే నీరు స్వచ్ఛంగా ఉండాలనే ఉద్దేశ్యంతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. గోకులం, మినీ గోకులంలకు ప్రాధాన్యతనిస్తున్నామని అన్నారు. ఆటోమొబైల్ రంగంలో హీరో మోటర్స్, ఇసుజు, అపోలో టయర్స్, ఫోర్డ్ వంటి కంపెనీలు వచ్చాయని, వీటితో పాటు టైల్స్, టెక్స్ టైల్స్ పరిశ్రమలు రావడంతో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు వచ్చాయని అన్నారు. మన రాష్ట్రం అభివృద్ధిలో 650 ర్యాంకులు సాధించిందని, తిరుపతి పట్టణం భద్రతలో 2, నివాసయోగ్యంలో 4, స్వచ్ఛతలో 6, రైల్వేలో 3 వ ర్యాంకులు సాధించడం అభివృద్ధికి నిదర్శనం అని అన్నారు. ఈ నెలలో హంద్రీ - నీవా జలాలు తంబళ్ళపల్లె, పుంగనూర్‌కు రానున్నాయని అలాగే అడవిపల్లికి కూడా వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహకరించడం లేదని అన్నారు. విలేకరుల సమావేశం అనంతరం ముఖ్యమంత్రి తిరుపతి నగర పాలక సంస్థకు సంబంధించి రాష్ట్రంలోనే మొదటి డస్ట్ బిన్ ఫ్రీ సిటీ పోస్టర్‌ను ఆవిష్కరించి, తిరుపతి ప్లాస్టిక్ ఫ్రీ సిటీ చిత్రపటంపై సంతకం చేశారు. కలెక్టర్ పి.ఎస్. ప్రద్యుమ్న, పరిశ్రమల శాఖ మంత్రి ఎన్. అమరనాథ రెడ్డి, ఎంపీ శివ ప్రసాద్. ఎంఎల్‌సీ రాజ సింహులు, తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా ఛైర్మన్ నరసింహ యాదవ్, సబ్ కలెక్టర్ మహేశ్ కుమార్, శాప్ డైరెక్టర్ శ్రీధర్ వర్మ, పులివర్తి నాని పాల్గొన్నారు.

కేసీఆర్, జగన్ అవిభక్త కవలలు

విశాలాంధ్ర - విశాఖసిటీ : తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్. జగన్ అవిభక్త కవలలుగా రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అభివర్ణించారు. బుధవారం విలేకరుల సమావేశంలో గంటా మాట్లాడుతూ తెలంగాణలో టీఆర్‌ఎస్ గెలిస్తే వైసీపీ వారు సంబరాలు జరుపుకున్నారన్నారు. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న సంబంధం పట్ల ఇటీవల నగరానికి వచ్చిన టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. ఓట్లు అడిగే హక్కు జగన్‌కు లేదన్నారు. జగన్, కేసీఆర్‌ల బలహీనతల కారణంగానే ప్రధానిని ప్రశ్నించలేకపోతున్నారన్నారు. వీరిద్దరూ కలసినా చంద్రబాబును ఏమీ చేయలేరన్నారు. ఏపీకి అన్యాయం చేసిన వారితో జగన్ చేతులు కలుపుతున్నారన్నారు. ఎవరు ఎన్ని విధాల ప్రయత్నించినా వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు.

విశాఖ రైల్వే అభివృద్ధికి రూ.300 కోట్లు



విశాలాంధ్ర - విశాఖసిటీ : విశాఖపట్నం రైల్వే అవసరాలకు రూ. 300 కోట్లు రానున్నట్టు పార్లమెంటరీ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.సుబ్బిరామిరెడ్డి తెలిపారు. విశాఖ నగరంలో బుధవారం కమిటీ సభ్యులతో పాటు పర్యటించిన సుబ్బి రామిరెడ్డి స్థానిక హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నగరంలోని పలు విభాగాలను సందర్శించామని తెలిపారు. రైల్వే అభివృద్ధికి నిధుల కేటాయింపు కోసం ఇప్పటికే రైల్వే బోర్డు అధికారులతో మాట్లాడామన్నారు. జిల్లాలోని హెూమీబాబా క్యాన్సర్ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయనున్నామ న్నారు. గత నాలుగేళ్లలో 13వేల మందికి అక్కడ వైద్య సేవలు అందాయన్నారు. మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తామన్నారు. వాస్తవంగా ఈ ఆసుపత్రి గుజరాత్‌లో నెలకొల్పే ప్రయత్నాలు జరిగితే అడ్డుకుని నగరానికి రప్పించామని గుర్తు చేశారు. పలు విభాగాల్లో కాలుష్యాన్ని తగ్గించు కోవడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. విశాఖలో 40 లక్షల మొక్కలు నాటే ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే 30 లక్షల మొక్కలు నాటా మని, మరో పదివేల మొక్కలు కూడా నాటుతామన్నారు. దీని వల్ల నగరమంతా పచ్చదనం పెరుగుతుందన్నారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య?

విశాలాంధ్ర - ఆనందపురం : విశాఖ జిల్లాలోని ఆనందపురం గ్రామంలో బుధవారం ఏటీడీపీ మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. విశాఖ జిల్లా మునగపాక మండలం నాగవరానికి చెందిన కరణం కుమారి(20), రంగా రెడ్డి జిల్లా పుదూరు మండలం లింకిపల్లి గ్రామానికి చెందిన మాల రాజేంద్ర నాలుగు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. వీరు ఆనందపురం గ్రామంలో నివా సం ఉంటున్నారు. ఇద్దరూ స్థానిక కొంగలుపాకలోని ఏటీడీపీ బెటాలియన్‌లో కానిస్టేబు ళ్లుగా పనిచేస్తున్నారు. భర్త రాజేంద్ర ఇటీవలే బదిలీపై వెళ్లారు. కాగా ఒంటరిగా ఉన్న కుమారి బుధవారం తన గదిలో ఉరివేసుకుని మృతిచెందింది. స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలికి సీఐ పి.సూర్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలికి తరలించారు. భార్యాభర్తల మధ్య తరచూ విభేదాలు వస్తుండేవని, భర్త వేధింపులే మృతికి కారణమని కుమారి తల్లిదండ్రులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

నేటి నుంచి జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



విశాలాంధ్ర - కర్నూలు కలెక్టరేట్ : కర్నూలులో నేటి నుంచి జరగనున్న 64వ స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పోటీల నిర్వహణ కార్యదర్శి ఎల్.చలపతిరావు, భారత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల పరిశీలకులు అమిత్‌అగ్ర తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఏ క్యాంప్‌లోని మాంటిస్సోరి స్కూల్‌లో వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోటీల్లో 19 రాష్ట్రాల నుంచి 300 మంది క్రీడాకారులు, 70 మంది క్రీడా అధికారులు, సాంకేతిక నిపుణులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇది వరకే అయిదుసార్లు అండర్-19 విభాగంలో జాతీయ స్థాయి పోటీలను వివిధ క్రీడా అంశాల్లో నిర్వహించామని, ఆ అనుభవంతో మరోసారి జిల్లాలో నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పోటీల నిర్వాహక కార్యదర్శి హర్షవర్ధన్, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సంఘం కార్యదర్శి వెంకటరంగయ్య, జిల్లా సంఘం కార్యదర్శి షేక్షావలి, టెక్నికల్ అధికారి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

18 నుంచి అరకులో బెలూన్ ఫెస్టివల్

విశాలాంధ్ర - విశాఖసిటీ : అంతర్జాతీయ హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ విశాఖపట్నంలోని అరకులో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర పర్యాటక, యువజన సంక్షేమ శాఖా కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన తొలి బెలూన్ ఫెస్టివల్ విజయవంతం కావడంతో రెండవసారి నిర్వహిస్తున్నట్టు బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రకృతి సౌందర్యం గల ఎత్తైన కొండలు, లోయలు, పచ్చదనంతో నిండిన ప్రదేశాలు చాలా ఎత్తు నుంచి చూసే అవకాశం ఈ ఫెస్టివల్ వల్ల కలుగుతుందన్నారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రధానంగా నిర్వహిస్తున్న ఈ ఫెస్టివల్ ప్యాకేజీలకోసం ఇప్పటికే ఆన్‌లైన్‌లో 2500 మంది నిరీక్షిస్తున్నారన్నారు. ఇండియా, బ్రెజిల్, స్లోవేకియా, ఇటలీ, యూకే, థాయ్‌లాండ్, ఫ్రాన్స్, స్పెయిన్, మలేషియా, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా సహా పలు దేశాలకు చెందిన 20 హాట్ ఎయిర్ బెలూన్లు ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నాయన్నారు. మేఘాలు స్పష్టంగా కన్పించే సూర్యోదయ సమయాలలో బెలూన్‌లు గాలిలోకి పంపడంతో తొలిరోజు ఫెస్టివల్ ప్రారంభిస్తామన్నారు. అంతర్జాతీయ బెలూనిస్టులు అరకులోని పలు ప్రదేశాలను సందర్శిస్తారన్నారు.

కాస్మెటిక్ చార్జీలు
ఇక విద్యార్థుల ఖాతాల్లోకే..

- వసతిగృహాలలో అవినీతి ఆరోపణలకు అడ్డుకట్ట
- 75శాతం హాజరు పరిగణనలోకి



విశాలాంధ్ర - జామి : విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలను అందించడంలో ఇకపై ప్రభుత్వం నూతన విధానాన్ని అవలంబించనుంది. వసతిగృహాల వార్డెన్ల ద్వారా అందజేసే విధానంలో అవినీతి ఆరోపణలు వస్తుండడంతో ప్రభుత్వం తాజాగా కాస్మెటిక్ చార్జీల చెల్లింపులో కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నగదును నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాలలో వేయాలని నిర్ణయించి ఈ మేరకు సంక్షేమశాఖ ఉత్తర్వులు కూడా జారీ చేసింది.

సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు అందించే కాస్మెటిక్ చార్జీలు ఇకపై విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు జమకానున్నాయి. ఇప్పటికే ఆరు నెలలుగా విద్యార్థులకు ఇవ్వాల్సిన నగదు చెల్లింపులను బ్యాంకుఖాతాల ద్వారా ప్రభుత్వం చెల్లించనుంది. కానీ వసతిగృహాలలో విద్యార్థులకు 75శాతం కనీస హాజరు వుండాలి. విద్యార్థులకు ఇప్పటికే వసతిగృహాలలో బయోమెట్రిక్‌ను అమలు చేశారు. దీనిపై ఆన్‌లైన్ ద్వారా విద్యార్థుల హాజరును తెలుసుకుని నగదు చెల్లింపులు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీఅయ్యాయి. ప్రస్తుతం వసతి గృహాలలో కాస్మెటిక్ చార్జీల చెల్లింపులో దుర్వినియోగం జరుగుతున్నదని, విద్యార్థులకు సగం కూడా అందడం లేదనే ఆరోపణలు రావడంతో సంక్షేమశాఖ ఈ నిర్ణయాన్ని తీసుకుంది. అయితే గత ఆరునెలలుగా కాస్మెటిక్ చార్జీలు అందకపోవడంతో విద్యార్థులు అనేక ఆరోగ్యపరమైన సమస్యలతో ఇబ్బందులు పడ్డారు.

ప్రస్తుతం విజయనగరం జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 37 వసతిగృహాలలో 3400 మంది విద్యార్థులు చదువుతున్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 61 వసతిగృహాలు ఉండగా వాటిలో 5,314 మంది విద్యార్థులు ఉన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పలు వసతిగృహాలలో మరికొంతమంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థినులకు సబ్బులు, కొబ్బరినూనె, బొట్టు బిళ్లలు, పౌడర్ వంటి సామగ్రి కొనుగోలు చేయడానికి ఒక్కొక్కరికీ రూ.235 నుంచి 285 వరకు కాస్మోటిక్ చార్జీలు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం బ్యాంకు ఖాతాలు లేని వారికి వెంటనే తెరవాలని సంక్షేమశాఖ అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

నిధులు పుష్కలం..

విద్యార్థులకు చెల్లించాల్సిన నిధులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కేటాయించింది. ఇప్పటికే ఆయాశాఖలకు నిధులను విడుదల చేసింది. పంపిణీ విషయంలో జాప్యం చేస్తుండడంపై విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. విద్యార్థినులకు తగిన సబ్బులు, ఇతర వస్తువులు లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్నారని చెబుతున్నారు. ఇవేవీ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థినులు వసతిగృహాలలో మురికి దుస్తులతో ఉంటున్నారని, వీటిని చూసి తల్లిదండ్రులే వారికి అవసరమైన వస్తువులను కొని ఇవ్వాల్సి వస్తోందని పలుచోట్ల ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. అయితే కొత్తవిధానంలో ఎటువంటి జాప్యం ఉండదని, నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని ఆ శాఖ రాష్ట్ర అధికారులు చెబుతున్నారు.



మట్టిపెళ్లలు పడి ఇద్దరు మృతి

విశాలాంధ్ర - పెనుకొండ : మట్టిపెళ్లలు పడి ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం అనంతపురంజిల్లా పెనుకొండలో మండలపరిధిలోని మరువపల్లి గ్రామంలో జరిగింది. దుద్దేబండ గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, ఈడిగ వెంకటేశు , నాగభూషణం మరువపల్లి గ్రామ సమీపంలోని చెరువులో మట్టి తోడుతుండగా మట్టి దిబ్బలు విరిగి మీదపడి వెంకటరెడ్డి (28) వెంకటేశు (35) అక్కడికక్కడే మృతిచెందగా నాగభూషణంకు తీవ్ర గాయాలయ్యాయి. నాగభూషణంను వెంటనే పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ జనార్దన్ ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, దీనిపై పలుమార్లు తహశీల్దార్ హసీనా సుల్తానాకు విన్నవించినా ప్రయోజనంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పార్థసారథి పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాలను సందర్శించారు. చంద్రన్న బీమా క్రింద రూ.5లక్షలు. టీడీపీ ద్వారా రూ.2లక్షలు ఒక్కొక్క కుటుంబానికి అందిస్తామన్నారు. తక్షణ సాయం కింద రూ.5వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేశవయ్య, వైస్ ఎంపీపీ సిద్దయ్య, తెలుగుదేశం నాయకురాలు సవితమ్మ, ఆంజనేయులు, సుబ్బారెడ్డి, వెంకటేశులు, శ్రీనివాసులు, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సీట్లకు పెద్దల పట్టు ?

ఎంపీ స్థానాలకు ససేమిరా


అశోక్ గజపతిరాజు


బొత్స సత్యనారాయణ

విశాలాంధ్రబ్యూరో - విజయనగరం : ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎవరి స్థానాలను వారు పదిలం చేసుకొనేందుకు ప్రధాన పార్టీల నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికల్లో ఎలాంటి రిస్కు తీసుకునేందుకు ఇష్టపడటంలేదు. దీంతో అసెంబ్లీ స్థానాలపై ఆశలు పెట్టుకున్న నాయకులు అయోమయంలో ఉన్నారు. కీలక నాయకులు అసెంబ్లీవైపే మక్కువ చూపుతుండటంతో, అధిష్టానం కూడా ఇప్పుడు డైలమాలో పడింది. విజయనగరం జిల్లా పేరు చెబితే గుర్తుకువచ్చే ప్రస్తుత రాజకీయ నేతల్లో అశోక్ గజపతిరాజు, బొత్స సత్యనారాయణలది మొదటి వరుస. ఇలాంటి ఈ ఇద్దరూ వచ్చే ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేస్తారన్నది ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. అధిష్ఠానం ఆలోచన ఒకలా ఉండగా, వీరిద్దరి ఆలోచనా మరోలా ఉండటమే ఈ చర్చకు కారణమ య్యింది. అశోక్‌గజపతిరాజు ప్రస్తుతం విజయ నగరం పార్లమెంటు స్థానానికి ప్రాతినిధ్యం వహి స్తున్న విషయం తెలిసిందే. గత ఎన్నికల్లో ఎంపీగా ఘనవిజయం సాధించిన అశోక్‌కు ఈసారి పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. దీంతో ఆయన విజయనగరం అసెంబ్లీ స్థానంపై దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఇదే అసెంబ్లీ స్థానం నుంచి అశోక్ గజపతి రాజు గతంలో ఏడుసార్లు ఎంఎల్‌ఏగా గెలుపొందారు. విజయనగరం రాజవంశీయుడుగా, జిల్లా కేంద్రంలోని ప్రజల హృదయాల్లో ఆయనకు ఎంతో గౌరవం ఉంది. దీంతో తనకు గట్టి పట్టున్న విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి ఈ సారి పోటీచేయడానికి అశోక్‌గజపతిరాజు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ పరిణామాలు ప్రస్తుత ఎంఎల్‌ఏ మీసాల గీతకు ఆందోళన కలిగిస్తున్నాయి. అశోక్‌గజపతి విజయనగరం అసెంబ్లీ స్థానం కోరితే, ఆమె ఖాళీ చేయక తప్పదు. అయితే అశోక్‌గజపతిరాజును మళ్లీ ఎంపీ స్థానం నుంచే పోటీచేయించాలా లేదా అసెంబ్లీ బరిలో దించాలా అన్న అంశాన్ని పార్టీ అధిష్టానం ఇంకా తేల్చుకోలేకపోతోంది. విజయనగరం అసెంబ్లీ స్థానంలో వైసీపీ తరఫున బలమైన అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి బరిలోకి దిగనున్నారు. ఇప్పుడు ఇదే పార్టీకి చిక్కు సమస్యగా మారింది.

జిల్లాకు చెందిన మరో ముఖ్యనేత బొత్స సత్యనారాయణ పరిస్థితి కూడా ఇంతే. ఆయన గతంలో ప్రాతినిధ్యం వహించిన చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచే పోటీ చేసేందుకు రంగాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఇక్కడ బొత్స పోటీ చేస్తే విజయం ఖాయమన్న అభిప్రాయం అధికార పార్టీ నుంచి కూడా వినిపిస్తోంది. అయితే ఈ స్థానంపై ఆశలు పెట్టుకున్న స్థానిక నాయకుడు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ బెల్లాన చంద్రశేఖరరావు పరిస్థితి ఏమిటన్న ప్రశ్న వేధిస్తోంది. ఈ నేపథ్యంలో బొత్సను విజయనగరం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయించేందుకు పార్టీ అధిష్ఠానం శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఎంపీ స్థానంలో బొత్స పోటీచేస్తే సామాజిక వర్గం కలిసిరావడంతోపాటు, ఆ స్థానం పరిధిలోని మిగిలిన ఎంఎల్‌ఏ అభ్యర్థులకు కూడా లాభిస్తుందని పార్టీ భావన. కానీ సత్తిబాబు మాత్రం తనకు చీపురుపల్లి స్థానాన్నే కేటాయించాలని పట్టుబడుతున్నారు. ఎంపీ స్థానంలో ఎవరినైనా పోటీకి పెట్టుకోవాలని, నిర్ణయాన్ని అధిష్ఠానానికే వదిలేశారు. దీంతో ఇప్పుడు జగన్ పార్టీకి ఇదొక ప్రధాన సమస్యగా మారింది. ఆ పార్టీకి ఎంపీ స్థానం నుంచి పోటీచేయగల బలమైన నాయకుడు బొత్స కుటుంబం నుంచి మినహా మరొకరు లేకపోవడమే దీనికి కారణం. దీంతో బొత్స కోరికను మన్నించాలా, లేక బలవంతంగానైనా అతన్నే బరిలోకి దించాలా అన్న మీమాంసలో పడింది వైసీపీ. ఇలా పెద్ద నాయకులు సైతం అసెంబ్లీ స్థానాలవైపు చూస్తుండటంతో, ఇప్పుడి ప్పుడే ఎదుగుతున్న చిన్న నాయకుల ఆశలకు బ్రేక్ పడుతోంది.

క్లాత్ షోరూమ్‌లో అగ్నిప్రమాదం

రూ. 88 లక్షల ఆస్తి నష్టం


విద్యుత్ షార్ట్ షార్క్యూట్‌తో అగ్ని ప్రమాదానికి గురైన లైఫ్‌స్టైల్

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలోని గంగానమ్మ ఆలయ సెంటర్‌లో ఉన్న లైఫ్‌స్టైల్ రెడీమేడ్ క్లాత్ షోరూమ్‌లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. రూ. 70 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఫైర్ సిబ్బంది 6 గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. పై అంతస్తులో ఉన్న మరో దుకాణానికి సైతం మంటలు వ్యాపించడంతో మరో షాపు సైతం అగ్ని ప్రమాదానికి గురి కావాల్సి వచ్చింది. రెడీమేడ్ షోరూమ్‌లోని దుస్తులు కాలి బూడిదయ్యాయి. పండగ సీజన్ కావడంతో తన వ్యాపారం బూడిదలో పోసిన పన్నీరుగా మారిందని లైఫ్‌స్టైల్ యజమాని మురళి ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న, మొన్నటిదాకా వినియోగదారులతో కళకళలాడిన దుకాణం ఒక్కసారిగా కాలి బూడిద కావడంతో మురళి కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరం కాలేకపోయింది. లైఫ్‌స్టైల్ షోరూమ్ పై అంతస్తులో నాగదేవి జెంట్స్‌వేర్ గోడౌన్, దాని పక్కనే దుర్గాక్లాత్ షోరూమ్ గోడౌన్స్ ఉన్నాయి. నాగదేవి జెంట్స్ వేర్ గోడౌన్‌లో రూ. 8లక్షల విలువ చేసే సరకుతో పాటు దుర్గా క్లాత్ షోరూమ్‌కు చెందిన రూ. 10లక్షల విలువ చేసే సరకు పూర్తిగా కాలిపోయినట్లు చెబుతున్నారు. వస్త్ర దుకాణంలో మంటలు వ్యాపించాయని అర్ధరాత్రి ఆ నోటా ఈ నోటా పాకడంతో ప్రజలు భారీగా తరలివచ్చారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించారని, మంటలను అరికట్టడంలో బుధవారం తెల్లవారుజాము వరకు శ్రమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాద విషయాన్ని తెలుసుకున్న విద్యుత్‌శాఖాధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. బుధవారం విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ఎడ్ల బండలాగుడు పోటీల్లో
కృష్ణాజిల్లా హవా

విశాలాంధ్ర - గుడివాడ : ఎన్టీఆర్ టు వైఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా గుడివాడ రూరల్ మండలం, లింగవరంలోని కె.కన్వెన్షన్‌లో గత అయిదు రోజులుగా జరుగుతున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శనలు విజయవంతంగా ముగిశాయి. బండలాగుడు పోటీలలో సీనియర్స్ విభాగంలో ఇందిరాపుడ్స్ మండవ వెంకటరత్నం, గుణదలకు చెందిన ఎడ్ల జత 3190.4 అడుగుల దూరాన్ని లాగి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకోగా, గన్నవరం, నంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్, కాసరనేని పావనా చౌదరి, గగనా చౌదరికు చెందిన ఎడ్ల జత 3137 అడుగుల దూరం లాగి ద్వితీయస్థానం, నంది బ్రీడింగ్ రామలింగేశ్వర స్వామి పోతురెడ్డిపల్లి, నంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్, కాసరనేని పావనా చౌదరి, గగనా చౌదరి, యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్యలకు చెందిన ఎడ్ల జతలు 2880.9 అడుగుల దూరంతో తృతీయస్థానాన్ని కైవసం చేసుకున్నాయి. టీఎస్ఆర్ ఇన్‌ఫ్రా, తోట శ్రీనివాసరావు (కొప్పురావూరు, గుంటూరు జిల్లా) ఎడ్ల జత 2435.9 అడుగుల దూరంతో నాల్గవ స్థానం, ఘంటసాలకు చెందిన నవనీత కృష్ణ ఎడ్ల జత 2403.2 అడుగుల దూరంతో అయిదవ స్థానం, గుంటూరు, నవులూరుకు చెందిన శ్రీనివాసరావు ఎడ్ల జత 2400.2 అడుగుల దూరంతో 6వ స్థానం, ఇందిరాఫుడ్స్ మండవ వెంకటరత్నం, గుణదల కు చెందిన ఎడ్ల జత 2291.6 అడుగుల దూరంతో 7వ స్థానం, పిచ్చేశ్వరరావు, మొవ్వకు చెందిన ఎడ్ల జత 2100 అడుగుల దూరంతో 8వ స్థానం, గుంటూరు, కాకుమాను మండలం సాయి బుల్స్ దాసరి నారాయణ రావు, గొట్టుముక్కల రాంబాబు సీతారాంపురం ఎడ్ల 1990.4 అడుగుల దూరంతో 9వ స్థానాల్లో నిలిచాయి.

పేదోడి గూడు గోడు

- విశాఖలో పురోగతి లేని ఇళ్ల నిర్మాణం
- అయిదేళ్లలో ఒక్క గృహం పూర్తి చేయలేని అధికారులు
- 7,102 మంది లబ్ధిదారులకు కాగితాల్లో కేటాయింపులు
- బ్యాంకు రుణం ఇప్పించడంలోనూ వైఫల్యమే

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : స్థలాలు లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో విఫలమయ్యాయి. మరో రెండు నెలల్లో ప్రభుత్వాల పదవీ కాలం ముగుస్తున్నా మహా విశాఖ నగరంలో ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేకపోయారు. 14 వేల మంది దరఖాస్తుదారుల నుంచి లబ్ధిదారుని వాటాగా దాదాపు రూ.35 కోట్లను జీవీఎంసీ వసూలు చేసింది. వీరిలో 7,102 మందికి మాత్రమే కాగితాల్లో కేటాయింపులు చేశారు. నేటికీ ఒక్క ఇల్లు కూడా లబ్ధిదారునికి అప్పగించలేదు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇళ్లు అప్పగిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ ఎన్నికల కోడ్ అమల్లోకి రానుండటంతో దానిపైనా అనుమానాలు నెలకొన్నాయి.

ఇంకా 260 ఎకరాలు ఎక్కడ..

జీవీఎంసీకి 2015 నుంచి 2019వ సంవత్సరం వరకు కేంద్ర ప్రభుత్వం 56 వేల పీఎంఏవై గృహాలు మంజూరు చేసింది. ఎకరం భూమిలో వంద ఇళ్ల చొప్పున 560 ఎకరాల స్థలం అవసరం ఉంది. నేటికీ 300 ఎకరాలను మాత్రమే ప్రభుత్వం టిడ్కోకు అప్పగించింది. ఇంకా 260 ఎకరాలు కేటాయించాల్సి ఉంది. మదుపాక, ట్రై జంక్షన్, పరదేశిపాలెంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూముల సేకరణకు ఇటీవల జీవో జారీ చేసింది. అయితే కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలను పూర్తిచేయలేకపోయారు.

27 వేల గృహాల నిర్మాణాలు ప్రారంభ దశలో ఉన్నాయని, సత్యనారాయణపురం, రాతి చెరువు, పరవాడ, అగనం పూడిలో మూడు వేల ఇళ్లు ఫిబ్రవరిలో అందుబాటులోకి వస్తాయని జీవీఎంసీ యూసీడీ అధికారులు చెబుతున్నారు. ఇల్లు లేని పేదలంతా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని 2015లో ప్రభుత్వం ప్రకటించడంతో జీవీఎంసీ పరిధిలో 2.5 లక్షల మంది దరఖాస్తు చేశారు. ఇళ్ల నిర్మాణంలోనే కాక బ్యాంకు రుణం ఇప్పించడంలోనూ పురోగతి లేదు. నేటికీ 2,380 మంది రుణపత్రాలు సమర్పించగా 166 మందికి మంజూరు అయ్యింది.

ఇదీ విశాఖ పక్కా ఇళ్ల పురో'గతి'

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సంఖ్య	2.5 లక్షలు
అయిదేళ్లలో మంజూరుచేసిన గృహాలు	56 వేలు
గుర్తించిన లబ్ధిదారుల సంఖ్య	18,435
లబ్ధిదారుని వాటా చెల్లించిన వారు	13,931
గృహాల కేటాయింపు పొందిన వారు	7,102
బ్యాంకు రుణాలకు పత్రాలిచ్చిన వారు	2,380
రుణం మంజూరైన వారు	166
ఇళ్లు అప్పగించిన వారి సంఖ్య	0

బీజేపీ సినిమాలు తీస్తోంది : అహ్మద్‌పటేల్

న్యూఢిల్లీ : బీజేపీ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపెట్టుకునేందుకు సినిమాలను రూపొందించి, వాటికి అవార్డులు ప్రకటిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అహ్మద్‌పటేల్ విమర్శించారు. ప్రధాని మోడీ ఫిలిప్ కోట్లెర్ అధ్యక్ష అవార్డును అందుకున్న నేపథ్యంలో, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, జ్యూరీ లేని, ఇంతకుముందు ఎవరికీ తెలియని, ప్రదానం చేయని అవార్డును అందుకున్నందుకు అభినందనలు తెలుపుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎద్దేవా చేసిన రెండో రోజు పటేల్ ఈ విమర్శను చేశారు. వైఫల్యాలను కప్పిపెట్టుకునేందుకే సొంతంగా సినిమా రూపొందించి, సొంత అవార్డులు ఇస్తున్నారని పటేల్ ట్వీట్ చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పాత్రలో అనుపమ ఖేర్ నటించిన 'యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' సినిమాతో కాంగ్రెస్‌పై బీజేపీ బురద చల్లుతోందన్నారు. తప్పుడు గణాంకాలతో దేశంలో అర్థికాభివృద్ధి జరిగిందని రోజీ సినిమాను సమర్పించడంపై ఆయన మండిపడ్డారు.

కర్ణాటక రాజకీయ గందరగోళంపై

యువజన కాంగ్రెస్ నిరసన

న్యూఢిల్లీ / గురుగావ్ : కర్ణాటకలో జేడీఎస్-కాంగ్రెస్ కూటమిలోని ప్రభుత్వాన్ని కూలదోచే ప్రయత్నానికి వ్యతిరేకంగా యువకాంగ్రెస్ కార్యకర్తలు నిరసన అందోళన నిర్వహించారు. హర్యానాలో కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యేలు ప్రచారం చేయడానికి నిరసనగా వారు బస చేస్తున్న ఐదునక్షత్రాల హోటల్ ఐటీసీ గ్రాండ్ భారత్ ఎదురుగా వారు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. హర్యానా ప్రదేశ్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రదీప్ సింఘ్ వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ రాజ్యాంగాన్ని అగౌరవపరుస్తూ, ప్రజాస్వామ్యాన్ని హత్యచేస్తోందన్నారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బీజేపీ అధిష్ఠానం అంగీకరించిందని, దీంతో ఆ రాష్ట్రంలో 104 మంది బీజేపీ ఎమ్మెల్యేలు తిష్టవేశారన్నారు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఏడునెలల జేడీఎస్-కాంగ్రెస్ కూటమికి మద్దతు ఉపసంహరించు కోవడంతో రాజకీయ సంక్షోభం ఏర్పడిందని ఆరోపించారు. యడ్యూరప్ప అక్కడి ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు విఫల ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కుమారస్వామికి 120 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది. 224 సీట్లు గల అసెంబ్లీలో స్పీకరు కాకుండా బీజేపీకి 104, కాంగ్రెస్‌కు 79, జేడీఎస్ 37, బీఎస్పీ, కేపీజేపీ, స్వతంత్ర అభ్యర్థులు ఒక్కొక్కరు ఉన్నారు.



కేంద్రం నిర్లక్ష్యం

- కరవు పరిహారం కోసం అన్నదాత ఎదురుచూపు
- ఖరీఫ్‌లో కరవు విలయతాండవం
- రూ.1,870 కోట్లు ఇవ్వాలని నివేదిక
- మూడునెలలైనా పట్టించుకోని వైనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కరవు పరిహారం కోసం రైతన్న కోటి ఆశలతో ఎదురుచూస్తున్నాడు. గత ఖరీఫ్ సీజన్‌లో తీవ్రవర్షాభావం వలన రాష్ట్రంలో తొమ్మిదిమండలాల్లో కరవు తాండవించింది. నాటిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతన్న తీవ్రంగా నష్టపోయాడు. వీటి నివేదికలు పంపి మూడునెలలైనా పరిహారం విడుదల కాలేదు. కరవు మండలాల పరిహారం విడుదలపై కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో గత ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావం నెలకొంది. నైరుతి రుతుపవనాలు కరుణించకపోవడం వలన వర్షాలు ముఖం చాటేశాయి. దీనివలన కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విజయనగరం జిల్లాల్లో వర్షపాతం మైనస్‌కు పడిపోయింది. దీంతో నాటిన విత్తనాలు మొలకెత్తలేదు. మొలకెత్తిన మొక్కలు బతకలేదు. పొలాలు బీడుబారిపోయాయి. దీంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగి కరవు మండలాల గుర్తింపు క్రతువు ఆరంభించింది. మూడు పర్యాయాలు కరవు మండలాలను ప్రకటించింది. మొత్తం 347 మండలాలుగా తేల్చింది. దీనికి సంబంధించి రూ.1,870కోట్లు పరిహారం ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం నివేదించింది. నివేదికలు వెళ్లి మూడునెలలు గడుస్తున్నప్పటికీ చిల్లిగవ్వకూడా పరిహారం విడుదల కాలేదు. దీంతో అన్నదాత విలవిలలాడి పోతున్నాడు. కనీసం సంక్రాంతి పండుగకైనా నిధులు విడుదల అవుతాయని రైతన్న ఎంతో ఆశగా ఎదురు చూశాడు. కానీ నిరాశే మిగిలింది. సంతోషంగా సంక్రాంతి పండుగ చేసుకోలేకపోయాడు. రాయలసీమలో అరకొర వేసిన వేరుశనగ పంట సాగునీరులేక ఎండిపోయింది. దీంతో రైతన్న లబోదిబోమంటున్నాడు. అక్టోబరులో రాష్ట్రంలోకి ప్రవేశించిన ఈశాన్య రుతుపవనాల వలన ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో రైతన్నకు ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. ఒకవైపు ఖరీఫ్‌లో కరవు తాండవించింది. మరొకవైపు రబీలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతన్న వరుణుడు కరుణ కోసం ఎదురు చూస్తున్నాడు.

కరవుతో తగ్గిన సాగు విస్తీర్ణం

కరవుతో గత ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఖరీఫ్ సీజన్‌లో 39.53లక్షల హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా 35 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. ప్రధానంగా కరవు తాండవించిన తొమ్మిది జిల్లాల్లో సాగు విస్తీర్ణం పడిపోయింది. దిగుబడులు తగ్గాయి. ధాన్యం, అపరాలు, వాణిజ్యపంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులను సాధించలేకపోతున్నాయి.

రబీలో ముందుకు సాగని సాగుపనులు

ఈ రబీ సీజన్‌లో పంటల సాగు ఆశించినస్థాయిలో ముందుకు సాగడంలేదు. రబీ సాగు లక్ష్యం 23.43లక్షల హెక్టార్లుకాగా ఇప్పటివరకు 16.84లక్షల హెక్టార్లలో మాత్రమే సాగు పనులు చేయగలిగారు. సాగునీటి వనరులు లేకపోవడం వలన రబీ సాగు చేయలేకపోతున్నారు. ప్రధానంగా వరిసాగు ముందుకు కదలడం లేదు. రిజర్వాయర్లలో ఆశించినస్థాయిలో నీటిమట్టం లేకపోవడం వలన నీటిని విడుదల చేయలేదు. దీంతో రబీలో వరిసాగు కష్టసాధ్యం అవుతుంది. వర్షాభావం వలన రబీ సీజన్‌లోనూ కరవుఛాయలు కనిపిస్తున్నాయి.

పరిహారం విడుదలపై కేంద్రం అలసత్వం

కరవు మండలాల పరిహారం విడుదలపై కేంద్రప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంది. నివేదికలు పంపిన తర్వాత ప్రభుత్వ ఉన్నతాధికారులు పలుమార్లు కేంద్రాన్ని సంప్రదించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుంది. కరవు నిధులు త్వరలో విడుదల చేస్తామని కాలయాపన చేస్తుంది. దీంతో అన్నదాత గగ్గోలు పెడుతున్నాడు.

నాటక విజ్ఞాన సర్వజ్ఞుడు

మొదలి నాగభూషణశర్మ మృతి

విశాలాంధ్ర-తెనాలి : నాటక విజ్ఞాన సర్వజ్ఞుడు, నాటక విశ్వవిద్యాలయం ఆచార్య మొదిలి నాగభూషణశర్మ (84) మంగళవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యశర్మ, కామేశ్వరమ్మ. 1935జులై 24న జన్మించారు. తండ్రి వద్దనే ప్రాథమిక విద్య, రంగస్థల ప్రవేశం జరిగింది. ఉస్మానియా, వెస్టన్ ఇల్లినాయిస్‌లలో అభ్యశించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్లశాఖోపన్యాసకులుగా పని చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నాటక విభాగంలో 18 ఏళ్లు పని చేశారు. పలు విశ్వవిద్యాలయాలకు, నాటక కళలశాఖలకు పాఠ్యాంశ నిర్ణీయక కమిటీ అధ్యక్షులుగా వ్యవహరించారు. వీలునామా, రాజదండం. కలకాపురం. తదితర నాటికలను రచించారు. స్వీయశక్తిని, అభినివేశాన్ని అనుభవాలను భూమికలుగా చేసుకొని గొప్ప గ్రంథాలు రచించారు. విశ్వవిఖ్యాత నటుడు బళ్ళారి రాఘవ ప్రిన్స్ ఆఫ్ ప్లేయర్స్ అనే గ్రంథాన్ని రాశారు. తెలుగు థియేటర్ అండ్ ఆచార్య ఆత్రేయ అనే గ్రంథాన్ని వెలువరించారు. ఎ డైరెక్టరీ ఆఫ్ థియేటర్ టరమ్స్ (నాటక రంగ పరిభాషిక పదకోశం) నిఘంటువు రూపొందించారు. నాటక కీర్తక చిలకమర్తి అనే గ్రంథాన్ని రచించారు. రంగస్థల శాస్త్రం పాఠ్యగ్రంథం, నాటక శిల్పం సీడీలను కూడా రూపొందించారు. కళ్యాణం రఘురామయ్య ధర్మవరం రామకృష్ణాచార్యులు, లాంటి మహోన్నత నటుల గురించి రచించి నాటక రంగంగానికి మహోపకారం చేశారు. కె.చిరంజీవి రాసిన నాటకాలను ఇంగ్లీషులోకి అనువదించి ఇతర దేశాలలో కూడా ప్రదర్శించారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 11రత్న పురస్కారాన్ని పొందారు. 2013లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నందమూరి తారకరామారావు రంగస్థల పురస్కారం, 2018లో కళారత్న పురస్కారాలను అందుకున్నారు. ప్రతిభా మూర్తి పురస్కారం, విజయనగరం సాహితీ సమాఖ్య వారి గురజాడ, 1955లో తానా పురస్కారాలు అందుకున్నారు. రాష్ట్ర రాష్ట్రేతర జీవన సాఫల్య పురస్కారం లాంటివి వందలాది బిరుదులందుకున్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ సభ్యుడిగా వందలాది పదవులను నిర్వహించారు. అమెరికా, రష్యా ఫ్రాన్స్, జపాన్, గ్రీస్, టర్కీ దేశాల నాటకోత్సవాల్లో పాల్గొన్నారు. జాతీయ సదస్సుల్లో 30కిపైగా కీలకోపన్యాసాలు చేశారు. తెలుగు నాటక రంగంలో హాస్యం అనే అంశంపై 60 నాటకాలను విశ్లేషిస్తూ ఆకాశ వాణిలో 3గంటలు వాఖ్యానించారు. జానపద కళాభారతికి లాగా జ్ఞానపథాన్ని ఆవిష్కరించే తూర్పు వాకిళ్ళ జానపదాలు పల్లీయుల ఆచార్య వ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాల గుండె చప్పుళ్ళు, జానపద కళారూపాలను అద్భుత గ్రంథంగా రాశారు. తోలు బొమ్మల ఆటలపై వ్యాసాలు రాసి వారి సంక్షేమానికి విశేష కృషి చేశారు. నృత్య రత్నావళికి పరిశోధన చేశారు. నాట్య రీతులు నిలువెత్తు దర్పణాలుగా నిలిచాయి. సంస్కృతి, కన్నడ, హిందీ, మరాఠీ నాటకాలను అనువదించి ఆ నాటక శైలులను సస్పష్ట పరిచయం చేశారు.

ఆయన భౌతికకాయాన్ని నాటక రంగ అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, మీసాల భాస్కర్, నాగళ్ళ దుర్గాప్రసాద్, సినీ నటుడు దీక్షిత్, బొల్లిముంత కృష్ణ, గోగినేని కేశవరావు, చెరుకుమల్లి సింగారావు, పలువురు కళాకారులు సందర్శించి నివాళులర్పించారు.



మొదలి నాగభూషణశర్మకు నివాళులర్పిస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్‌లో) మొదలి నాగభూణశర్మ (ఫైల్‌ఫోటో)

నాట్యలోకానికి తీరని లోటు

విశాలాంధ్ర-కూచిపూడి: ప్రజా నాట్య, నాటక విమర్శకులు, గొప్ప ఆంగ్ల సాహితీవేత్త ఆచార్య మొదలి నాగభూషణ శర్మ మృతి నాట్య లోకానికి తీరని లోటు అని అఖిల భారత కూచిపూడి నాట్య కళా మండలి కార్యదర్శి, కృష్ణా విశ్వవిద్యాలయం కూచిపూడి నాట్య క్యాంపస్ కోఆర్డినేటర్ పసుమర్తి కేశవప్రసాద్ అన్నారు. తెనాలిలోని ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో మంగళవారం రాత్రి చనిపోయిన ఆయన భౌతికకాయాన్ని బుధవారం సందర్శించి నివాళులర్పించారు. ప్రస్తుతం కృష్ణా విశ్వ విద్యాలయంలోని కూచిపూడి నాట్య బోధనకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ కూచిపూడి క్యాంపస్‌లో ఎంఏ విద్యార్థినీ విద్యార్థులకు నాట్యంలోని పలు అంశాలపై తర్ఫీదు నిస్తున్నారు. కూచిపూడి నాట్యాన్ని అలనాటి నాట్యాచార్యులు 'కులపతి' భాగవతుల రామకోటయ్య వద్ద హైదరాబాద్‌లో శిక్షణ పొందారని, దశాబ్దాల తరబడి కూచిపూడికి ఆయనకు అవినాభావ సంబంధాలున్నాయని తెలిపారు. శాస్త్రీయ నాట్యరీతులపై ఆయన ఇచ్చిన తర్ఫీదు తమ కెంతో ఉపయోగకరమంటూ ఎం.ఏ. విద్యార్థులు సీహెచ్ కృష్ణప్రియ, సౌజన్య, నిఖిత, కాలీషా బేగం, వల్లి సంతాపం తెలిపారు.

బెస్ట్ యూనియన్ సమ్మె విరమణ

ముంబై : బృహన్న ముంబై ఎలక్ట్రిసిటీ అండ్ ట్రాన్స్‌పోర్టు (బెస్ట్) ఆధ్వర్యంలోని వర్కర్స్ చేపట్టిన సమ్మెను విరమించడానికి అంగీకరించారు. 10 దశల్లో జీతాలు పెంచడానికి ప్రభుత్వం సంసిద్ధత వెలిబుచ్చడంతో వారు ఈ నిర్ణయానికి వచ్చారు. జీతాల పెంపుదల, బెస్ట్‌ను బృహన్న ముంబై కార్పొరేషన్‌లో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్లతోజనవరి 8 నుంచి సుమారు 32 వేల మంది బెస్ట్ వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హైపవర్ కమిటీ ఏర్పాటు చేసింది. అయితే బెస్ట్‌వర్కర్ల యూనియన్ కౌన్సిల్ నీతా కర్ణిక్ బుధవారం మాట్లాడుతూ సమస్యలపై చర్చలకు స్వతంత్ర మధ్యవర్తికావాలన్నారు. హైకోర్టు జడ్జి అయితే బాగుంటుందన్నారు. చీఫ్ జడ్జి ఎస్‌హెచ్ పాటిల్, జస్టిస్ ఎస్ఎం జామ్‌దార్‌లతో కూడిన ధర్మాసనం అందుకు అంగీకరించింది. మూడు నెలల్లో చర్చలు జరిపి బెస్ట్, బీఎంసీ కార్మికులను విలీనం చేసి డిమాండ్లను పరిష్కరించాల్సి ఉంది. దీంతో సమ్మెను విరమించామని కర్ణిక్ ప్రకటించారు. మళ్లీ సమ్మె పరిస్థితులు తలెత్తకూడదని, ఏ ఒక్క బెస్ట్ కార్మికుడు ఈ జీతంతో బ్రతకడంతో కష్టమని చెప్పుకోకుండా ఉండేవిధంగా సమస్యను పరిష్కరించాలని చీఫ్ జస్టిస్ పాటిల్ కమిటీకి సూచించారు. బెస్ట్ కౌన్సిల్ ఎంపీ రావు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ 10 దశల్లో ఇంక్రిమెంట్లు ఇవ్వడానికి సిద్ధంగాఉందని తెలిపారు..

మావోయిస్టుల కోసం ఏరియల్ సర్వే

దుంకా : ఎన్‌కౌంటర్‌లో గాయపడిన మావోయిస్టులు పారిపోకుండా ఉండటానికి జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌ల్లో ఏరియల్ సర్వే ప్రారంభించామని పోలీసులు వెల్లడించారు. సీపీఐ (మావోయిస్టు) తలడ అలియాస్ షాడియోరాయ్ మంగళవారం చాత్‌పురాలో జరిగిన ఎన్‌కౌంటర్లో మృతిచెందాడన్నారు. ఆయనపై రూ.10 లక్షల బహుమానం ఉందని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. దుమ్కా ఎస్పీ వైఎస్ రమేష్, డీఐజీ రాజ్‌కుమార్ లక్రా డీఐజీ (ఎస్ఎస్‌బీ) సోమిత్ జోషిలు ఏరియల్ సర్వే జరిపి పారిపోయిన , గాయపడిన నక్సలైట్లను గుర్తించారన్నారు. అనుమానాస్పదంగా ఉన్న డ్రెయిన్లు, గుడిసెలను గుర్తించామని రమేష్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ప.బెంగాల్ ఇతర సరిహద్దు ప్రాంతాల ప్రభుత్వాలను అలర్ట్ చేశామన్నారు. లొంగిపోయి, ప్రజాజీవనంలో కలిసిపోవాలని ఆయన మావోయిస్టులకు పిలుపునిచ్చారు.

దుకాణంలో మారణాయుధాలు : యజమాని అరెస్టు

థానే : ఫ్యాషన్ ఉత్పత్తుల దుకాణంలో మారణాయుధాలు దాచి ఉంచడంతో యజమానిని అరెస్టు చేశారు. ఇందులో 170 ఆయుధాలు ఉన్నాయని, వాటిలో కత్తులు, కుక్రీస్ (గుర్ఖాకత్తి)లు లభించాయని బుధవారం పోలీసు అధికారులు తెలిపారు. పక్కా సమాచారం మేరకు అధికారులు డోంబివ్లి జిల్లాలోని తపస్య హౌస్ ఆఫ్ ఫ్యాషన్‌లో తనిఖీలు నిర్వహించగా ఈ విషయం వెలుగు చూసిందని థానే క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సంజు జాన్ తెలిపారు. 10 కత్తులు, 38 ప్రెస్ బటన్ కత్తులు, 25 చాపర్స్, 9 కుక్రిస్, 9 గుప్తిస్ (రంపపుకత్తులు) 5 చాకులు, 3 గొడ్డళ్లు, 1 కొడవలిని స్వాధీనం చేసుకుని, షాపు యజమాని ధనంజయ కులకర్ణి (49)ని అరెస్టు చేశామని జాన్ తెలిపారు. పంజాబ్ ,రాజస్థాన్, ముంబై క్రాఫోర్డ్ మార్కెట్ నుంచి వీటిని కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు. మంగళవారం కులకర్ణిని స్థానిక కోర్టులో హాజరు పరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించగా, దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్‌గా షీలాదీక్షిత్

న్యూఢిల్లీ : దేశరాజధానిలోని రాజ్‌భవన్‌కు పండుగ కళ వచ్చింది. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్‌గా షీలాదీక్షిత్ (80) చార్జ్ తీసుకోవడంతో పార్టీ వర్కర్లు, సీనియర్ లీడర్లతో కళకళలాడింది. 1984 సిక్కు అల్లర్లలో నిందితుడైన జగదీష్ టైట్లర్ ఈ వేడుకల్లో పాల్గొనడంతో వివాదం నెలకొంది.ఆమెతోపాటు దేవేందర్ యాదవ్, హరూన్ యూసఫ్, రాజేష్ లిలోతియాలు కూడా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. మాజీ ఢిల్లీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్‌ను పార్టీకార్యకర్తలు నినాదాలతో స్వాగతించారు. 2013లో జరిగిన ఎన్నికల్లో ఆమె ఓటమి చెందారు. ఢిల్లీ కాంగ్రెస్‌ను ఆమె ఉన్నతస్థితికి తీసుకు వెళతారని, క్షేత్రస్థాయిలో పార్టీ వర్కర్లను ఉజ్జీవింప చేసి, ఏడువ లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్ విజయపథాన నడుపుతానని షీలాదీక్షిత్ వెల్లడించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరణ్ సింగ్, జనార్థన్ ద్వివేదీ, మీరా కుమార్, పీసీ చాకో, సందీప్ దీక్షిత్, అజయ్ మాకెన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

గోవా ప్రజలకే ఉద్యోగాలు : మంత్రి

పనాజీ : గోవా పర్యాటక శాఖ మంత్రి మనోహర్ అజ్‌గోవాంకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో (ఘాటీలు)ఉచితంగా ఎవరూ ఉద్యోగాలు చేయనవసరం లేదని, గోవా ప్రజలకు ఉద్యోగాలు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. మహారాష్ట్ర నుంచి వలస వచ్చే ఘాటీలు బీచ్‌లను శుభ్రం చేస్తుంటారు. ఈ పదాన్ని ఎందుకు ఉపయోగించారన్న విలేకరుల ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఘాటీ పదం ఎవరినీ కించపరిచే పదంకాదని దానర్థం పర్వతాల్లో నివసించేవారన్నారు. ఉద్యోగాల్లో గోవా ప్రజలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. 2017లో కర్ణాటక సరిహద్దులోని నోమడిక్ గిరిజనులపై మండిపడుతూ వారంతా గోవా బీచ్‌లను అపరిశుభ్రం చేస్తున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ఆ తెగల నాయకులు ఆయనపై మండిపడిన విషయం తెలిసిందే.

కార్మికుడి కిడ్నాప్ : కాపాడిన పోలీసులు

జల్నా : నగదు విషయంలో వివాదం కారణంగా బందీగా పట్టుకెళ్లిన కార్మికుడిని పోలీసులు రక్షించి, కాంట్రాక్టర్ కుండ్లిక్ చవాన్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటన మహారాష్ట్రలో జరిగింది. బుల్దానా జిల్లాకు చెందిన నామ్‌దేవ్ జద్వా (45)ను డిసెంబరు 28న కిడ్నాప్ చేసి వాహనంలో తరలించారని పోలీసులు తెలిపారు. కొద్ది రోజుల తర్వాత చవాన్ జాదవ్ కుమారుడికి ఫోన్ చేసి చెరకు తోటల్లో పనిచేస్తానికి రూ. 5 లక్షలు తీసుకొని, పనిమానివేశాడని, ఆ మొత్తాన్ని చెల్లించి జాదవ్‌ను విడిపించుకు వెళ్లాలన్నాడు. దీంతో బాధితుడి కుమారుడు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కాంట్రాక్టర్ తరచూ నివాసాన్ని మార్చుతుండటంతో అతనిని పట్టుకోవడం కష్టంగా మారినప్పటికీ రెండు రోజుల క్రితం ఫోన్ కాల్‌ను బట్టి ఎక్కడున్నాడో గుర్తించి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

ఒక్కటవుదాం..

(మొదటిపేజీ తరువాయి)

అంశంపై జగన్‌తో చర్చించినట్లు సమాచారం. జగన్‌తో పాటు వైసీపీ తరపున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భేటీలో పాల్గొనగా, టీఆర్ఎస్ తరపున ఎంపీలు సంతోష్‌కుమార్, బి.వినోద్ కుమార్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శ్రవణ్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశం అనంతరం కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ ఫెడరల్ ఫ్రంట్ కోసం కేసీఆర్ జగన్‌తో ఫోన్‌లో మాట్లాడారని, జగన్ సానుకూలంగా స్పందించడంతో ఆయనను కలిసి అన్ని విషయాలు పంచుకున్నామన్నారు. తప్పకుండా ఒకే ఆలోచనాధోరణి ఉన్న నేతలందరూ ఒకే వేదికపైకి వస్తారని ఆశిస్తున్నామని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా ఉండే విధంగా జాతీయ రాజకీయాలు, రాజకీయ వ్యవస్థ ఉండాలన్న ఆలోచన ఉన్నవాళ్లు కలిసి వస్తారని తమకు విశ్వాసం ఉందన్నారు. త్వరలో ఏపీకి వెళ్లి అక్కడే జగన్‌తో కేసీఆర్ సంప్రదింపులు జరుపుతారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై ఇప్పటికే టీఆర్ఎస్ వైఖరిని స్పష్టం చేశామన్నారు. రెండు రాష్ట్రాల హక్కులపై కలిసి పని చేస్తామని కేటీఆర్ తెలిపారు.

కేసీఆర్ ప్రయత్నాలు హర్షణీయం : జగన్

జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాల హక్కుల కోసం ఫెడరల్ ఫ్రంట్ పేరిట కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలు హర్షణీయమని ప్రశంసించారు. కేసీఆర్ ఫోన్ చేసి చెప్పిన తర్వాత...కేటీఆర్ వచ్చి తనతో ఫెడరల్ ఫ్రంట్ అవసరం, రాష్ట్రాలకు కేంద్రం చేస్తున్న అన్యాయం, కేంద్రాన్ని ఎదుర్కోవాలంటే దేశవ్యాప్తంగా రాష్ట్రాలు ఏకం కావాల్సిన అవసరం గురించి చర్చించారన్నారు. ప్రత్యేక హోదా విషయమే పరిశీలిస్తే పార్లమెంటు వేదికగా ఇచ్చిన హామీకే దిక్కులేదని, హోదాపై తాము ఎంత పోరాడినా కేంద్రంలో కదలిక లేదన్నారు. ఏపీకి చెందిన 25 ఎంపీలకు తోడుగా తెలంగాణకు చెందిన 17 మంది ఎంపీలు కలిస్తే కేంద్రంపై మరింత ఒత్తిడి పెరుగుతుందన్నారు. రాష్ట్రాల హక్కులు సాధించుకోవడానికి రాష్ట్రాల తరపున మాట్లాడేవారి సంఖ్య పెరగాలని, రాష్ట్రాల ప్రయోజనాల కోసం కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. హోదా సాధనకు ఎంపీల సంఖ్య ఎక్కువగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇప్పుడు జరిగినవి ప్రాథమిక చర్చలు మాత్రమేనని, త్వరలోనే కేసీఆర్ కూడా వచ్చి కలుస్తామన్నారన్నారు. ఫెడరల్ ఫ్రంట్‌పై మరింతగా చర్చిస్తామని, కేటీఆర్‌తో చర్చల వివరాలను పార్టీలోనూ విస్తృతంగా చర్చిస్తామని జగన్ తెలిపారు.

జగన్ ఇంటిముందు ఇంటెలిజెన్స్ అధికారులు

ఇదిలా ఉండగా... జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముందు ఏపీ ఇంటెలిజెన్స్ అధికారులుగా భావిస్తున్న వ్యక్తులు హడావుడి చేశారు. జగన్ నివాసానికి వచ్చేవారి వివరాలు సేకరిస్తున్నారు. కేటీఆర్ బృందం జగన్‌తో సమావేశమైన సందర్భంగా ఏపీ ఇంటెలిజెన్స్ అధికారులు ఇక్కడ మోహరించినట్టుగా తెలుస్తోంది. ఈ వివరాలను వారు ఎప్పటికప్పుడు విజయవాడకు చేరవే స్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇంటెలిజెన్స్ అధికారులు చంద్రబాబు కోసం పనిచేశారనే ఆరోపణలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. తాజాగా ప్రతిపక్ష నేత ఇంటి వద్ద ఇంటెలిజెన్స్ అధికారులు సమాచార సేకరణ కోసం ఇలా హడావుడి చేయడం పలు అనుమానాలకు తావిచ్చేలా ఉంది.

బీజేపీ ఎన్ని కలవల...!

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నిస్తూనే ఉంది. నల్లధనాన్ని తిరిగి తెస్తామని, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తామని అప్పట్లో మోడీ హామీల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. ఈ హామీలు బీజేపీ సర్కారును వెంటాడుతూనే ఉన్నాయి. ఇదే అంశాన్ని కాంగ్రెస్ పలు సందర్భాల్లో ప్రస్తావించింది. పాలక పక్షాన్ని ఇరుకున పెట్టింది. తాజాగా పలువురి ఖాతాల్లో డబ్బు పడుతుండటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పేద, మధ్యతరగతి ఓటర్లకు ఇది బీజేపీ ఎన్నికల తాయిలమా అన్న అనుమానం రాకమానదు. పలువురి ఖాతాల్లో రెండుసార్లు డబ్బులు జమ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో డబ్బులు విత్‌డ్రా చేసేందుకు బ్యాంకుల వద్ద ప్రజలు బారులుదీరు తున్నారు. ఈ మూడు బ్యాంకులకు పశ్చిమ బెంగాల్ నుంచి డబ్బు సరఫరా జరిగినట్టు మీడియా నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో యూసీఓ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తూర్పు బర్ధామ్ జిల్లాలోని కేటుగ్రామ్ నం.2 పంచాయత్ సమితి, సిబ్లున్, బెలాన్, తోలాబరి, సెన్పాడా, అంబాల్‌గ్రామ్, నబ్‌గ్రామ్, గంగేటికురి ప్రాంతాల్లోని ఖాతాదారుల అకౌంట్లలో ఆకస్మికంగా రూ.10వేల నుంచి రూ.25వేల వరకు జమ అయినట్టు తెలుస్తోంది. డబ్బు జమ అయినట్లు సమాచారం దావానంలా ఖాతాదారులకు చేరింది. దీంతో ఆయా బ్యాంకులకు తాకిడి పెరిగింది. తమ ఖాతాలో డబ్బు జమ అయిందా లేదా తెలుసుకునేందుకు ఖాతాదారులు బ్యాంకుల వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఈ తాజా పరిణామం బ్యాంకర్లను సైతం గందరగోళానికి గురిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఆ డబ్బు ఎందుకు, ఎక్కడ నుంచి వస్తుందన్నది తెలియదుగానీ డిపాజిట్లు మాత్రం జరుగుతున్నాయని అంటున్నారు. ఎన్ఈఎఫ్‌టీ ద్వారా ఖాతాదారుల అకౌంట్లలోకి డబ్బు చేరుతున్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం తెలియరాలేదు.

ఇది నల్లధనమా..? : గుర్తుతెలియని వర్గాలు/వ్యక్తి ద్వారా తమ ఖాతాల్లోకి డబ్బు వస్తుండటంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నల్లధనాన్ని దేశానికి తిరిగి తీసుకొచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలోకి డబ్బులు జమ చేస్తానంటూ ఇచ్చిన హామీని మోడీ ప్రభుత్వం నిలబెట్టుకుంటున్నట్లుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వానికి కొంతమెప్పు లభిస్తోంది. స్థానిక నేతల్లో కొందరు కూడా మోడీ ప్రభుత్వమే డబ్బు జమ చేస్తోందని ప్రచారం చేస్తుండగా మరికొందరు ఎద్దేవా చేస్తున్నారు. ఏదిఏమైనా ప్రజల ఖాతాల్లోకి డబ్బు ఎక్కడ నుంచి వస్తుందన్న దానిపై సర్వత్రా సస్పెన్స్ నెలకొంది. ఈ గుట్టు త్వరలోనే రట్టు అవుతుందన్న అంచనా ఉంది. కాగా, ఈ విధంగా అజ్ఞాతమూలం నుంచి డబ్బు జమ అవుతుండటం హర్షించదగ్గ విషయం కాదు !

సాగనివ్వం

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొంటారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత కాలంలో స్వయం సమృద్ధిని సాధించేందుకు రక్షణ పరిశ్రమలను అభివృద్ధి చేశారు. అయితే ఈ పరిశ్రమలను ధ్వంసం చేసేందుకు ఇప్పటి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు వ్యతిరేకంగా ఈ సమ్మె జరగనున్నది. ఆయుధాల ఉత్పత్తి ఫ్యాక్టరీలలో 275 రకాలకుపైగా ఉత్పత్తులను ప్రభుత్వం నిలిపివేసి 'మేకిన్ ఇండియా' నినాదాన్ని అపహాస్యం పాలుచేసింది. ఐదు దశాబ్దాలకుపైగా కాలంలో ఈ ఫ్యాక్టరీలను ఆధునీకరించి అభివృద్ధి పరచారు. వీటన్నింటినీ ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రక్షణ లేబరేటరీలు అభివృద్ధిపరచిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రైవేటురంగానికి అప్పగించారు. దిగుమతి చేసుకున్న వాటితో సహా రక్షణ పరికరాలను మరమ్మత్తుచేసి సైన్యానికి అప్పగించడంలో సైన్యం ఆధారిత వర్క్ షాపులు కీలకమైన పాత్ర నిర్వహించాయి. వీటినికూడా ప్రభుత్వానికి చెందిన కాంట్రాక్టు నిర్వహణ (జీఓసీఓ) పేరుతో ప్రైవేటురంగానికి అప్పగించారు. పార్లమెంటులో రక్షణశాఖమంత్రి ఒక ప్రశ్నకు సమాధానంగా సైనిక వర్క్‌షాపులన్నింటినీ ఏడాదిలోపు మూసివేస్తున్నట్లు ప్రకటించడం ఇక్కడ గమనించవలసిన అంశం. స్వచ్ఛమైన పాలను జవాన్లకు సరఫరా చేసేందుకు సైన్యం నిర్వహించే డెయిరీ ఫార్మ్‌ను మూసివేసారు. నరేంద్రమోడీ ప్రభుత్వం మన దేశ రక్షణ,భద్రతతో ఆటలాడుకుంటోంది. విదేశీ బహుళజాతి సంస్థలు, భారత ప్రైవేటు కార్పొరేట్లపైన భారతసైన్యం ఆధారపడేందుకు వీలుగా పన్నినకుట్ర అత్యంత ప్రమాదకరమైనది. ఇది కేవలం రక్షణసిబ్బందికి మాత్రమే సంబంధించిన అంశంకాదు...ప్రస్తుత ప్రభుత్వ ప్రమాదకరమైన ఈ చర్యను దేశభక్తులైన పౌరులంతా వ్యతిరేకించాలి. కొత్త పెన్షన్ పథకాన్ని రద్దుచేసి, తిరిగి హామీతోకూడిన పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని రక్షణవిభాగ పౌర సిబ్బంది పోరాటం చేస్తున్నారు. ఈ సిబ్బంది పోరాటంలో దేశంలోని కార్మికులంతా భాగస్వాములుకావాలని, మన రక్షణ సంసిద్ధతపై తీవ్రప్రభావం చూపించగల ప్రభుత్వ తిరోగమన చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ విజ్ఞప్తి చేస్తున్నది.

ప్రధాని ప్రసంగానికి ఖండన

కేరళలో జరిగిన బహిరంగసభలో మాట్లాడిన ప్రధాని నరేంద్రమోడీ కమ్యూనిస్టులను, అక్కడి వామపక్ష ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని విమర్శించడంపై సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం బుధవారం ఒక ప్రకటనలో ఖండిస్తూ ఆయన వైఖరికి విచారం వ్యక్తం చేసింది. ఆయన ప్రసంగం కమ్యూనిస్టులపైనే కాకుండా రాజ్యాంగంపైన, బహుళసంస్కృతి, వైవిధ్యచరిత్రపైన దాడిచేయడమేనని సీపీఐ పేర్కొంది. చరిత్రను తిరగరాసి 'హిందూత్వ'ను దేశంపై రుద్దేందుకు భారత జాతీయతను పునర్‌నిర్వచించాలని ఆర్ఎస్ఎస్, బీజేపీలు ప్రయత్నిస్తున్నాయి. వీరు చేస్తున్న ప్రయత్నం భారతదేశ తరహా ఫాసిజం. పైన పేర్కొన్న అంశాలపై ప్రధాని వైఖరిని తిరస్కరిస్తూ రాజ్యాంగ పరిరక్షణకు నడుంకట్టాలని సెక్యులర్, ప్రజాస్వామ్య శక్తులకు సీపీఐ విజ్ఞప్తి చేసింది.

గెలిచి..నిలిచారు!



- రెండో వన్డే భారత్ కైవసం
- 1-1తో సిరీస్ సమం
- కోహ్లి శతకం..ధోనీ ఫినిషింగ్

అడిలైడ్:
నిలవాలంటే తప్పక గెలవాల్సిన అడిలైడ్ వన్డేలో కోహ్లిసేన రాణించింది. చివరి వరకూ ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో కెప్టెన్ కోహ్లి శతకంతో అదరగొట్టగా..ధోనీ ఫినిషింగ్ టచ్‌తో విజయం టీమిండియాను వరించింది. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయడంలో భారత బౌలర్లు తడబడినా.. కంగారూలు నిర్దేశించిన 299 పరుగుల లక్ష్యాన్ని భారత్ 6 వికెట్లు కోల్పోయి మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఛేదించి మూడు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. ఆసీస్ బ్యాట్స్‌మన్ షాన్ మార్ష్ శతకంతో చెలరేగాడు. భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొని 123 బంతుల్లో 131 పరుగులు చేసి భారీ స్కోరుకు బాటలు వేశాడు. వన్డేల్లో మార్ష్‌కిది 7వ శతకం. మార్ష్‌కి తోడుగా మ్యాక్స్‌వెల్(48 పరుగులు 37 బంతుల్లో) తనదైన శైలిలో దూకుడుగా ఆడాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 94 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. తొలుత ఆసీస్ టాప్ ఆర్డర్‌ను త్వరగానే పెవిలియన్‌కు పంపినా మిడిలార్డర్‌లో మార్ష్, మాక్స్‌వెల్ రాణించడంతో 300 పరుగులపై లక్ష్యాన్ని నార్దేశించేలా కనిపించింది. కానీ భారత బౌలర్లు ఆఖరి ఓవర్లలో విజృంభించడంతో కేవలం 15 పరుగుల తేడాతో ఆసీస్ చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. స్టాయినిస్ 29, ఖవాజా 21, హ్యాండ్స్‌కాంబ్ 20, కారే 18, నాథన్ లైయన్ 12, ఫించ్ 6 పరుగులు చేశారు. భారత బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 4, షమీ 3 వికెట్లు తీయగా.. జడేజా 1 వికెట్ పడగొట్టాడు.

కోహ్లి శతకం..
ఆస్ట్రేలియా నిర్దేశించిన 299 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా ధాటిగానే ఇన్నింగ్స్ ఆరంభించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు దూకుడుగా ఆడారు. అయితే, 7.4ఓవర్‌లో బెహ్రెన్‌డార్ఫ్ బౌలింగ్‌లో ధావన్(32) ఔటయ్యాడు. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లి.. ఓపెనర్ రోహిత్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. క్రీజులో కుదురుకున్నట్లు కనిపించిన ఈ జోడీని స్టాయినిస్ విడదీశాడు. రోహిత్‌శర్మ (43 పరుగులు) చేసి అర్ధ సెంచరీకి చేరువవుతున్న సమయంలో హ్యాండ్స్‌కోంబ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన రాయుడు(24) మ్యాక్స్‌వెల్ బౌలింగ్‌లో స్టోయినిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో మూడో వికెట్‌కు నమోదైన 59 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ధోని రాకతో కోహ్లికి మంచి భాగస్వామి దొరికాడు. ఇద్దరూ వికెట్ల మధ్య పరుగులు తీస్తూ, సమయం చిక్కినప్పుడు బౌండరీలు కొడుతూ స్కోరు బోర్డును వేగం పెంచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే వన్డేల్లో విరాట్ 39వ శతకాన్ని నమోదు చేశాడు. శతకం సాధించిన కొంత సమయానికే రిచర్డ్సన్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన కోహ్లి (104 పరుగుల 112 బంతులు, 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) బౌండరీ లైన్ వద్ద మ్యాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో నాలుగో వికెట్‌కు నమోదైన 82 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. భారత ఇన్నింగ్స్‌లో ఇదే అతిపెద్ద భాగస్వామ్యం కావడం గమనార్హం.

ధోని ఫినిషింగ్ టచ్..
కోహ్లి తరువాత వచ్చి దినేష్ కార్తీక్(25 నాటౌట్)తో కలిసి ధోని(55 నాటౌట్) మ్యాచ్‌కు ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. వీరు ఛేధించాల్సిన రన్‌రేట్ పెరగకుండా జాగ్రత్తగా ఆడారు. సింగిల్స్ తీస్తూ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు కొడుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపారు. చివరి ఓవర్లో భారత విజయానికి 7 పరుగులు కావాల్సి ఉండగా.. తొలి బంతిని ధోని సిక్స్‌గా మలిచాడు. ఈ సిక్స్‌తో ధోని కెరీర్‌లో 69వ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇది ధోనీకి ఈ సిరీస్‌లో వరుసగా రెండవ అర్ధశతకం కావడం విశేషం. మరుసటి బంతిని ధోని సింగిల్ తీయడంతో భారత్.. నాలుగు బంతులు మిగిలి ఉండగానే విజయాన్నందుకుంది. ఆసీస్ బౌలర్లలో బెహ్రెన్‌డార్ఫ్, రిచర్డ్సన్, స్టోయినిస్, మ్యాక్స్‌వెలు తలో వికెట్ తీశారు. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమమైంది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్ శుక్రవారం మెల్‌బోర్న్ వేదికగా జరగనుంది.


వార్మప్ చేస్తూ యువ క్రికెటర్ మృతి

కోల్‌కతా:
వార్మప్ సెషన్‌లో సాధన చేస్తూ 21ఏళ్ల యువ క్రికెటర్ మృతి చెందిన విషాద ఘటన కోల్‌కతాలో చోటు చేసుకుంది. పైక్‌పారా స్పోర్ట్స్ క్లబ్ తరపున క్రికెట్ ఆడుతున్న అంకిత్ శర్మ రోజూలాగే మంగళవారం కూడా మ్యాచ్ ఆడేందుకు వచ్చాడు. ఈ నేపథ్యంలో వార్మప్ చేస్తుండగా, అకస్మాత్తుగా గుండె పోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సహచరులు అతన్ని సిటీ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. అంకిత్ స్థానికంగానే తన తల్లి దండ్రులతో ఉంటున్నాడు. 'ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ అయిన అంకిత్, బౌలింగ్ కూడా చక్కగా చేస్తాడు. అంకిత్ చాలా మంచి క్రికెటర్. గతేడాది ఈ క్లబ్ చేరాడు. జట్టు సభ్యులతోనూ చక్కగా కలిసిపోతాడు. అంతేకాదు, మంచి ఫీల్డర్ కూడా. ఈ వార్త విని మేం షాకయ్యాం' అని కోచ్ వెల్లడించాడు. అంకిత్ మృతి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ సెక్రటరీ అవిషేక్ దాల్మియా విచారం వ్యక్తం చేశారు.

మూడో రౌండ్‌లో ఫెదరర్, నాదల్

రెండవ రౌండ్‌లో జోకోవిచ్

ఆండ్రసన్‌కు షాక్



మెల్‌బోర్న్ :
ఆస్ట్రేలియన్ ఓపెన్ మూడో రోజూ టాప్ సీడ్ల హవా కొనసాగింది. రెండో సీడ్ స్పేన్ బుల్ రఫెల్ నాదల్, మూడో సీడ్ రోజర్ ఫెదరర్ మూడో రౌండ్‌లో అడుగు పెట్టగా టాప్ సీడ్ జోకోవిచ్ మంగళవారం తొలి రౌండ్‌లో విజయం సాధించి టాప్ 64లో చేరాడు. మూడో రోజు ఆటలో దక్షిణాఫ్రికా స్టార్ 5వ సీడ్ కెవిన్ ఆండ్రసన్ ఓటమిపాలైయాడు. మహిళల టాప్ సీడ్లు మూడో రౌండ్‌లో అడుగుపెట్టారు. నాదల్ రెండో రౌండ్‌లో ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డన్‌పై 6-3, 6-2, 6-2 తేడాతో విజయం సాధించాడు. డిఫెండింగ్ చాంపియన్ ఫెదరర్ బ్రిటన్‌కు చెందిన ఇవాన్స్‌పై 7-6, 7-6. 6-3 తేడాతో విజయం సాధించాడు. తొలి రెండు సెట్లను టై బ్రేకర్‌లో గెలుచుకున్న ఫెదరర్ మూడో సెట్‌ను ఏకపక్షంగా గెలుచుకున్నాడు. ఆరో సీడ్ సిలిచ్ మూడో రౌండ్‌లో చేరాడు. 5వ సీడ్ ఆండ్రసన్ అమెరికాకు చెందిన టియఫే చేతిలో 6-4, 4-6, 4-6, 5-7 తేడాతో ఓడి టోర్నీ నుంచి వైదొలిగాడు. నెంబర్ వన్ సీడ్ జోకోవిచ్ మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో అమెరికాకు చెందిన క్రుగేర్‌పై 6-3, 6-2, 6-2 తేడా విజయం సాధించి రెండో రౌండ్‌లో అడుగుపెట్టాడు.

కెబర్, వోజ్నియాకి ముందంజ..
మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కెబర్ బ్రెజిల్‌కు చెందిన హడడ్ మయాపై 6-2, 6-3 తేడాతో , మూడో సీడ్ వోజ్నియాకా లార్సన్‌పై 6-1, 6-3 తేడాతో విజయం సాధించి మూడో రౌండ్‌లో అడుగుపెట్టారు. 8వ సీడ్ క్విటోవా, 5వ సీడ్ స్టిఫెన్స్, మారియా షరపోవా మూడో రౌండ్ చేరుకున్నారు. తొలి సీడ్ హెలెప్, 4వ సీడ్ ఒసాకా మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచుల్లో గెలిచి రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు.

సైనా, శ్రీకాంత్ శుభారంభం

కౌలాలంపూర్ :
మలేషియాలో జరుగుతున్న ఈ ఏడాది తొలి మాస్టర్స్, మలేషియా మాస్టర్స్ టోర్నీలో భారత షెట్లర్లు శుభారంభం చేశారు. సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్, కశ్యప్ రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు. మహిళల సింగిల్స్‌లో ఏడో సీడ్ సైనా నెహ్వాల్ హాంకాంగ్‌కు చెందిన డెంగ్ షాన్‌పై 21-18, 21-18 తేడాతో విజయం సాధించి రెండో రౌండ్‌లో అడుగుపెట్టింది. పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ శ్రీకాంత్ హాంకాంగ్‌కు చెందిన లాంగ్ ఆంగస్‌పై 21-17, 21-11 తేడాతో వరుస సెట్లలో గెలిచాడు. మరో సింగిల్స్‌లో క్వాలిఫయర్‌లో గెలిచి మెయిన్ డ్రాకు అర్హత పొందిన కశ్యప్ తొలి రౌండ్‌ను అధిగమించాడు. డెన్మార్క్‌కు చెందిన ప్రపంచ 20 ర్యాంకర్ రాస్‌మస్ గెమ్‌కేపై 19-21, 21-19, 21-10 తేడాతో విజయం సాధించాడు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ప్రణవ్ చోప్రా-సిక్కి రెడ్డి జోడి తొలి రౌండ్‌లో డచ్ జోడీ రాబిన్-సెలీనాపై 21-19, 21-17 తేడాతో విజయం సాధించారు. మహిళల డబుల్స్‌లో పోన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ రెండో రౌండ్‌లో అడుగుపెట్టింది.

పాండ్యా, రాహుల్‌పై విచారణ ప్రారంభం



న్యూఢిల్లీ :
సస్పెండ్ అయిన క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్ మంగళవారం బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీకి వివరణ ఇచ్చారు. 'కాఫీ విత్ కరణ్' షోలో చేసిన అనుచిత వ్యాఖ్యలపై జోహ్రీ విచారణ ఆరంభించారు. 'టెలిఫోన్ ద్వారా వారిద్దరూ సీఈవోతో మాట్లాడారు. కేవలం విచారణ ప్రారంభమైందని జోహ్రీ వారితో చెప్పారు. షోకాజ్ నోటీసులకు వారిద్దరి నుంచి వివరణ తీసుకున్నారు. బుధవారం నివేదికను క్రికెట్ పాలకుల కమిటీకి అప్పగించే అవకాశాలు ఉన్నాయి. షోకు హాజరు కావాలని, అనుచితంగా మాట్లాడాలని ఏజెంట్లు ఒత్తిడి చేశారా అన్న ప్రశ్నలు జోహ్రీ వేయలేదని తెలిసింది. ప్రస్తుతం విచారణ పూర్తయింది. తర్వాతి దశ అంబుడ్స్‌మన్ నియామకంతో మొదలవుతుంది' అరి బీసీసీఐ అధికారి వెల్లడించారు. సుప్రీం కోర్టు అంబుడ్స్‌మన్‌ను నియమించాల్సి ఉంది. యువ క్రికెటర్ల కెరీర్ ముగిసేలా చర్యలు ఉండొద్దని సీఓఏ అధినేత వినోద్ రాయ్ సూచిస్తున్నారు. కేవలం రెండు మ్యాచ్‌ల నిషేధం సరిపోతుందని పేర్కొన్నారు. మరో సభ్యురాలు డయానా ఎడుల్జీ మాత్రం వ్యవహారాన్ని బీసీసీఐ న్యాయశాఖ వద్దకు తీసుకెళ్లారు.

క్రీడా స్ఫూర్తిని పెంచుకోవాలి..!

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల



ముప్పాళ్ల గ్రామంలో జాతీయ కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాగేశ్వరరావు

విశాలాంధ్ర - ఈపూరు:
ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంచుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఈపూరు మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా రైతు మిత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మంగళవారం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముప్పాళ్ళ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ముప్పాళ్ళ గ్రామ ప్రజలు ఐకమత్యంగా ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడుపుకోవడం అభినందనీయమన్నారు. పాఠశాలలు, ఆసుపత్రి, తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం రోడ్లతో పాటు వ్యవసాయ రంగంలో కూడా రైతులు చైతన్యవంతులై ముందుకు రాణిస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామం ముప్పాళ్ళ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్ళినట్లయితే ఆయా గ్రామాలు కూడా అభివృద్ధి బాటలో నడుస్తాయన్నారు. ముప్పాళ్ళ గ్రామానికి దేశంలోని ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని మహాత్మా గాంధీ సందర్శించడం ఆయనకు తులాభారం చేసిన చరిత్ర ఈ గ్రామానికి ఉందన్నారు. గత 27 ఏళ్లుగా గ్రామంలో జాతీయస్థాయి క్రీడలు నిర్విరామంగా కొనసాగించడం అభినందనీయమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దేహదారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తరలివచ్చి పోటీలకు హాజరవటం సంతోషదాయకమన్నారు. క్రీడలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులలో స్నేహ సంబంధాలు కూడా పెంచుకోవచ్చు అన్నారు. క్రీడలలో మంచి ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని అన్నారు. అనంతరం వినుకొండ సీపీఐ ఏరియా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ యువతలో నూతన ఉత్తేజాన్ని చిన్న వయసు నుంచే క్రీడలలో అలవాటు పడి విద్యతో పాటు రాణించాలని అన్నారు. క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ నైపుణ్యత పెరుగుతాయని, యువత చెడు మార్గాలకు వెళ్లకుండా సమాజాభివృద్ధికి క్రీడలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, వినుకొండ నియోజకవర్గ ఏరియా కార్యదర్శి ఏ.మారుతివరప్రసాద్, ఈపూరు మండల సీపీఐ మండల కార్యదర్శి వూట్ల రామారావు, సూరే బ్రహ్మయ్య, నూజెండ్ల మండల సీపీఐ కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మహంకాళి సుబ్బారావు, వినుకొండ ఏరియా కార్యదర్శి సంపెంగల రవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐసీసీ అధికారిక స్పాన్సర్ ఎంపిక

విశాలాంధ్ర-విశాఖసిటీ :
ఇంటర్నేషన్ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) తో భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా క్రికెట్ బ్రాండ్ ఒప్పందాలు మరింత బలోపేతం చేసుకున్నట్టు ఫెర్నాడ్ రికార్డ్ ఇండియా కార్తీక్ మొహింద్రా తెలిపారు. ఇకపై క్రికెట్ అంతర్జాతీయ కార్యక్రమాలకు రాయల్‌స్టాగ్ అధికారిక స్పాన్సర్‌గా ఉంటుందన్నారు. ఈ భాగస్వామ్యం 2023 వరకు కొనసాగుతుందన్నారు. త్వరలో జరగనున్న ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్, ఐసీసీ టీ 20 వరల్డ్ కప్, ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్‌లు కూడా దీనిలో భాగంగా జరుగుతాయన్నారు. ప్రపంచంలో ఎక్కువమంది అభిమానించే క్రీడైన క్రికెట్‌కి స్పాన్సర్‌గా వ్యవహరించడం శుభపరిణామమన్నారు. 2000 సంవత్సరం నుంచి క్రికెట్‌తో మా ప్రయాణం మొదలైందన్నారు. ఈ డీల్‌తో దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులపై గణనీయ ప్రభావాన్ని చూపగలమన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తపరిచారు.

పాండ్యాకు మరో షాక్



ముంబై : మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదాలపాలైన టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు మరో షాక్ తగిలింది. ముంబైలో ప్రతిష్టాత్మక క్లబ్ అయిన 'ఖర్ జింఖానా'లో గౌరవ సభ్యత్వాన్ని కోల్పోయాడు. సోమవారం జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఖర్ జింఖానా సంయుక్త కార్యదర్శి గౌరవ్ కాపాడియా వెల్లడించారు. హార్దిక్ పాండ్యా సభ్యత్వాన్ని రద్దు చేసినట్టు స్పష్టం చేశారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా పాండ్యా, రాహుల్‌లపై బీసీసీఐ నిరవధిక సస్పెన్షన్ విధించిని విషయం తెలిసిందే.

సీవీ సర్వేశ్వరశర్మకు జీవన సాఫల్య పురస్కారం

కామన్‌వెల్త్ వొకేషనల్ విశ్వవిద్యాలయం ప్రదానం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
సుప్రసిద్ధ సైన్సు రచయిత, కోనసీమ సైన్సు పరిషత్ అధ్యక్షుడు సీవీ సర్వేశ్వరశర్మకు కామన్ వెల్త్ వొకేషనల్ విశ్వవిద్యాలయం ఫిజిక్స్‌లో పీహెచ్‌డీని ప్రదానం చేసింది. సైన్సులో ఈయన చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేసింది. ఇటీవల ముంబైలో జరిగిన స్నాతకోత్సవంలో ఈయనకు పురస్కారం అందించింది. సర్వేశ్వర శర్మ సిద్ధాంతగ్రంథాన్ని అత్యుత్తమ గ్రంథంగా విశ్వవిద్యాలయం పరిగణించింది. ఇగ్నో మాజీ ఉపకులపతి పంత్, సీబీఎస్‌సీ బోర్డు అకడమిక్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యన్, ఇండియా స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కమిషనర్ రాజ్ సిన్హాల చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా తీసుకున్నారు. పురస్కారంగా బంగారు పతకం, జ్ఞాపిక, సర్టిఫికెట్లను సర్వేశ్వరశర్మకు అందించారు. గత 40 సంవత్సరాలుగా సైన్సు విభాగంలో ఈయన చేస్తున్న కృషిని గుర్తించి పురస్కారం ఇచ్చినట్లు ఎంపిక కమిటీ పేర్కొంది. తూర్పుగోదావరిజిల్లా అమలాపురంకి చెందిన సర్వేశ్వరశర్మ ఎస్‌కేబీఆర్ కళాశాలలో దాదాపు ముప్పై ఐదు సంవత్సరాలు ఫిజిక్స్ అధ్యాపకునిగా, రీడర్‌గా పనిచేశారు. తొంభైరెండు పాపులర్ సైన్సు గ్రంథాలను జనరంజకంగా రాశారు. 1984లో కోనసీమ సైన్సు పరిషత్‌ను స్థాపించి రెండు తెలుగు రాష్ట్రాలలో అన్ని జిల్లాలు పర్యటించి 2,560 కోనసీమ సైన్సు పరిషత్ మహాసభలు స్వచ్ఛందంగా నిర్వహించారు. ఈయన ఉపన్యాసాలు సమ్మోహనాస్త్రాలుగా ఉంటాయి. రచనలు అతి సరళంగా రిఫరెన్సుగా ఉపయోగపడతాయి. వివిధ పత్రికల్లో తొమ్మిదివేల వరకు సైన్సు వ్యాసాలు రాశారు.

టిడ్కో గృహాలను త్వరగా నిర్మించాలి

- ఎన్టీఆర్ నగర్లు దేశానికే ఆదర్శం కావాలి
- గేటెడ్ కమ్యూనిటీలతో సమానంగా సదుపాయలు కల్పించాలి
- టెలీకాన్ఫరెన్సులో చంద్రబాబు ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
రాష్ట్రంలో టిడ్కో ఆధ్వర్యంలో అర్బన్‌లో నిర్మితమవుతున్న గృహసముదాయాలను యుద్ధప్రాతిపదికన నిర్మించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి బుధవారం ఆయన పురపాలక, ఇంధనశాఖ అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్స్ పథకంలోని ఈ గృహ సముదాయాలు దేశానికే ఆదర్శంగా నిలవాలని సూచించారు. గేటెడ్ కమ్యూనిటీ గృహనిర్మాణాలతో సమానంగా వీటిలో కూడా మౌలికసదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ పక్కా ఇళ్లలో ఇంధన సామర్థ్యం స్టార్ రేటెడ్ గృహోపకరణాలను అందజేయాలన్నారు. 9వాట్స్ ఎల్‌ఈడీ బల్బులు, 20 వాట్స్ ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్లు, 50వాట్స్ ఇంధన సామర్థ్యం కలిగిన ఫ్యాన్లు అందజేయాలన్నారు. అలాగే వీధుల్లో ఎల్‌ఈడీ దీపాలు అమర్చాలని సూచిం చారు. దీనివలన నివాసం ఉండే పేదలకు నెలవారీ విద్యుత్ బిల్లు తగ్గుతుందని అన్నారు. ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో తొలుత 75వేల యూనిట్లలో ఉన్న లబ్ధిదారు లకు స్టార్ రేటెడ్ ఉపకరణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌ఈడీ దీపాలను అమర్చడం వలన ఏటా 54.5 మిలియన్ల మేరకు విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఈనేపథ్యంలో రూ.32కోట్లు పొదుపు చేయవచ్చునని అధికారులకు తెలిపారు. ఎన్‌టీఆర్ నగర్స్‌లో అంతర్గత రహదారులు, విద్యుత్, నీటి సరఫరా, మురుగు కాల్వలు, ఆసుపత్రులు, పాఠశాలలు, పచ్చదనం వంటి అన్ని సదుపా యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈపథకంలో ఇంధన సామర్థ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నారంటూ పురపాలకశాఖ, ఏపీ టిడ్కో అధికారులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఇంధన సామర్థ్యంలో ఏపీ ఇప్పటికే చరిత్ర సృష్టించిందన్నారు. ఇంధన కార్యక్రమాల అమలు సన్నద్ధతలో నెంబర్‌వన్‌గా ఉన్నట్లు ప్రపంచబ్యాంకు ప్రకటించిందని సీఎం అన్నారు. ఎల్‌ఈడీ వీధిదీపాల ఏర్పాటులో జాతీయ రికార్డు సృష్టించామని చెప్పారు. రాష్ట్రంలో ఈ పథకంలో మొత్తంగా 5.29లక్షల ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. దీనికోసం 511 ఎకరాల భూమి కొనుగోలు చేయగా రూ.176కోట్లు వెచ్చించామన్నారు. టెలీ కాన్ఫరెన్సులో పురపాలకశాఖ మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, సీఎం ప్రత్యేక కార్యదర్శి సతీష్‌చంద్ర, సీఎం ముఖ్యకార్యదర్శి సాయిప్రసాద్, సీఎం కార్యదర్శి గిరిజాశంకర్, సీఎం అదనపు కార్యదర్శి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.